

# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

15.09.2025
సోమవారం | అనంతపురం
సంపుటి : 10 | సంచిక: 139
పేజీలు : 12 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## పాక్ చిత్తు.. చిత్తు

- ఆసియా కప్‌లో ఓడించిన ఇండియా
- 7 వికెట్ల తేడాతో దాయాదిపై విక్టరీ
- పాకిస్థాన్ 127/9, కుల్‌దీప్ యాదవ్ (3/18)
- టీమ్ఇండియా 128/3 (15.5 ఓవర్లు)

2లో..



## బస్‌స్టేషన్ల అభివృద్ధిపై ఫోకస్

### తిరుపతి బస్‌స్టేషన్ టాప్ ప్రయారిటీ



- యాత్రికుల రద్దీ దృష్టిలో పెట్టుకుని నిర్మాణం
- భవిష్యత్తులో అన్ని ఎలక్ట్రిక్ బస్సులు నడిపేలా ప్రణాళికలు
- ప్రతి బస్సుకు చార్జింగ్ పాయింట్ ఉండేలా చూడాలి
- అధికారులకు సూచించిన చంద్రబాబు
- రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బస్ స్టేషన్ల ఆధునికీకరణ
- అభివృద్ధి చేసేందుకు స్టేక్ హోల్డర్లతో మీటింగ్ పెట్టాలి

2లో..



అమరావతి, సెప్టెంబర్ 15,
అనంతజనశక్తి న్యూస్

రాష్ట్రంలో అన్ని బస్‌స్టేషన్లు ఆధునికీకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఏపీ సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. రోజురోజుకు పెరుగుతోన్న యాత్రికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని తిరుపతిలో అత్యాధునిక బస్‌స్టేషన్ నిర్మించాలని ఆదేశించారు. అన్ని సౌకర్యాలతో ఆకట్టుకునేలా ఉండాలని, భవిష్యత్‌లో అన్నీ ఎలక్ట్రిక్ బస్సులే నడపనున్న నేపథ్యంలో ప్రతి బస్సుకు ఛార్జింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. దీనికి మొత్తం 5 మోడల్‌స్‌ను చంద్రబాబు పరిశీలించారు.

## చెస్‌లో ప్రపంచ నారా దేవాన్ష్ రికార్డు

- లండన్‌లోని వెస్ట్ మినిస్టర్ హాల్‌లో ఈవెంట్
- అభినందించిన తాత చంద్రబాబు, తండ్రి లోకేశ్



2లో..

## గండికోటకు మోస్ట్ ప్రామిసింగ్ న్యూ డెస్టినేషన్ అవార్డు

2లో..



## దేశ వ్యతిరేక శక్తులను కాంగ్రెస్ రక్షిస్తోంది

- ఈశాన్య రాష్ట్రాల పర్యటనలో ప్రధాని మోదీ
- ఈశాన్య రాష్ట్రాలకు నెహ్రూ అన్యాయం చేశారు
- అప్పటి గాయం ఇంకా మానలేదు
- గాయంపై ఇప్పుడు ఉప్పు చల్లుతున్నది
- ఇండియన్ ఆర్మీని కాంగ్రెస్ అవమానించింది



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 14,
అనంతజనశక్తి న్యూస్


2లో..

ఈశాన్య రాష్ట్రాల పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం అస్సాం లో పర్యటించారు. దరంగ్ జిల్లాలో బహిరంగ సభలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పై తీవ్ర విమర్శలు చేశారు. '1962లో చైనాతో యుద్ధం తర్వాత అప్పుడు ప్రధానిగా ఉన్న నెహ్రూ ఈశాన్య ప్రాంత ప్రజలకు చేసిన గాయాలు నేటికీ మానిపోలేదు. ప్రస్తుత తరం కాంగ్రెస్ ఆ గాయాలపై ఇప్పటికీ ఉప్పు చల్లుతుంది' అని మోదీ ఆరోపించారు. కాంగ్రెస్ తన రాజకీయాల కోసం భారత్‌పై వ్యతిరేక భావజాలం ఉన్న వ్యక్తులతో జట్టు కట్టిందని విమర్శించారు.

## ప్రపంచ శక్తిగా భారత్

- అన్ని రంగాల్లో మహిళలు అభివృద్ధి
- లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా
- మహిళా శక్తితోనే ప్రపంచంలో ముఖ్యదేశంగా భారత్
- తిరుపతి మహిళా సాధికారత సదస్సుకు హాజరు

2లో..



తిరుపతి, సెప్టెంబర్ 14,
అనంత జనశక్తి న్యూస్

మహిళా శక్తి కారణంగానే ఇవాళ ప్రపంచంలోనే భారత్ ముఖ్యదేశంగా అవతరించిందని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. తిరుపతిలో జరుగుతున్న "మహిళా సాధికారత సదస్సు"లో ఆయన మాట్లాడారు. మహిళకు గౌరవం ఇవ్వడం ఆది నుంచి వస్తున్న సాంప్రదాయం అని చెప్పారు. మహిళల భాగస్వామ్యం లేకుండా ఏ దేశము కూడా అభివృద్ధి చెందలేదని అన్నారు.

## ఆస్తులపై ఆందోళన అక్కర్లేదు

- గొడుగుపేట వెంకటేశ్వర స్వామి ఆలయఆస్తులపై
- మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి

2లో..



విజయవాడ, సెప్టెంబర్ 14,
అనంత జనశక్తి న్యూస్

గొడుగుపేట వెంకటేశ్వర స్వామి ఆలయ ఆస్తులపై ఆందోళన అవసరం లేదని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. వెంకటేశ్వర స్వామి ఆస్తులను పరిరక్షిస్తూ ఆదాయం పెంచేలా చర్యలు చేపట్టామని తెలిపారు. విజయవాడ ఉత్సవ్ కోసం 56 రోజులు వినియోగించుకునేలా ఒప్పందం చేసుకున్నారని, వినియోగానికి రూ.45 లక్షలు చెల్లించేలా ఒప్పందం కుదిరిందని అన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీకి ఆయన చెక్కు అందజేశారు.

## సంక్షోభం నుంచి అభివృద్ధి దిశగా..

- ఉచిత బస్సుపై మంత్రి మరోసారి సెటర్లు
- మంత్రి సత్యకుమార్ యాదవ్ కీలక వ్యాఖ్యలు
- దివాళా తీసిన ఆర్థిక వ్యవస్థను

2లో..

అమరావతి, సెప్టెంబర్ 14,
అనంతజనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై, అభివృద్ధిపై మంత్రి సత్యకుమార్ యాదవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. దివాళా తీసిన ఆర్థిక వ్యవస్థను వారసత్వంగా స్వీకరించి దేశానికి విశ్వగురువుగా మార్చేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఇక, ప్రజల మనోభావాలకు అనుగుణంగా డబుల్ ఇంజన్ సర్కార్ రాష్ట్రంలో అద్భుతంగా పని చేస్తోందని చెప్పుకొచ్చారు.

## వైసీపీ అవినీతిని చంద్రబాబు ఆపారు

- ప్రధాని మోదీ సహకరించారు
- కూటమి పాలనతో రాష్ట్రంలో అభివృద్ధి
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా
- సారథ్యం యాత్ర ముగింపు సభకు హాజరు

2లో..



విశాఖపట్నం, సెప్టెంబర్ 14,
అనంతజనశక్తి న్యూస్

ప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు పాలనలో ఆంధ్రప్రదేశ్ ప్రగతి పథంలో నడుస్తోందని భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ చేపట్టిన 'సారథ్యం' యాత్ర ముగింపు సభలో మాట్లాడారు.

## రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులు రానున్నాయ్

- గ్లోబల్ సమ్మిట్‌లో ప్రపంచ దేశాలను ఆకట్టుకున్నాం
- అవసమైనంత మేరకే యూరియాను వినియోగించాలి
- రాష్ట్ర ఎంఎస్ఎంఈ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్



8లో..

జనశక్తి
జనం కోసమే మా అక్షరం
సోమవారం | అనంతపురం
15.09.2025





# చెస్‌లో ప్రపంచ నారా దేవాన్ష్ రికార్డు

లండన్, సెప్టెంబర్ 14, అనంతజనశక్తి న్యూస్

వేగవంతమైన చెక్‌మేట్ సాల్వర్ 175 పజిల్స్ సాధించి నారా దేవాన్ష్ ప్రపంచ రికార్డ్ అందుకున్నారు. ఈ మేరకు లండన్‌లోని వెస్ట్ మినిస్టర్ హాల్‌లో జరిగిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డుల వేడుకలో దేవాన్ష్‌కు నిర్వాహకులు అవార్డును ప్రదానం చేశారు. గతేడాది చెక్‌మేట్ మారథాన్‌లో 175 చెక్‌మేట్ సవాళ్లను పరిష్కరించి దేవాన్ష్ ప్రపంచ రికార్డ్ నెలకొల్పారు. చెస్ డొమైన్‌లో గతంలోనూ మరో రెండు రికార్డులు సాధించారు. దేవాన్ష్ సాధించిన ఈ ఘనత ఎంతో గర్వకారణమని అతడి తండ్రి, ఏపీ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. 10 ఏళ్ల వయసులోనే ఆలోచనలకు పదును పెడుతూ, ఒత్తిడిలో ప్రశాంతంగా ఉంటూ అంకిత భావంతో దేవాన్ష్ చెస్ నేర్చుకున్నాడని చెప్పారు. అతడి కష్టాన్ని, గంటల తరబడి కఠోర శ్రమను తండ్రిగా ప్రత్యక్షంగా చూశానని తెలిపారు. కష్టానికి తగ్గ ప్రతిఫలం చూసి ఎంతో ఆనందిస్తున్నాని చెప్పారు.

# ప్రపంచ శక్తిగా భారత్

తిరుపతి, సెప్టెంబర్ 14, అనంత జనశక్తి న్యూస్

మహిళా శక్తి కారణంగానే ఇవాళ ప్రపంచంలోనే భారత్ ముఖ్యదేశంగా అవతరించిందని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. తిరుపతిలో జరుగుతున్న "మహిళా సాధికారత సదస్సు"లో ఆయన మాట్లాడారు. మహిళకు గౌరవం ఇవ్వడం ఆది నుంచి వస్తున్న సాంప్రదాయం అని చెప్పారు. మహిళల భాగస్వామ్యం లేకుండా ఏ దేశము కూడా అభివృద్ధి చెందలేదని అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో వారు ముఖ్యపాత్ర పోషించారని చెప్పారు. అనేక కీలక రంగాల్లో మహిళలు నాయకత్వ స్థానాల్లో ఉంటూ రాణిస్తున్నారని, సామాజిక బంధనాలను ఛేదించుకుని అనేక ఉద్యమాల్లో వారు పాల్గొన్నారని అన్నారు. ఆదివాసీ నేపథ్యం నుంచి వచ్చిన మహిళ దేశానికి రాష్ట్రపతిగా ఉన్నారన్నారు. రాజకీయ, శాస్త్ర సాంకేతిక రంగాల్లో, సైన్యంలోనూ స్త్రీలు కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, మహిళా ప్రగతి, భారత ప్రగతి అని అన్నారు. వారు సామాజిక, ఆర్థిక ప్రగతి సాధించాలని ఆకాంక్షించారు. రానున్న రోజుల్లో టెక్నాలజీ వల్ల కలిగే ఇబ్బందులను మహిళలు సమర్థవంతంగా ఎదుర్కోవాలని, ఆ దిశగా ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు.

# ఆస్తులపై ఆందోళన అక్కర్లేదు

విజయవాడ, సెప్టెంబర్ 14, అనంత జనశక్తి న్యూస్

గొడుగుపేట వెంకటేశ్వర స్వామి ఆలయ ఆస్తులపై ఆందోళన అవసరం లేదని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. వెంకటేశ్వర స్వామి ఆస్తులను పరిరక్షిస్తూ ఆదాయం పెంచేలా చర్యలు చేపట్టామని తెలిపారు. విజయవాడ ఉత్సవ్ కోసం 56 రోజులు వినియోగించుకునేలా ఒప్పందం చేసుకున్నారని, వినియోగానికి రూ.45 లక్షలు చెల్లించేలా ఒప్పందం కుదిరిందని అన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీకి ఆయన చెక్కు అందజేశారు.

వెంకటేశ్వరస్వామి పాదాల వద్ద చెక్కు ఉంచి.. ప్రత్యేక పూజలు నిర్వహించారు. భవిష్యత్‌లో మరింత ఆదాయం సమకూరేలా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. భూములను పరిరక్షించడం తమ తక్షణ కర్తవ్యమని, అవసరం మేరకు భూముల చుట్టూ ఫెన్సింగ్ వేసి కాపాడుకుంటామని వివరించారు. స్వామివారి సమక్షంలోనే ఒప్పందం చేసుకోవడం హర్షణీయమన్నారు.

# సంక్షోభం నుంచి అభివృద్ధి దిశగా..

## విశ్వగురువుగా మార్చేందుకు మోడీ కృషి చేస్తున్నారు

అమరావతి, సెప్టెంబర్ 14, అనంతజనశక్తి న్యూస్


ఆంధ్రప్రదేశ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై, అభివృద్ధిపై మంత్రి సత్యకుమార్ యాదవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. దివాళా తీసిన ఆర్థిక వ్యవస్థను వారసత్వంగా స్వీకరించి దేశానికి విశ్వగురువుగా మార్చేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఇక, ప్రజల మనోభావాలకు అనుగుణంగా డబుల్ ఇంజన్ సర్కార్ రాష్ట్రంలో అద్భుతంగా పని చేస్తోందని చెప్పుకొచ్చారు. గత ఐదేళ్ల విధ్వంసకరమైన పాలన నుంచి రాష్ట్రాన్ని బయటకు తీయడమే కాకుండా, అభివృద్ధి సంక్షేమాన్ని సమాంతరంగా అమలు చేస్తున్నామని సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.అలాగే, రాష్ట్ర ప్రజలకు అందుబాటులో ఉన్న ఉచిత బస్సు సౌకర్యం వల్లే ఉదయం "మెరుపు కలలు" సినిమా వైజాగ్‌లో, మధ్యాహ్నం అనకాపల్లిలో "మేఘ సందేశం", సాయంత్రం రాజమండ్రిలో "కార్తీక దీపం" సీరియల్ చూసి తిరిగి ఇంటికి చేరుకునే అవకాశం కలుగుతోందని మంత్రి సత్యకుమార్ ఎద్దేవా చేశారు. దివాళా స్థాయి నుంచి అభివృద్ధి పథంలో ముందుకు కొనసాగుతున్న ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు దేశానికి రోల్ మోడల్‌గా మారిందన్నారు. ఇకపై భౌగోళికంగా, రాజకీయంగా, సంస్థాగతంగా రాష్ట్రంలో బీజేపీని మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

# సీఎం తిరుపతి పర్యటన రద్దు

- వాతావరణం అనుకూలించకపోవడమే కారణం
- అమరావతి- తిరుపతి మధ్య దట్టమైన మేఘాలు
- చంద్రబాబు పర్యటనకు అనుమతి ఇవ్వని ఏవియేషన్

అమరావతి, సెప్టెంబర్ 14, అనంతజనశక్తి న్యూస్

తిరుపతిలో ఇవాళ జరుగుతున్న జాతీయ మహిళా సాధికారిత సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరుకావాల్సిన ముఖ్యమంత్రి చంద్రబాబు తన పర్యటనను రద్దు చేసుకున్నారు. వాతావరణం అనుకూలించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు అధికారికంగా ప్రకటించారు. అయితే, అమరావతి తిరుపతి మార్గంలో దట్టమైన మేఘాలు కమ్ముకోవడంతో హెలికాప్టర్ ప్రయాణం సురక్షితం కాదని ఏవియేషన్ అధికారులు తెలిపారు. దీంతో సీఎం చంద్రబాబు పర్యటనకు అనుమతి ఇవ్వలేదు. మరోవైపు, తిరుపతిలోని రాహుల్ కన్వెన్షన్ హాల్లో జరిగే మహిళా సాధికారతపై జాతీయ సదస్సులో లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా, ఏపీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, బీజేపీ ఎంపీ పురందరేశ్వరి సహా పలు రాష్ట్రాలకు చెందిన 100 మంది ప్రముఖులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నేటి నుంచి రెండ్రోజుల పాటు జరగనుంది.



# అసెంబ్లీకి రాకుండా జీతాలు తీసుకుంటున్నారు

- చిరుద్యోగులు కూడా 'నో వర్క్ - నో పే' విధానం పాటిస్తున్నారు
- అసెంబ్లీ రాకపోతే చర్యలు తీసుకుంటాం
- లోక్‌సభ స్పీకర్ మార్గదర్శకాలు ఇవ్వాలి

అమరావతి, సెప్టెంబర్ 14, అనంతజనశక్తి న్యూస్

తిరుపతిలో జరిగే జాతీయ మహిళా సాధికారత సదస్సులో ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. వెంకటేశ్వర స్వామి సన్నిధిలో జాతీయ మహిళ సదస్సు జరగడం సంతోషంగా ఉందన్నారు. మహిళల అండగా నిలబడేలా మనం చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళలకు సమానమైన అవకాశాలు కల్పించాలి.. రాష్ట్రాలు, పార్టీలు వేరైన మహిళల కోసం అందరూ కలిసి కట్టుగా ముందుకు వెళ్ళాలి అన్నారు. మహిళలకు ఆస్తిలోనూ, ఉద్యోగాల్లో రిజర్వేషన్ ఇచ్చిన పార్టీ టీడీపీ.. మహిళల కోసం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఘనత చంద్రబాబుది అని స్పీకర్ అయ్యన్న తెలియజేశారు.

అయితే, నా బాధను మనసు విప్పి చెబుతున్నాను.. కొందరు ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకపోయినా జీతం తీసుకుంటున్నారు అని శాసన సభా స్పీకర్ అయ్యన్న పాత్రుడు తెలిపారు. మనల్ని ప్రజలు ఎన్నుకున్నది ప్రజా సమస్యలు పరిష్కరించడానికే.. ఉద్యోగాలకు రాకపోతే ఉద్యోగులపై చర్యలు తీసుకుంటున్నాం.. చిరుద్యోగులు సైతం 'నో వర్క్ - నో పే' విధానం అనుసరిస్తున్నారు.. కానీ, అసెంబ్లీకి రాకపోతే తీసుకోవాల్సిన చర్యలపై లోక్ సభ స్పీకర్ మార్గదర్శకాలు జారీ చేయాలని కోరారు. ఏడాదిలో అసెంబ్లీ సమావేశాలు జరిగేదే 45 రోజులు.. వాటికి కూడా రాకపోతే ఎలా? అని ప్రశ్నించారు. గెలిచిన వారు గుండెలపై చేయి వేసుకొని ఆలోచించాలని స్పీకర్ అయ్యన్న చెప్పుకొచ్చారు.

# వైసీపీ అవినీతిని చంద్రబాబు ఆపారు

- వైసీపీ.. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించింది
- మాది 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్'
- ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేశాం

విశాఖపట్నం, సెప్టెంబర్ 14, అనంతజనశక్తి న్యూస్

ప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు పాలనలో ఆంధ్రప్రదేశ్ ప్రగతి పథంలో నడుస్తోందని భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ చేపట్టిన 'సారథ్యం' యాత్ర ముగింపు సభలో ఆయన మాట్లాడారు. గత వైకాపా ప్రభుత్వం.. అవినీతి, ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలు అవలంబించిందని విమర్శించారు.

"ప్రస్తుతం 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్' నినాదంతో ముందుకు వెళ్తున్నాం. అయోధ్యలో రామ మందిరం నిర్మించాం. ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేశాం. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడం కోసం జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు ముందుగానే దసరా, దీపావళి తీసుకొచ్చాం. రాష్ట్రంలో జాతీయ రహదారులు అభివృద్ధి చేశాం. విశాఖ, కాకినాడ, తిరుపతి స్మార్ట్ సిటీలుగా నిలుస్తున్నాయి. సాగర్‌మాల పేరుతో 14 పోర్టులు నిర్మిస్తున్నాం. పది కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థలు ఏర్పాటు చేశాం. కొత్తగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఇచ్చాం. రైల్వేలో అమృత్ భారత్, వందే భారత్ తెచ్చాం. విశాఖ, విజయవాడ, ఓర్వకల్లును అభివృద్ధి చేశాం. భోగాపురానికి రూ.625 కోట్ల నిధులు ఇస్తున్నాం. ఆరు కొత్త వైద్య సంస్థలు ప్రారంభించాం. ప్రపంచంలో అతి ఎక్కువ మంది ప్రజాప్రతినిధులు ఉన్న పార్టీ భాజపా. మోదీ నాయకత్వంలో 12 ఏళ్లుగా అభివృద్ధిలో ముందుకు వెళ్తున్నాం. త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించబోతుంది.

**2014కు ముందు దేశంలో అసమర్థ, వారసత్వ రాజకీయాలు**

2014కు ముందు దేశంలో అసమర్థ, వారసత్వ రాజకీయాలు నడిచేవి. అప్పట్లో దేశంలో అవినీతి రాజ్యమేలింది. 2014కు ముందు ప్రజలను మభ్య పెట్టేందుకు మేనిఫెస్టో తీసుకొచ్చి ఎన్నికలయ్యాక మరిచిపోయేవారు. వైకాపా పాలనలో రాష్ట్రం అంధకారంలోకి వెళ్లిపోయింది. ఆ పార్టీ అవినీతి పాలనకు చంద్రబాబు, మోదీ చరమగీతం పాడారు. ఇప్పుడు మోదీ పాలనలో దేశం అభివృద్ధి పథంలో నడుస్తోంది. ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలి. ఆంధ్ర ప్రజల గుండెల్లో మోదీ ఉన్నారు. ఆయన గుండెల్లో ఆంధ్రప్రదేశ్ ఉంది. సైద్ధాంతిక పునాదులపై నిర్మాణమైన పార్టీ భాజపా" అని జేపీ నడ్డా అన్నారు.

**బీజేపీలో చేరిన పోతుల సునీత**

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత.. వైసీపీ నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల్లోకి వలసలు కొనసాగుతున్నాయి. వైసీపీకి చెందిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు,



రాజ్యసభ ఎంపీలు, ఎమ్మెల్సీలు ఆ పార్టీని వీడారు. కొంతమంది తమ పదవులకు రాజీనామా చేసి ఇతర పార్టీల్లో చేరారు. ఎక్కువ మంది తెలుగుదేశం పార్టీలో చేరితే స్థానిక రాజకీయ పరిణామాలకు అనుగుణంగా మరికొంతమంది జనసేన, బీజేపీ కండువాలు కప్పుకున్నారు. తాజాగా మరో నేత బీజేపీలో చేరిపోయారు. మాజీ ఎమ్మెల్సీ పోతుల సునీత , ఆమె భర్త బీజేపీ కండువా కప్పుకున్నారు. భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సమక్షంలో పోతుల సునీత కాషాయ కండువా కప్పుకున్నారు. మరోవైపు పోతుల సునీత రాజకీయ ప్రస్థానం తెలుగుదేశం పార్టీతో మొదలైంది. 2017లో పోతుల సునీత టీడీపీ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2019 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రకాశం జిల్లా చీరాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ తరుపున పోటీ చేయాలని భావించారు. అయితే టీడీపీ అధిష్టానం వేరొకరికి టికెట్ కేటాయించింది. ఆ తర్వాతి పరిణామాల్లో 2020 నవంబర్ నెలలో పోతుల సునీత టీడీపీకి రాజీనామా చేశారు. టీడీపీ ప్రాథమిక సభ్యత్వంతో పాటుగా ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన పోతుల సునీత.. అధికార పార్టీ అయిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. అనంతరం వైసీపీ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు.

2024 ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం పాలైంది. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఫలితాలు వెల్లడైన కొన్ని రోజులకు.. అంటే సుమారుగా ఏడాది కిందట పోతుల సునీత తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. అలాగే వైసీపీని వీడుతున్నట్లు ప్రకటించారు. అప్పటి నుంచి ఆమె తిరిగి టీడీపీ గూటికి చేరతారంటూ ప్రచారం జరిగింది. అయితే ఊహించని విధంగా ఆమె భారతీయ జనతా పార్టీ కండువా కప్పుకున్నారు. మరోవైపు వైసీపీకి ఇప్పటికే పలువురు రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆ స్థానంలో కొత్త ఎన్నికలు జరిగి కొత్తవారు కూడా ఎన్నికయ్యారు.

# గండికోటకు మోస్ట్ ప్రామిసింగ్ న్యూ డెస్టినేషన్ అవార్డు

- బీఎల్‌టీఎం 2025లో చోటు
- కడప జిల్లాలోని గండికోటకు పురస్కారం
- అవార్డు అందుకున్న అధికారి పద్మారాణి
- ఢిల్లీలో సదస్సుకు హాజరైన అధికారులు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 14, అనంత జనశక్తి న్యూస్

వైఎస్ఆర్ కడప జిల్లాలోని గండికోటకు జాతీయ స్థాయి గుర్తింపు దక్కింది. దిల్లీలో జరిగిన (బిజినెస్ లీజర్ ట్రావెల్ అండ్ ఎగ్జిబిషన్) 2025లో గండికోట 'మోస్ట్ ప్రామిసింగ్ న్యూ డెస్టినేషన్' అవార్డును గెలుచుకుంది. ఏపీ టూరిజం అథారిటీ చీఫ్ మార్కెటింగ్, కమ్యూనికేషన్ ఆఫీసర్ పద్మారాణి ఈ అవార్డును అందుకున్నారు. శుక్రవారం నుండి ఆదివారం వరకు యశోభూమి, ఇండియా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్(ఐఐసీసీ)లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ వారసత్వ ప్రదేశాలు, సహజమైన బీచ్ గమ్యస్థానాలు, గ్రామీణ పర్యాటక అనుభవాలు, పర్యావరణపర్యాటక చొరవలను ప్రదర్శించారు. గండికోటకు ఐసీఆర్టీ(ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ రెస్పాన్సిబుల్ టూరిజం), భారత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖ మద్దతుతో బాధ్యతాయుతమైన పర్యాటక అవార్డులు విభాగంలో అవార్డును అందుకుంది. గండికోటకు జాతీయ స్థాయిలో గుర్తింపుతో సాహసోపేత పర్యాటకులకు గమ్యస్థానంగా మారుతుందని భావిస్తున్నారు.

బీఎల్‌టీఎం 2025 సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పర్యాటక ప్రతినిధులు వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శ్రీలంక, ఇజ్రాయెల్, రష్యా, ఐరోపా వంటి దేశాల నుంచి వచ్చిన కార్పొరేట్ సంస్థలు, ప్లానర్లు, టూర్ ఆపరేటర్లు, గమ్యస్థాన నిర్వహణ కంపెనీలు, హాస్పిటాలిటీ బ్రాండ్‌లు, అంతర్జాతీయ పర్యాటక బోర్డుల ప్రతినిధులకు రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల గురించి వివరించారు ఏపీ పర్యాటక సంస్థ ప్రతినిధులు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశాఖపట్నం, గండికోట, సూర్యలంక బీచ్ వంటి ప్రదేశాలలో ప్రపంచ స్థాయి సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. పర్యాటకులను అధిక సంఖ్యలో ఆకర్శించాలనుకుంటోంది. సమావేశాలు, కార్పొరేట్ ఈవెంట్‌లు, ప్రోత్సాహక ప్యాకేజీలను లక్ష్యంగా చేసుకుని పర్యాటక విభాగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలి అనుకుంటోంది. బీఎల్‌టీఎం ఈవెంట్‌లో 500 మందికి పైగా ఎగ్జిబిటర్లు, 15,000 మంది ప్రీక్వాలిఫైడ్ బయ్యర్స్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక సామర్థ్యాన్ని ప్రదర్శించారు.

# దేశ వ్యతిరేక శక్తులను కాంగ్రెస్ రక్షిస్తోంది

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 14, అనంతజనశక్తి న్యూస్

ఈశాన్య రాష్ట్రాల పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం అస్సాం లో పర్యటించారు. దరంగ్ జిల్లాలో బహిరంగ సభలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పై తీవ్ర విమర్శలు చేశారు. '1962లో చైనాతో యుద్ధం తర్వాత అప్పుడు ప్రధానిగా ఉన్న నెహ్రూ ఈశాన్య ప్రాంత ప్రజలకు చేసిన గాయాలు నేటికీ మానిపోలేదు. ప్రస్తుత తరం కాంగ్రెస్ ఆ గాయాలపై ఇప్పటికీ ఉప్పు చల్లుతుంది' అని మోదీ ఆరోపించారు. కాంగ్రెస్ తన రాజకీయాల కోసం భారత్‌పై వ్యతిరేక భావజాలం ఉన్న వ్యక్తులతో జట్టు కట్టిందని విమర్శించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో కూడా ఇది బయటపడిందన్నారు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాదులను మన సైన్యం మట్టుబెట్టిందన్నారు. కానీ, హస్తం పార్టీ మాత్రం మన సైన్యానికి కాకుండా దాయాది దేశంలోని సైన్యానికి మద్దతిస్తోందన్నారు. పాక్ అబద్ధాలు కాంగ్రెస్ అజెండాలుగా మారుతున్నాయన్నారు. ప్రస్తుతం ఆక్రమణదారులకు, దేశ వ్యతిరేకులకు ఆ పార్టీ రక్షణ కవచంగా మారిందంటూ.. వారితో జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు.

'నేను శివభక్తుడిని. మీరు నన్ను ఎంత తిట్టినా.. శివుడిలా విషాన్ని గొంతులోనే దాచుకుంటా. కానీ, ఎవరికైనా అవమానం జరిగితే మాత్రం తట్టుకోలేను. గాయకుడు భూపెన్ హజారికాకు భారతరత్న ఇవ్వడం మంచి నిర్ణయమా కాదా? కానీ ఆయనకు భారతరత్న ఇచ్చి గౌరవించినందుకు కాంగ్రెస్ పార్టీ అవమానించింది' అని మోదీ అన్నారు. ఈ సందర్భంగా ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటని పేర్కొన్నారు. దీనికి ముందు దరంగ్ జిల్లాలోని మంగల్‌డోయ్‌లో రూ.6,300 కోట్ల విలువైన ఆరోగ్య, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. దరంగ్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్ నిర్మాణంతో పాటు, నర్సింగ్ కాలేజీ, జీఎన్ఎమ్ పాఠశాలను ప్రారంభించారు.

# బస్‌స్టేషన్ల అభివృద్ధిపై ఫోకస్

అమరావతి, సెప్టెంబర్ 15, అనంతజనశక్తి న్యూస్

రాష్ట్రంలో అన్ని బస్‌స్టేషన్లు ఆధునికీకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఏపీ సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. రోజురోజుకు పెరుగుతోన్న యాత్రికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని తిరుపతిలో అత్యాధునిక బస్‌స్టేషన్ నిర్మించాలని ఆదేశించారు. అన్ని సౌకర్యాలతో ఆకట్టుకునేలా ఉండాలని, భవిష్యత్‌లో అన్నీ ఎలక్ట్రిక్ బస్సులే నడపనున్న నేపథ్యంలో ప్రతి బస్సుకు ఛార్జింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. దీనికి మొత్తం 5 మోడల్స్‌ను చంద్రబాబు పరిశీలించారు. వీటిని మరింత అభివృద్ధి చేసేందుకు స్టేక్ హోల్డర్లతో సమావేశం నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్, ఏపీఎస్ఆర్టీసీ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.



తిరుపతిలో నూతనంగా నిర్మించే బస్ స్టేషన్‌లో సుమారు 150 బస్సులు ఒకేసారి నిలిపి ఉంచేలా బస్ బే ఉండాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. హెలిప్యాడ్ సౌకర్యంతోపాటు రోప్ వే, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, మాల్స్, మల్టీప్లెక్స్‌లతో డిజైన్లు రూపొందించాలన్నారు. రెండు బస్ ఎంట్రీలు, ఎగ్జిట్ వేలు ఏర్పాటు చేయాలని చెప్పారు. సోలార్ రూఫ్ టాప్‌తో సొంత విద్యుత్ అవసరాలను తీర్చుకునేలా చూడాలన్నారు. మొత్తం 13 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించతలపెట్టిన ఈ బస్ స్టేషన్ కనీసం లక్ష మంది యాత్రికులు రాకపోకలు సాగించేందుకు వీలుగా నిర్మాణం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.


ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఏపీఎస్ఆర్టీసీ, నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ అధికారులతో చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని బస్‌స్టేషన్లు ఆధునీకరించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. తిరుపతిలో నిర్మించే అత్యాధునిక బస్ స్టేషన్‌లో అన్ని సౌకర్యాలు ఉండాలని చంద్రబాబు సూచించారు. తిరుపతి బస్ స్టేషన్ కోసం అధికారులు రూపొందించిన ఐదు మోడళ్లను చంద్రబాబు ఆదివారం పరిశీలించారు. వీటిని మరింత అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. ఇందుకోసం భాగస్వామ్యులతో సమావేశం నిర్వహించాలని ఆదేశించారు.

మరోవైపు ఇకపై ఎలక్ట్రికల్ బస్సులను మాత్రమే కొనుగోలు చేయాలని ఏపీఎస్ఆర్టీసీ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తిరుపతిలో కొత్తగా నిర్మించే బస్‌స్టేషన్‌లో ఛార్జింగ్ సదుపాయాలు ఉండాలని చంద్రబాబు సూచించారు. అలాగే ఒకేసారి 150 బస్సులు నిలిపేలా బస్ బే నిర్మించాలని ఆదేశించారు. రెండ్ బస్ ఎంట్రీలు, ఎగ్జిట్లు ఉండాలని సూచించారు. హెలిప్యాడ్, రోప్ వే సౌకర్యాలతో పాటుగా బస్ స్టేషన్‌లో మల్టీప్లెక్స్, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, మాల్స్ ఉండేలా డిజైన్లు రూపొందించాలని అధికారులకు చంద్రబాబు సూచించారు. తిరుపతిలో కొత్తగా నిర్మించే బస్ స్టేషన్‌లో సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేయాలని.. దీని సాయంతో బస్ స్టేషన్‌కు కావాల్సిన విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా ఏర్పాట్లు ఉండాలని స్పష్టం చేశారు.

# గృహ నిర్మాణం ప్రాథమిక హక్కు

గృహ నిర్మాణ హక్కును ప్రాథమిక హక్కుగా ప్రకటించిన సుప్రీం కోర్టు ఒత్తిడిలో ఉన్న రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల కోసం పునరుద్ధరణ నిధిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరింది. 'రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవించే ప్రాథమిక హక్కులో ఆశ్రయం పొందే హక్కు అంతర్భాగం. దీనివలన రాష్ట్రం తన పౌరులకు తగిన గృహాలను పొందేలా చూసుకోవాలి' అని సుప్రీం కోర్టు శుక్రవారం నొక్కి చెప్పింది. ఈ సందర్భంగా సుప్రీం కోర్టు గృహ కొనుగోలుదారులను రక్షించడం, రియల్ ఎస్టేట్ రంగాన్ని ఊహాజనిత పద్ధతుల నుంచి ప్రక్షాళన లక్ష్యంగా అనేక ఆదేశాలను జారీ చేసింది. ఈ రంగంలో కొన్ని అవకతవకల కారణంగా అనేక ప్రాజెక్టులు నిలిచిపోయాయని, అనేక కుటుంబాలు చిక్కుకుపోయాయని పేర్కొంది.

గ్రేటర్ నోయిడాలోని ఒక హౌసింగ్ ప్రాజెక్టుకు సంబంధించి నేషనల్ కంపెనీ లా అప్పీలేట్ ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ) ప్రకటించిన నిర్ణయాన్ని సవాల్ చేస్తూ పలువురు దాఖలు చేసిన అప్పీళ్లపై విచారించిన జస్టిస్ జేబీ పార్ధివాలా, ఆర్ మహదేవన్ ధర్మాసనం..



ఇల్లు అన్నది కేవలం ఒకరి తలపై కప్పు కాదు.. అది ఆశలు, కలల ప్రతిబింబం అని వ్యాఖ్యానించింది. పన్ను చెల్లించే మధ్య తరగతి పౌరుడు ఇంటి కోసం తన జీవితాంతం పొదుపు చేసిన డబ్బును పెట్టుబడి పెట్టి రెట్టింపు భారాన్ని మోస్తున్నాడని తెలిపింది. ఒక వైపు ఈఎంఐ చెల్లిస్తున్నా కలల ఇల్లు అసంపూర్ణ భవనంగా మిగిలిపోతున్నదన్నారు. ఇల్లు లేకపోవడం వల్ల కలిగే ఆందోళన ఆరోగ్యం, ఉత్పాదకత, గౌరవంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని సుప్రీంకోర్టు విచారం వ్యక్తం చేసింది.

'గృహ నిర్మాణం విలాసవంతమైనది కాదు, ఊహాజనిత సాధనం కాదు. కానీ ఒక ప్రాథమిక అవసరం' అని పేర్కొన్న సుప్రీం బెంచ్ 12 విస్తృత ఆదేశాలను జారీ చేసింది. ఇందులో ఎన్‌సీఎల్‌టీ, ఎన్‌సీఎల్ఏటీ వంటి వాటిలో యుద్ధ ప్రాతిపదికన ఖాళీలను భర్తీ చేయడం, ట్రైబ్యునళ్లను బలోపేతం చేయడం, రియల్ ఎస్టేట్ దివాలా తీయడాన్ని పరిష్కరించడానికి అదనపు బెంచ్‌లను ఏర్పాటు చేయడం వంటివి ఉన్నాయి. మురికి నీటి ప్రవాహం వంటి ఘటనల కారణంగా ఢిల్లీలోని ఎన్‌సీఎల్‌టీ కోర్టు గదులను మూసివేసిన క్రమంలో ట్రైబ్యునళ్ల మౌలిక సదుపాయాల ఉన్నతీకరణపై మూడు నెలల్లోగా నివేదికలు దాఖలు చేయాలని కేంద్రాన్ని ఆదేశించారు. తీర్పుకు సంబంధించిన కాపీని క్యాబినెట్ కార్యదర్శి, అన్ని రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలకు పంపాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

# కాంగ్రెస్ కూటమిలో గందరగోళం

**పాట్నా:** బీహార్‌లో కాంగ్రెస్ నేతృత్వంలోని మహాఘట్ బంధన్ కూటమిలో గందరగోళం నెలకొన్నది. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో ఆర్జేడీ పోటీ చేస్తుందని ఆ పార్టీ నేత తేజస్వీ యాదవ్ ప్రకటించారు. ముజఫర్‌పూర్ కాంతిలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ బీహార్‌లోని 243 స్థానాల్లో తమ పార్టీ పోటీ చేస్తుందన్నారు. అది బొచాహన్ లేదా ముజఫర్‌పూర్ నియోజకవర్గమా అని కాదు.. అన్ని స్థానాల్లో తేజస్వీ ముఖం చూసి ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు తాను పనిచేస్తానని, ప్రస్తుత ప్రభుత్వాన్ని దించేందుకు అంతా కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు.

అయితే కాంగ్రెస్, ఆర్జేడీ నేతృత్వంలోని మహాఘ



ట్ బంధన్ కూటమిలో ఇటీవల జార్ఖండ్ ముక్తి మోర్చా, పశుపతి పరాత్ ఆధ్వర్యంలోని లోక్ జనశక్తి పార్టీ చేరాయి. దీంతో సీట్ల పంపకం సంక్లిష్టంగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీ 144 సీట్లలో పోటీ చేయగా 75 స్థానాల్లో విజయం సాధించింది. ఇక 70 చోట్ల పోటీచేసిన కాంగ్రెస్ 19 సీట్లు మాత్రమే గెలిచింది. కానీ ఈసారి పరిస్థితులు మారాయి. ఓటర్ల హక్కులు, ఓట్ల చోరీ అనే విషయంపై కాంగ్రెస్ పార్టీ పోరాడింది. ఇటీవలే రాహుల్ గాంధీ ఓట్ అధికారి యాత్ర నిర్వహించారు. ఈ నేపథ్యంలో తమ పార్టీ బలం పుంజుకుందని రాష్ట్ర కాంగ్రెస్ భావిస్తున్న నేపథ్యంలో.. తాము అన్ని స్థానాల్లో పోటీచేస్తామని తేజస్వీ ప్రకటించడం కూటమిలో గందరగోళాన్నిసృష్టించింది.


# గుండె నిండా ధైర్యం.. చీర కొంగే ఆయుధం

అసలే అది ఆకలిగొన్న నక్క. ఒక్కసారిగా పొలంలో పని చేసుకుంటున్న 65 ఏళ్ల మహిళపై విరుచుకుపడింది. 18 సార్లు కరిచింది. అదే వేరెవరైనా అయితే అక్కడి నుంచి పరుగు లంకించుకునేవారు.. కానీ మధ్యప్రదేశ్‌కు చెందిన సురజియా భాయి అనే మహిళా రైతు మాత్రం ఆ నక్కతో వీరోచితంగా పోరాడారు. 30 నిమిషాలపాటు శక్తినంతా కూడగట్టుకుని దాని ఆట కట్టించారు. తన చీర కొంగుతోనే దాని మెడకు ఉచ్చు బిగించి చంపేశారు. ఆ తర్వాత స్పృహ కోల్పోయారు. 6 గంటల తర్వాత ఆసుపత్రిలో ఆమె స్పృహలోకి వచ్చారు. శివ్‌పురి జిల్లాలోని బర్ఖాడీ గ్రామానికి చెందిన సురజియా భాయి.. గత సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో పశువులకు మేత తేవడానికి పొలానికి వెళ్లారు. ఆమె ఓ కల్వర్టు దగ్గర గడ్డి కోస్తుండగా.. నక్క అరిచిన శబ్దం వినిపించింది. ఆమె తిరిగి స్పందించేలోగా అది దాడి



చేసింది. దీంతో ఆమె నేలపై పడ్డారు. దీంతో తొలుత కాళ్లపై ఆ నక్క కరిచింది. సురజియా గట్టిగా కేకలు వేసినా సమీపంలో ఎవరూ లేకపోవడంతో సహాయం అందలేదు. దీంతో ఎలాగోలా శక్తిని కూడగట్టుకున్న ఆమె.. నక్కపై ఎదురుదాడికి దిగారు. తాను అరిచేసరికి నక్క మరింతగా ఉగ్రరూపం చూపించిందని, చేతులపైనా కరవడం ప్రారంభించిందని భయానక ఘటనను సురజియా గుర్తు చేసుకున్నారు. దీంతో విధిలేక చంపేశానని తెలిపారు. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గతంలోనూ సురజియా కుటుంబంపై నక్కలు దాడి చేసిన ఘటనలు చోటుచేసుకున్నాయి. 6 నెలల కిందట ఆమె మరిది లాతురా జాదవ్.. ఇంట్లో ఉండగా నక్క వచ్చింది. దీంతో పిల్లలను కాపాడే క్రమంలో ఆయన దాంతో పోరాడి చంపేశారు. ఆ సమయంలో ఆయన ఒంటి నిండా నక్క కరిచిన గాయాలయ్యాయి.

## చంటిబిడ్డతో ఇంటర్వ్యూకు..
## డీఎస్పీగా 'మహిళా టాపర్' వర్ష



మధ్యప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎంపీపీఎస్సీ) పరీక్షల్లో మహిళల విభాగంలో స్టేట్ టాపర్‌గా నిలిచిన వర్షా పటేల్ తాజాగా విడుదలైన ఫలితాల్లో డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికయ్యారు. మైహర్ జిల్లాకు చెందిన ఈమె పరీక్షలకు సిద్ధమవుతున్నపుడు గర్భవతిగా ఉన్నారు. ఆగస్టు 18న ఇంటర్వ్యూకు పిలుపు వచ్చినప్పుడు ఒడిలో 26 రోజుల కుమార్తె శ్రీజ ఉంది. భర్త సంజయ్ పటేల్ తన ఉద్యోగం వదులుకొని వర్ష వెన్నంటే ఉంటూ ఆమె కల నెరవేరేందుకు సహకరించారు. ''మొత్తం 5 సార్లు ఎంపీపీఎస్సీ పరీక్షలు రాసి, మూడుసార్లు ఇంటర్వ్యూ వరకు వెళ్లాను. అయిదోసారి విజయం సాధించాను. కష్టపడి పనిచేస్తే ఓటమి ఉండదు. నిరంతరం ప్రయత్నిస్తూ ఉండాలంతే'' అని వర్ష తెలిపారు.

## టేకాఫ్ అవుతుండగా
## ఇండిగో విమానంలో సాంకేతిక లోపం..

లఖ్‌నవూ నుంచి ఢిల్లీ వెళ్తున్న ఇండిగో విమానం లో టేకాఫ్ అవుతుండగా సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో వెంటనే స్పందించిన పైలట్ చివరి నిమిషంలో టేకాఫ్‌ను నిలిపివేసి.. విమానాన్ని సురక్షితంగా రన్‌వేపైకి తీసుకొచ్చారు. ఆ సమయంలో విమానంలో సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ డింపుల్ యాదవ్ సహా 151మంది ప్రయాణికులు ఉన్నట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు. అనంతరం ప్రయాణికులను




వేరే విమానంలో ఢిల్లీకి తరలించడానికి ఏర్పాట్లు చేశారు. ఇటీవల ఇలాగే తిరువనంతపురం నుంచి ఢిల్లీకి వెళ్తున్న విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో అత్యవసర పరిస్థితుల్లో చెన్నై విమానాశ్రయంలో దిగింది. ఆ సమయంలో విమానంలోని 150 మంది ప్రయాణికుల్లో పార్లమెంటు సభ్యులు కేసీ వేణుగోపాల్, కొడికున్నిల్ సురేష్, ఆదూర్ ప్రకాశ్, కె.రాధాకృష్ణన్ తదితరులు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

## పాత యుద్ధ విమానాలు కొంటాం..
## మిగ్21ల కోసం క్యూ: ధర ఎంతంటే?



భారత వాయుసేనకు దాదాపు అర్ధ శతాబ్దానికి పైగా సేవలు అందించి.. గగనతలాన్ని కాపాడిన మిగ్21 లకు ఇప్పుడు రిటైర్మెంట్ ప్రకటించారు. అయితే.. వీటిని కొనుగోలు చేసేందుకు చాలా సంస్థలు క్యూ కట్టాయి. కనీసం ఒక్క దానినైనా సొంతం చేసుకోవాలని పోటీ పడుతున్నాయి. ప్రభుత్వం వీటిని ఎలా విక్రయిస్తోంది.. వీటి ధర ఎంతో తెలుసా..?

**రిటైర్మెంట్ తర్వాత ఏం చేస్తారు..?**

వాయుసేన మిగ్21 ఫైటర్‌జెట్ రిటైర్మెంట్ తర్వాత విద్యా సంస్థలు.. వార్ మెమోరియల్స్.. మిలిటరీ మ్యూజియాలు వీటి ఎయిర్ ఫ్రేమ్‌ను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం వద్ద క్యూకట్టాయి. సెప్టెంబర్ 26న రెండు స్క్వాడ్రన్ల ఈ యుద్ధ విమానాలకు (ఒక్కో స్క్వాడ్రన్‌లో 1618 ఉంటాయి) తుది వీడ్కోలు పలకనున్నారు. అనంతరం వీటిని తుక్కు యార్డుకు తరలించరు. వీటి నుంచి ఇంజిన్, రాడర్లు, ఏవియానిక్స్, ఆయుధాలను ఇతర కీలక పరికరాలను తొలగించేస్తారు. ఆ తర్వాత వీటి ఎయిర్ ఫ్రేమ్ కోసం వచ్చిన అధికారిక దరఖాస్తులను పరిశీలించి ప్రయారిటీ లిస్టు తయారు చేస్తారు.

**ప్రైవేటు సంస్థలకు రేటు ఇలా..**

ప్రైవేటు విద్యాసంస్థలు కోరితే.. రూ.30 లక్షలు వెచ్చించి వీటిని పొందవచ్చు. ఇక యుద్ధ స్మారకాలు, మిలిటరీ మ్యూజియాలు ప్రభుత్వ సంస్థలకు ఉచితంగానే అందిస్తారు. ఇక ప్రభుత్వ రంగ సంస్థలు వీటిని పొందాలనుకొంటే వాటికి వేరే ధర ఉంటుంది. ప్రాధాన్య క్రమంలో ప్రభుత్వ సంస్థలు ముందు వరుసలో ఉంటాయి.


ఇక వీటి ఎయిర్ ఫ్రేమ్‌ను పొందిన సంస్థలు కొన్ని నిబంధనలు కచ్చితంగా పాటించాలి. ప్రొటోకాల్ మెయింటెనెన్స్‌ను పాటించాలి. వాయుసేన సూచించిన రంగులు.. చెప్పిన షేడ్స్‌లోనే ఉండాలి. ఇక ఏవైనా నగరాల్లో వీటిని ప్రదర్శించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు కోరితే.. ఆయా స్థానిక సంస్థలు కూడా కచ్చితంగా మెయింటెనెన్స్ నిబంధనలు పాటించాల్సిందే. ఎయిర్ ఫ్రేమ్‌లు దెబ్బతినేట్లు ఉంచకూడదు. గతంలో కూడా సర్వీస్ అయిపోయిన.. దెబ్బతిన్న యుద్ధ విమానాల ఎయిర్ ఫ్రేమ్‌లను ఇలానే కేటాయించారు.

వీటిని ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ మ్యూజియం , ఎయిర్ ఫోర్స్ మ్యూజియం, ఢిల్లీలోని పాలెంలో చూడవచ్చు. చండీగఢ్‌లోని వాయుసేన హెరిటేజ్ మ్యూజియం, బెంగళూరు హెచ్ఏఎల్ హెరిటేజ్ సెంటర్ ఏరోస్పేస్ మ్యూజియంలో కూడా చాలా రకాల పాత యుద్ధ విమానాలు ఉన్నాయి.

**గగనతలాన్ని కంటికి రెప్పలా కాపాడిన చరిత్ర..**

భారత వాయుసేనలో చేరిన తొలి సూపర్‌సోనిక్ ఫైటర్‌జెట్‌లుగా మిగ్21లు నిలిచాయి. 196070ల్లో భారత్‌కు గగనతల యుద్ధంలో ఇవి అదనపు బలంగా మారాయి. వాస్తవానికి అప్పట్లో ఇవి సాంకేతికపరంగా పశ్చిమదేశాలకు కూడా కంటిమీద కునుకు లేకుండా చేశాయి. ఈ టెక్నాలజీని సొంతం చేసుకోవడానికి ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్ దీనిని దొంగిలించిందంటే ఈ జెట్ సత్తా ఏంటో అర్థం చేసుకోవచ్చు. వాస్తవానికి ఈ యుద్ధ విమానాన్ని నడిపిన పైలట్లు మరో దానివైపు పెద్దగా మొగ్గు చూపరనే పేరుంది. గాల్లో చురుగ్గా కదలడం, అత్యధిక వేగాన్ని అందుకోవడం దీనిలో ప్రత్యేకతలు. ప్రస్తుతం విమానాలు ఫ్లై బై వైర్ వ్యవస్థతో వేగాన్ని నియంత్రిస్తుండగా.. మిగ్‌లు గేర్ సిస్టమ్‌తో పనిచేస్తాయి. ఫలితంగా ఇది గంటకు 2000 కిలోమీటర్లకు పైగా వేగాన్ని అందుకోగలదు. అంత వేగాన్ని నియంత్రించలేకపోవడం కూడా ఓ లోపంగా మారి ప్రమాదాలకు కారణమవుతోంది.

భారత వాయుసేన నివేదికల ప్రకారం.. మిగ్21 యుద్ధ విమానాలు అనేక ఆపరేషన్లలో పాల్గొన్నాయి. 1971 యుద్ధంలో ఇండియాకు అద్భుత విజయం చేకూరడం వెనక వీటి కృషి దాగి ఉంది. 2019లో బాలాకోట్ దాడుల అనంతరం పాక్ విమానాలు జమ్మూకశ్మీర్‌లో చొరబడితే.. వాటిని తరిమేందుకు తొలుత రంగంలోకి దిగింది కూడా మిగ్21 ఫైటర్ జెట్‌లే.




## చౌకైన పద్ధతిలో ఇన్సులిన్ తయారీ


**గువాహటి: మనిషి ఇన్సులిన్‌ను మరింత చౌకగా తయారుచేసే పద్ధతిని ఐఐటీ గువాహటి పరిశోధకులు కనుగొన్నారు. సూడోమోనాస్ ఫ్లోరెసెన్స్ అనే బాక్టీరియా సాయంతో సురక్షితమైన, సమర్థమైన రీతిలో ఔషధ తయారీకి దోహదపడే ఈ ప్రక్రియ వల్ల ఇన్సులిన్ మరింత చౌకగా అందుబాటులోకి రాగలదని ఐఐటీ గువాహటి తెలిపింది. దీనికి రెండు భారత పేటెంట్లు లభించాయి. సూడోమోనాస్ ఫ్లోరెసెన్స్ బాక్టీరియాతో ఇన్సులిన్ తయారీ విధానాన్ని కనుగొన్నామని ఈ పరిశోధనకు నేతృత్వం వహించిన నూజివీడులోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ మాజీ డైరెక్టర్ వీరంకి వెంకటదాసు తెలిపారు.**

## 'మా కన్నీళ్లు ఇంకా ఆరిపోలేదు'



తమ కన్నీళ్లు ఇంకా ఆరిపోలేదని పహల్గామ్ బాధిత కుటుంబాలు వాపోయాయి. భారత్‌పాకిస్థాన్ మధ్య క్రికెట్ మ్యాచ్‌ను బహిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఏప్రిల్ 22న జమ్ముకశ్మీర్ పహల్గామ్‌లోని బైసరన్ మైదానంలో పాక్ ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో పర్యాటకులతో సహా 26 మంది మరణించారు. ఈ సంఘటన నేపథ్యంలో పాకిస్థాన్‌తో భారత్ అన్ని విధాలా తెగదెంపులు చేసుకున్నది. మేలో ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ సైనిక చర్య చేపట్టింది. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసింది.కాగా, పహల్గామ్ ఉగ్రదాడి జరిగిన తర్వాత సుమారు ఐదు నెలలకు ఆదివారం నుంచి దుబాయ్‌లో భారత్, పాకిస్థాన్ క్రికెట్ జట్ల మధ్య ఆసియా కప్ టోర్నీ జరుగనున్నది. అయితే ఈ నిర్ణయం తీసుకున్న బీసీసీఐతో పాటు కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తాయి. పహల్గామ్ బాధిత కుటుంబాలు కూడా దీనిపై స్పందించాయి. పాక్‌తో మ్యాచ్‌ను భారత్ ఆటగాళ్లు బహిష్కరించాలని పిలుపునిచ్చారు. 'మా కన్నీళ్లు ఇంకా ఆరిపోలేదు. పాకిస్థాన్‌తో మ్యాచ్ ఏమిటి?' అని భర్త, కుమారుడ్ని కోల్పోయిన కిరణ్‌బెన్ ప్రశ్నించారు.మరోవైపు ఆమె చిన్న కుమారుడు సావన్ పర్మార్ కూడా తన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. పహల్గామ్ దాడిలో చాలా మంది ప్రాణాలు కోల్పోయారని, ఆపరేషన్ సిందూర్‌లో మన సైనికులు కూడా అమరులయ్యారని గుర్తు చేశారు. భారత్, పాక్ మధ్య మ్యాచ్ జరుగుతోందని తెలిసి తాము చాలా కలత చెందినట్లు చెప్పారు. 'పాకిస్థాన్‌తో అన్ని సంబంధాలు తెంచుకున్నామని ప్రధాని మోదీ అన్నారు. మరి మనం ఇంకా ఈ ఆట ఎందుకు ఆడుతున్నాం? మేం ఇంకా దుఃఖిస్తున్నాం. ఈ ఆట ఆడాల్సిన అవసరం ఏమిటి?' అని ఆయన ప్రశ్నించారు.


## ఇళయరాజాను భారతరత్నకు ప్రతిపాదిస్తాం




ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఇళయరాజాకు భారతరత్న పురస్కారం కోసం ప్రతిపాదించనున్నట్లు తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ తెలిపారు. ఇళయరాజా సినీ జీవితంలోకి అడుగుపెట్టి 50 ఏళ్లయిన సందర్భంగా తమిళనాడు ప్రభుత్వం ఆయనకు చెన్నైలో శనివారం సాయంత్రం సన్మాన కార్యక్రమం నిర్వహించింది. ఇళయరాజాను ముఖ్యమంత్రి స్టాలిన్ జ్ఞాపికతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... నైపుణ్యం, కృషి ఉంటే ఎంతటి ఉన్నత శిఖరానికైనా చేరవచ్చని ఇళయరాజా నిరూపిస్తున్నారని తెలిపారు. ఆయన సంగీతం తల్లిగా జోల పాడుతోందని, ప్రేమ భావోద్వేగాలను కీర్తిస్తోందని, విజయ ప్రస్థానానికి ప్రేరణ అందిస్తోందని, బాధలను ఓదార్చుతోందని పేర్కొన్నారు. సంగీత కళాకారులను ప్రోత్సహించేలా ఏటా తమిళనాడు ప్రభుత్వం తరఫున ఇళయరాజా పేరిట పురస్కారం అందించనున్నట్లు ప్రకటించారు. ఆయనకు భారతరత్న పురస్కారం ఇవ్వాలని రాష్ట్ర ప్రజలు, సంగీత ప్రియుల తరఫున ప్రతిపాదించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, మంత్రి సామినాథన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, నటులు రజనీకాంత్, కమల్‌హాసన్, కార్తి తదితరులు పాల్గొన్నారు.

## అరుదైన 'ముక్కంటి' తొండలు!

మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో గల 'వన విహార్'ను సందర్శించే వన్యప్రాణి ప్రేమికులకు ఇప్పుడు 'ముక్కంటి' తొండలు (శాకాహార రాకాసి బల్లులు అగ్వానాలు) అదనపు ఆకర్షణగా మారాయి. ఇవి 1.5 నుంచి 3 మీటర్ల పొడవుతో అయిదు కిలోలదాకా బరువు ఉంటాయి.



తలపై ఉండే 'మూడోకన్ను' ఈ తొండల ప్రత్యేకత. స్కేలు లాంటి ఈ చిన్న అవయవం జ్ఞానేంద్రియంలా పనిచేస్తుంది. ప్రమాద సమయాల్లో ముందే సంకేతాలిచ్చి తొండలను అప్రమత్తం చేస్తుంది. దేహంపై ఉన్న కెరటిన్ పలకలు ఈ జీవులకు రంగునిచ్చి, కప్పి ఉంచుతాయి. తైవాన్ వంటి దేశాల్లో ఇవి లక్షల సంఖ్యలో ఉంటాయి. భారత్‌లో చాలా అరుదు. మెక్సికో, అమెరికా, దక్షిణాఫ్రికాతోపాటు ఇతర ఉష్ణమండల ప్రాంతాల నుంచి ఈ తొండలను తీసుకువచ్చి తెలంగాణ, యూపీ రాష్ట్రాల్లో విక్రయించాలని చూసిన అక్రమ రవాణాదారుల నుంచి రక్షించి క్వారంటైను తర్వాత వన విహార్‌లో వదిలారు. కొత్త వాతావరణానికి పూర్తిగా అలవాటుపడిన వీటిని సందర్శకుల వీక్షణకు అనువుగా రూపొందించిన ప్రత్యేక ఎన్‌క్లోజర్లలో ఉంచారు.




# విద్వేషాలను పెంచే హత్య

ఆయనేమీ అమెరికా ప్రభుత్వంలో కీలక పదవి నిర్వహిస్తున్నవాడు కాదు. కనీసం రాజకీయ నాయకుడు కూడా కాదు. కానీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు సైద్ధాంతిక ఉపకరణాలు అందిస్తున్నవారిలో... 'అమెరికాను మళ్లీ మహోత్కృష్టంగా మారుద్దాం' (మాగా) ఉద్యమానికి తోడ్పడుతున్నవారిలో అతి ముఖ్యుడు. మూడు పదుల వయసు లోని మితవాద క్రియాశీల కార్యకర్త చార్లీ కిర్క్‌ను యూటా వ్యాలీ విశ్వవిద్యాలయంలో బుధవారం దుండగుడు కాల్చి చంపిన వైనం ఇప్పుడు అమెరికాను ఊపిరాడకుండా చేస్తోంది. ప్రముఖులను, ఉన్న పదవుల్లోని వారినీ భౌతికంగా నిర్మూలించాలని చూసే సంస్కృతి అమెరికాకు కొత్తగాదు. కానీ ఈమధ్య అది పెరిగింది. ట్రంప్ ఎన్నికల ప్రచార సభల్లో ఆయనపై రెండుసార్లు హత్యాయత్నాలు జరిగాయి. మిన్నెసోటా ప్రతినిధుల సభ స్పీకర్ ఎమెరిటా మెలిసానూ, ఆమె భర్తనూ ఇటీవలే కాల్చి చంపారు. అమెరికాలో తుపాకుల పరిశ్రమ పలుకుబడి అధికం. తుపాకి సంస్కృతిని రద్దుచేయటం మాట అటుంచి, కనీసం పరిమితులు విధించాలని చూసినా తీవ్ర వ్యతిరేకత వస్తుంది. తుపాకి కలిగివుండటం పౌరుల హక్కని, దాన్ని రద్దు చేయటమంటే జీవించే హక్కును కాలరాయటమేనని వాదిస్తారు. రిపబ్లికన్ పార్టీలో ఇలాంటివారు ఎక్కువున్నా, డెమాక్రటిక్ పార్టీలో కూడా తక్కువేం లేరు. కిర్క్ తుపాకులకు అనుకూలం. దానిపై ఒక విద్యార్థి ప్రశ్నకు జవాబు చెబుతుండగానే ఆయన హత్యకు గురయ్యారు.

అమెరికాలోనే కాదు... ప్రపంచ వ్యాప్తంగా అసహనం పెరిగింది. ఒక అంశంపై వాదం, ప్రతివాదం సంస్కృతి కనుమరుగవుతోంది. వినాలన్న యోచన లేదు. ఉన్నా వాదనకు జవాబు చెప్పలేక, అతనికి/ఆమెకు దురుద్దేశాలు అంటగట్టడం, అభాండాలేయటం, దౌర్జన్యానికి దిగటం పెరిగింది. ఏకీభవించకున్నా ఆ వాదనను గౌరవించాలన్న స్పృహ కొరవడింది.

ఒక విశ్వాసాన్ని కలిగివున్న వ్యక్తిని హతమార్చినంత మాత్రాన ఆ విశ్వాసాన్ని నిర్మూలించటం అసాధ్యం. కానీ దురదృష్టవశాత్తూ దీన్ని నమ్ముకునే ధోరణి ప్రబలుతోంది. కిర్క్ డ్రాపౌట్ అన్న మాటేగానీ అసాధారణ ప్రతిభావంతుడు. కేవలం 18 యేళ్ల వయసులోనే 'టర్నింగ్ పాయింట్ యూఎస్‌ఏ' సంస్థ నెలకొల్పి తన మితవాద భావాలను బలంగా చెప్పగలిగే ఉపన్యాసకుడిగా రూపొందాడు. ఖజానా బాధ్యతాయుత నిర్వహణ, స్వేచ్ఛాయుత మార్కెట్లు, పరిమిత పాలనా వ్యవస్థ తదితర అంశాలపై విద్యాసంస్థల్లో ఉపన్యాసాలిచ్చాడు.

ట్రంప్ తొలిసారి అధ్యక్షుడైనప్పుడే 22 ఏళ్ల వయసులో 'మాగా' ఉద్యమానికి అంకితమై పనిచేశాడు. విద్యార్థులు అధిక సంఖ్యలో ఓటర్లుగా నమోదై రిపబ్లికన్లకు ఓటేయటం వెనక కిర్క్ కృషిని గురించి చెబుతారు. అరిజోనా వంటి డెమాక్రటిక్ ప్రభావిత ప్రాంతం రిపబ్లికన్ల వైపు మొగ్గటంలో అతనిపాత్ర ప్రధానమైనది. మహిళలు, గర్భస్రావాలు, ట్రాన్స్‌జెండర్లు తదితర అంశాల్లోఅతని వైఖరిని చాలామంది జీర్ణించుకోలేరు. జాతి, మత, వర్ణ, లింగ వివక్షను నిషేధించే 1964 నాటి పౌర హక్కుల చట్టం పెద్ద తప్పిదమని కిర్క్ భావన. భారతీయులకు కిర్క్ తీవ్ర వ్యతిరేకి. 'శ్వేత జాతీయులకు ఉద్యోగాలు రావాలి... మీరంతా ఖాళీ చేసి పొండి' అని పిలుపునిచ్చాడు.

తన భావాలపై ప్రశ్నించవచ్చంటూ కాలేజీలు, వర్సిటీల సందర్శన మొదలు పెట్టాడు. ఆ భావాలను పూర్వపక్షం చేస్తే అతని వాదన బలహీనపడుతుంది. కానీ భౌతిక దాడికి దిగటం వల్ల కిర్క్ భావాల బలం పెరుగుతుంది. ఈ మరణం ఎలాంటి పర్యవసానాలకు దారితీస్తుందో సామాజిక మాధ్యమాల్లోని వ్యాఖ్యలే చెబుతాయి. 'మనది యుద్ధం. కిర్క్ నేలకొరిగిన యుద్ధ వీరుడు. వ్యక్తిగత భేదాలు పక్కనబెట్టి ఒక్కటై పోరాడాలి' అని మితవాద వ్యూహకర్త స్టీవ్ బేనన్ పిలుపునిచ్చారు.

'మనల్ని ప్రశాంతంగా బతకనీయకపోతే మనకున్న ప్రత్యామ్నాయాలు రెండే– పోరాడటం లేదా మరణించటం' అని ఎలాన్ మస్క్ అన్నారు. 'వామపక్షవాదులారా... మనం సంభాషించుకుందాం లేదా యుద్ధానికి దిగుదాం. మీ నుంచి మరో బుల్లెట్ బయటికొస్తే ఇక ఆ ఎంపిక మిగలదు' అని నటుడు జేమ్స్ వుడ్స్ హెచ్చరించారు. ఏదేమైనా ఈ వాతావరణంలో అక్కడివారే కాదు... వలసపోయినవారూ అప్రమత్తంగా ఉండక తప్పదు.

# 'రాజ్యాంగాన్ని చూసి గర్విస్తున్నాం'

**'భారత రాజ్యాంగాన్ని చూసి గర్విస్తున్నాం' ..నేపాల్ పరిణామాల నేపథ్యంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి. ఆర్.గవాయ్ చేసిన వ్యాఖ్య ఇది. రాజ్యాంగాన్ని చూసి మాత్రమే కాదు, అంతటి మహోన్నత రాజ్యాంగాన్ని రచించి మనకు అందించిన రాజ్యాంగ నిర్మాతలను చూసి కూడా గర్వించాలి కదా? భిన్న మతాలు, భిన్న జాతులతో కూడిన మన దేశం భిన్నత్వంలో ఏకత్వంతో అప్రతిహతంగా సాగిపోవడానికి వారు అందించిన రాజ్యాంగమే ప్రాతిపదిక కదా? రాజ్యాంగం ఎంత గొప్పదైనా దాన్ని పరిరక్షించాల్సిన వ్యవస్థల అధిపతులు మంచివాళ్లు కాకపోతే పరిస్థితి ఏమిటి? శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ పరిణామాల తర్వాత మన దేశంలో కూడా ఇలాంటి పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందా? అన్న అనుమానం కొందరిలోనైనా ఏర్పడటం ఆందోళన కలిగిస్తోంది. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో రాజ్యాంగం లోపభూయిష్టంగా ఉందని కాదు.. పాలకులు బాధ్యతారహితంగా, రాజ్యం వీరభోజ్యం అన్నట్టుగా వ్యవహరించడం వల్ల అవినీతి, అరాచకాలు పెచ్చరిల్లి ప్రజల్లో అసహనం పరాకాష్ఠకు చేరింది.**




ఫలితమే ప్రజాగ్రహం పెల్లుబికి పాలకులు దేశం విడిచి పారిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ దుస్థితి వెనుక అమెరికా హస్తమో లేక మరొకరి హస్తమో ఉందని చెప్పుకోవచ్చు కానీ ప్రభుత్వాల పట్ల ప్రజల్లో అసంతృప్తి గూడుకట్టుకొని ఉండకపోతే తిరుగుబాట్లు చోటుచేసుకోవు. మన పొరుగు దేశాలైన శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌తో మన దేశాన్ని ఏ విధంగానూ పోల్చలేము. భిన్న జాతులు, భిన్న మతాలు, భిన్న సంస్కృతుల కలబోతగా ఉన్న మన దేశంలో ప్రభుత్వాలపై ఈ రూపంలో తిరుగుబాట్లు అసాధ్యం. అలా జరగాలని కూడా కోరుకోకూడదు. మన ప్రజాస్వామ్య వ్యవస్థ అనేక పరీక్షలకు నిలబడి పరిపక్వత చెందింది. ప్రజలు కూడా ఎప్పటికప్పుడు విజ్ఞత ప్రదర్శించి హద్దులు మీరిన పాలకులకు ఎన్నికల సందర్భంగా బ్యాలెట్ ద్వారా కర్రు కాల్చి వాత పెడుతున్నారు. అయితే ఏ సందర్భంలో కూడా కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ప్రజల తీర్పు ఒకే రకంగా ఉండకపోవడం మన విశిష్టత. ఉదాహరణకు, ఎమర్జెన్సీనే తీసుకుందాం. నాటి ప్రధాని ఇందిరాగాంధీ తన అధికారానికి ముప్పు ఏర్పడుతోందని గ్రహించి దేశంలో అత్యవసర పరిస్థితిని విధించారు. ఫలితంగా లభించిన అపరిమిత అధికారాలతో అధికార యంత్రాంగం ప్రజలను హింసించింది. భావ ప్రకటనా స్వేచ్ఛను హరించివేశారు. అయితే ఉత్తరాది రాష్ట్రాలతో పోల్చితే దక్షిణాది రాష్ట్రాలలో ఎమర్జెన్సీ ప్రభావం తక్కువగా ఉండింది. ఈ కారణంగా ఉత్తరాదిలో తుడిచిపెట్టుకుపోయిన కాంగ్రెస్ పార్టీ దక్షిణాదిన కొంత మేరకు నిలదొక్కుకోగలిగింది. అత్యవసర పరిస్థితి నాటి దురాగతాలను కూడా ప్రజలు ఎన్నికల వరకు భరించి బ్యాలెట్ ద్వారా ఇందిరాగాంధీకి గుణపాఠం చెప్పారు. అంతేగానీ ప్రభుత్వంపై తిరుగుబాటు చేయలేదు. 1984లో తెలుగునాట చోటుచేసుకున్న అధికార దుర్వినియోగాన్నే తీసుకుందాం. మెజారిటీ శాసనసభ్యుల మద్దతు కలిగి ఉన్న ఎన్టీఆర్‌ను తొలగించి నాదెండ్ల భాస్కరరావును ముఖ్యమంత్రిగా అప్పటి ఉమ్మడి రాష్ట్ర గవర్నర్ రాంలాల్ నియమించారు. ఇది కూడా నాటి ప్రధాని ఇందిరాగాంధీ ప్రోద్బలంతోనే జరిగింది. ఎన్నికల్లో గెలుపొంది అధికారంలోకి వచ్చిన ఎన్టీఆర్‌ను అన్యాయంగా, అక్రమంగా తొలగించడాన్ని జీర్ణించుకోలేని తెలుగు ప్రజలు శ్రీకాకుళం నుంచి ఆదిలాబాద్ వరకు ఆందోళన చేపట్టారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం ఊపందుకోవడంతో గవర్నర్ రాంలాల్ తన పదవికి రాజీనామా చేయవలసి వచ్చింది. ఇందిరాగాంధీ దిగివచ్చి ఎన్టీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా నియమించడానికి అంగీకరించారు. ఆ తర్వాత కొద్దిరోజులకే ఇందిరాగాంధీ హత్యకు గురయ్యారు. ఆ కారణంగా జరిగిన ఎన్నికల్లో కూడా తెలుగు ప్రజల ఆగ్రహం చల్లారలేదు.

దేశవ్యాప్తంగా సానుభూతి పవనాలు వీచి కాంగ్రెస్ పార్టీకి ఎన్నడూ లేనంత స్థాయిలో మెజారిటీ లభించి, రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రి అయ్యారు. అయితే ఆ ఎన్నికల్లో తెలుగునాట మాత్రం ప్రజలు కాంగ్రెస్‌పై తమ కక్ష తీర్చుకున్నారు. అధికార దురహంకారంతో వ్యవహరిస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడిన ప్రభుత్వాలపై మన ప్రజలు బ్యాలెట్‌ను బుల్లెట్‌లా ప్రయోగించారే గానీ, పొరుగు దేశాల్లో వలె విధ్వంస చర్యలకు పాల్పడలేదు. ఇందుకు మన సమాజాన్ని చూసి మనం గర్వించాలి. అయితే ప్రజలు మాత్రమే ఎల్లవేళలా విజ్ఞత ప్రదర్శించాలనుకోవడం అత్యాశే అవుతుంది. పాలకులపై ఆ బాధ్యత ఉండదా? ప్రజల మనోభావాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పాలించాల్సిన బాధ్యత పాలకులపై ఉండదా? ఒక్కసారి అధికారంలోకి వస్తే ఐదేళ్లపాటు విర్రవీగుతూ అధికార దుర్వినియోగానికి, అవినీతికి పాల్పడవచ్చా? అలా చేయడం ప్రజల సహనాన్ని పరీక్షించడం కాదా? రాజ్యాంగ పరిరక్షకులుగా ఉన్న ఆయా వ్యవస్థల అధిపతులపై కూడా బాధ్యత ఉంటుంది కదా? మన రాజ్యాంగ నిర్మాతలు ఆయా రాజ్యాంగ వ్యవస్థల మధ్య సున్నితమైన లక్ష్మణ రేఖలు గీశారు. ఒక వ్యవస్థ అధికార పరిధుల్లోకి మరో వ్యవస్థ చొరబడకుండా సరిహద్దులు నిర్ణయించారు. అయితే రాజ్యాంగబద్ధమైన పదవులలో ఉన్నవారు బాధ్యతారహితంగా వ్యవహరించిన సందర్భాలలో ఆయా వ్యవస్థల మధ్య ఘర్షణ తలెత్తుతోంది. శాసనసభలో మెజారిటీ ఎమ్మెల్యేల మద్దతు ఉన్న నాయకుడే ముఖ్యమంత్రిగా నియమితులు కావాలని రాజ్యాంగం అభిప్రాయపడింది. అదే సమయంలో గవర్నర్లు ఎవరినైనా ముఖ్యమంత్రులుగా నియమించవచ్చునని అదే రాజ్యాంగంలో పేర్కొన్నారు. దీని ఉద్దేశం దారినపోయే దానయ్యను ముఖ్యమంత్రిని చేయమని కాదు. ముఖ్యమంత్రిగా నియమితుడయ్యే వ్యక్తి అప్పటికి చట్టసభల్లో సభ్యుడు కాకపోయినా సభలో మెజారిటీ నిరూపించుకొని ఆరు నెలల్లో ఏదో ఒక సభకు ఎన్నిక కావాలని రాజ్యాంగంలో నిర్దేశించారు. సదుద్దేశంతో కల్పించిన ఈ వెసులుబాటును రాంలాల్ వంటి వారు దుర్వినియోగం చేశారు. రాజ్యాంగ నిర్మాతల అభిమతాన్ని తప్పుగా అన్వయించి అధికార దుర్వినియోగానికి పాల్పడిన సందర్భాలను ఎన్నో చూశాం. రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదించిన బిల్లులను ఆమోదించే విషయంలో గవర్నర్లు, రాష్ట్రపతికి కాల వ్యవధి ఉండాలా? వద్దా? అన్నది ప్రస్తుతం సర్వోన్నత న్యాయస్థానం విచారణ పరిధిలో ఉంది. రాజ్యాంగ నిర్మాతలు సదుద్దేశంతో రాష్ట్రపతి, గవర్నర్లు, న్యాయమూర్తులకు ప్రత్యేక రక్షణలు కల్పించడంతో పాటు విశేష అధికారాలూ కల్పించారు. అలా అని మా ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తామని వారు భావిస్తే ప్రజల్లో అసహనం ఏర్పడదా? బిల్లుల ఆమోదం విషయంలో గవర్నర్లు, రాష్ట్రపతికి గడువు విధిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం ఏమిటని పాలకులు ప్రశ్నిస్తున్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన ప్రాథమిక బాధ్యత సర్వోన్నత న్యాయస్థానం పైనే ఉంటుంది. పార్లమెంటు ఆమోదించే చట్టాలు సైతం రాజ్యాంగానికి లోబడి ఉన్నాయా లేవా అని సమీక్షించి నిర్ణయం తీసుకొనే అధికారం సుప్రీంకోర్టుకు ఉంటుంది కదా? శాసనసభలు ఆమోదించిన బిల్లులకు గవర్నర్లు, రాష్ట్రపతి ఆమోదముద్ర వేయకుండా నెలలూ, సంవత్సరాల తరబడి పక్కన పడేస్తే ప్రజలు ఎన్నుకొన్న ప్రభుత్వాలు ఏమి చేయాలి? శాసనసభలు ఆమోదించిన బిల్లులు రాజ్యాంగానికి లోబడి లేని పక్షంలో ఆ విషయం చెప్పి తిరస్కరించవచ్చు. కానీ శాశ్వతంగా పెండింగ్‌లో ఉంచడం, అదేమంటే మా అధికారాన్ని ప్రశ్నించి, మాకు గడువు విధించే అధికారం సుప్రీంకోర్టుకు ఎక్కడిది? అని హుంకరించడం సమర్థనీయమా? గవర్నర్లు, రాష్ట్రపతి రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటే ఇలాంటి అవాంఛనీయ వివాదాలు తలెత్తవు కదా? మన దేశంలో రాజ్యాంగబద్ధమైన వ్యవస్థల విశ్వసనీయత కొంతకాలంగా మసకబారుతోంది.

**సీఎం, పీఎం ఇష్టమేనా?**

ఇక చట్టసభల విషయానికి వద్దాం. అధికార పార్టీ, అంటే దాని అధినేత మనసులో ఏమనుకుంటారో అవే చట్టాలు అవుతున్నాయి. ఆయా బిల్లులపై పార్టీలో గానీ, మంత్రుల స్థాయిలో గానీ చర్చలు జరగవు. ముఖ్యమంత్రి లేదా ప్రధానమంత్రి మనసులో మాటకు అనుగుణంగా అధికారులు బిల్లులు రూపొందిస్తున్నారు. సదరు బిల్లులను కనీసం చదవకుండానే శాసనసభల్లో, పార్లమెంటులో ఆమోదిస్తున్నారని ఎప్పటి నుంచో ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల్లో ప్రజల ద్వారా ఎన్నికైన ఒక ముఖ్యమంత్రి లేదా ప్రధానమంత్రి ఏదైనా కేసులో 3 నెలలకు మించి జైల్లో ఉంటే పదవి కోల్పోవలసి ఉంటుందని లోక్‌సభలో ఇటీవల ఒక బిల్లును ఆమోదించారు. ఈ బిల్లుకు మద్దతు తెలిపిన వారిలో ఎంత మంది ఆ బిల్లును చదివారంటే చెప్పలేని పరిస్థితి. ఒకరకంగా చూస్తే ఈ బిల్లు ఉద్దేశం మంచిదే. అయితే మన దేశంలో అస్మదీయుల విషయంలో ఒకలా, తస్మదీయుల విషయంలో మరోలా చట్టాలు, వ్యవస్థలు పనిచేస్తాయన్న విషయం తెలిసిందే కదా? ప్రస్తుత పరిస్థితులలో ప్రతిపక్షాలకు చెందిన లేదా తస్మదీయ ముఖ్యమంత్రులపై కేంద్ర ఏజెన్సీలతో కేసులు పెట్టించి మూడు నెలలకు పైగా జైల్లో పెట్టడం కష్టమా? న్యాయవ్యవస్థ కూడా బెయిలు మంజూరు విషయంలో ఒక్కో సందర్భంలో ఒక్కోలా వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ బిల్లు చట్టమైతే అది దుర్వినియోగం కాదన్న గ్యారెంటీ ఏముంది? కేంద్రంలో అధికారంలో ఉన్న వారికి గిట్టని ముఖ్యమంత్రిని ఈ చట్టాన్ని అడ్డుపెట్టుకొని తొలగించబోరన్న గ్యారెంటీ ఏముంది? ఇలాంటి సందేహాలు రావడానికి అనేక కారణాలు ఉన్నాయి. మన దేశంలో ఎంతో మంది రాజకీయ నాయకులపై అవినీతి ఆరోపణలు ఉన్నాయి. పలువురిపై కేసులు నమోదయ్యాయి. పలువురు ముఖ్యమంత్రులు, మాజీ ముఖ్యమంత్రులు బెయిల్‌పై ఉంటున్నారు. కేసులను ఎదుర్కొంటున్న నాయకులు అస్మదీయులు అయితే చట్టాలు వారి చుట్టాలవుతున్నాయి. తస్మదీయులైతే చట్టాలు కాల నాగుల్లా బుసకొడుతూ కాటేస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల విషయానికి వద్దాం. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా బెయిల్‌పై ఉన్నారు. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రేపోమాపో కాళేశ్వరం వ్యవహారంపై సీబీఐ విచారణ జరగబోతోంది. ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పుష్కర కాలంగా బెయిల్‌పై ఉన్నారు. అవినీతి కేసులలో బెయిల్‌పై ఉన్న ఆయన ముఖ్యమంత్రి కూడా అయ్యారు. జగన్‌రెడ్డి కేసు పుణ్యమా అని న్యాయ వ్యవస్థ విశ్వసనీయతపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. బిల్లుల ఆమోదం విషయంలో గవర్నర్లు, రాష్ట్రపతికి గడువు లేకపోతే ఎలా? అని ప్రశ్నిస్తున్న న్యాయ వ్యవస్థను జగన్మోహన్‌రెడ్డి వంటి వారి విషయంలో తీర్పు ఇవ్వడానికి గడువు లేకపోతే ఎలా? అని ప్రజలు ప్రశ్నించకుండా ఉంటారా? అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రజా ప్రతినిధుల కేసులు ఏడాదిలోగా పరిష్కారం కావాలని సర్వోన్నత న్యాయస్థానం పలు సందర్భాలలో స్పష్టంచేసింది. అయినా జగన్‌రెడ్డి కేసులలో పుష్కర కాలం గడచినా విచారణ కూడా పూర్తి కాలేదు. ఈ మధ్యలో ఎందరో ప్రధాన న్యాయమూర్తులు పదవీ విరమణ చేశారు. ఇలాంటి సందర్భాలలోనే కదా వ్యవస్థలపై ప్రజలు విశ్వాసం కోల్పోయేది? తమ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పాదుకోవాల్సిన బాధ్యత న్యాయ వ్యవస్థలోని బాధ్యులపై లేదా? జగన్‌రెడ్డిపై త్వరితగతిన విచారణ జరగకుండా అడ్డుకుంటోంది ఎవరు? ఆయనపై త్వరితగతిన విచారణ పూర్తిచేసి, దోషి లేదా నిర్దోషి అని ప్రకటిస్తే ప్రజలకు అటు న్యాయ వ్యవస్థపైనా, ఇటు పాలక వర్గాలపైనా నమ్మకం పెరుగుతుంది కదా? అతీగతీ లేకుండా పడివున్న ఈ కేసులలో భవిష్యత్తులో విచారణ పూర్తై జగన్‌రెడ్డి దోషిగా తేలితే గతంలో ముఖ్యమంత్రిగా ఆయన చేసిన తప్పు ఒప్పులకు ఎవరు బాధ్యత వహిస్తారు? వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసునే తీసుకుందాం. మంత్రిగా, ఎంపీగా, ఎమ్మెల్యేగా పనిచేయడమే కాకుండా ఒక దివంగత ముఖ్యమంత్రికి సొంత సోదరుడు, మరో మాజీ ముఖ్యమంత్రికి సొంత బాబాయి అయిన వివేకానందరెడ్డి హత్య కేసుకే దిక్కూ మొక్కూ లేకపోతే ప్రజలకు న్యాయ వ్యవస్థపైన, ప్రభుత్వాలపైన నమ్మకం ఎందుకుండాలి? ఎన్నికల్లో ప్రజలు ఇచ్చే తీర్పు మాత్రమే పరిష్కారం అని చెబితే మరి ఇన్ని వ్యవస్థలు ఎందుకు? మనం గర్విస్తున్న రాజ్యాంగానికి ఏపాటి విలువ ఇస్తున్నట్టు?

**ప్రజలు ఆగ్రహిస్తే అంతే!**

శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో ప్రజల తిరుగుబాటుకు రాజ్యాంగం బలహీనంగా ఉండటం కారణం కాదని చెప్పవచ్చు. విదేశీ హస్తం కూడా కారణం కాకపోవచ్చు. ప్రజల్లో అసంతృప్తి, అసహనం గూడుకట్టుకొని ఉండకపోతే ఏ విదేశీ శక్తి కూడా ఏమీ చేయలేదు. ఇందిరాగాంధీ అధికారంలో ఉన్నప్పుడు తన ప్రభుత్వానికి ఇబ్బంది ఏర్పడినప్పుడల్లా విదేశీ హస్తం అని నిందించేవారు. నిజానికి నాటి నుంచి నేటి వరకు ఏ విదేశీ శక్తి లేదా హస్తం మన దేశ పురోగతిని అడ్డుకోలేకపోయింది కదా? ప్రభుత్వాలు, వ్యవస్థలలో అవినీతి పెరిగిపోవడం వల్లనే మన దేశం అభివృద్ధి చెందాల్సినంతగా చెందలేదు. రాజ్యాంగబద్ధ సంస్థలలో కూడా అవినీతి చొరబడటం వల్ల సామాన్యులకు న్యాయం దొరకని దుస్థితి ఏర్పడింది. జగన్‌రెడ్డి, వివేకానందరెడ్డి కేసులే అపరిష్కృతంగా ఉన్నాయంటే న్యాయ వ్యవస్థపైన, ప్రభుత్వాలపైన ప్రజలకు నమ్మకం ఎలా ఉంటుంది? నేపాల్ ప్రభుత్వం కొన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలను నిషేధించడం వల్ల ప్రజల్లో ఆగ్రహావేశాలు పెల్లుబికాయని చెబుతున్నారు గానీ, అంతకు మించిన కారణం ఉండే ఉంటుంది. కేవలం సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలను నిషేధించినంత మాత్రాన మంత్రులపై దాడులు చేయడం, వారి ఇళ్లు ధ్వంసం చేయడం జరిగే పనేనా? ఆ ప్రభుత్వంపై ప్రజల్లో అప్పటికే అసంతృప్తి గూడుకట్టుకొని ఉండి ఉంటుంది. ఆలస్యంగా అందుతున్న సమాచారం ప్రకారం నేపాల్‌కు చెందిన ఒక మంత్రి కారు ఒక మైనర్ బాలికను ఢీకొని ఆపకుండా వెళ్లిపోవడంతో అగ్నికి ఆజ్యం పోసినట్టయింది. కారు డ్రైవర్‌ను పట్టుకున్న 24 గంటల్లోనే సదరు డ్రైవర్‌కు బెయిల్ ఇవ్వడం, సదరు సంఘటనను స్వల్పమైనదిగా పేర్కొనడంతో ప్రజల్లో ఆగ్రహావేశాలు రగిలించిందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో నిరాశ, నిస్పృహలతో ఉన్న ప్రజలు సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలను నిషేధించడంతో ఆగ్రహావేశాలు కట్టులుతెగి దాడులకు తెగబడ్డారు. చివరికి ప్రభుత్వం కూలిపోయింది. శ్రీలంకలో కూడా ఆ దేశ అధ్యక్షుడి భవనంపై ప్రజలు దాడి చేసి అధ్యక్షుడి బెడ్ రూంలోనూ, స్నానాల తొట్టిలోనూ కూర్చొని ఫొటోలకు పోజులిచ్చారంటే ప్రభుత్వంపై ఎంత విరక్తి చెందారో అర్థం చేసుకోవచ్చు. ఆ తిరుగుబాట్ల తర్వాత శ్రీలంక, బంగ్లాదేశ్‌లో ప్రజల జీవితాలు అమాంతం బాగుపడ్డాయా అంటే లేదనే చెప్పవచ్చు. అయితే అప్పటి తమ కోపానికి కారకులైన పాలకులు దేశం విడిచి పారిపోవడంతో ప్రజలు శాంతించారు. ఇప్పుడు నేపాల్‌లో కూడా ఓలి ప్రభుత్వం రాజీనామా చేయడంతో ప్రజలు మెల్ల మెల్లగా శాంతించారు. ఆ దేశ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తాత్కాలిక ప్రధానిగా నియమించుకుందామని సైన్యం నుంచి ప్రతిపాదన వచ్చినా ఆందోళనకారులు సమర్థించలేదు. అంటే న్యాయ వ్యవస్థపైనా అక్కడి ప్రజలు విశ్వాసం కోల్పోయారని భావించాలి.

# మనసుతో.. మనిషిగా..

దానగుణం కలవారిని మూడురకాలుగా విభజించారు పెద్దలు. అవసరానికి ఆదుకోమంటూ అర్థిస్తే కాదనకుండా ఎంతో కొంత ఇచ్చి పంపేవాడు దాత. అడిగినవారి అవసరాన్ని అంచనావేసి అడిగిన దానికన్నా అదనంగా ముట్టచెప్పేవాడు ఉదారుడు. వదాన్యుడనే మూడోస్థాయి దాత అవతలివాడికి అవసరం ముంచుకొచ్చిందనో, ఆపద వాటిల్లిందనో తెలియగానే వెళ్లి చేతనైనంత సాయం చేసొస్తాడు. 'ఇది ధర్మంబు ఇది ఈలువ (మంచిగుణం) ఇది వ్రతము ఇది సద్వివేకము ఇది ఆచారంబు ఇది దేవపూజ' అంటూ కాశీఖండంలో శ్రీనాథుడు వర్ణించిన లక్షణాలన్నీ దాతృత్వానికీ వర్తిస్తాయి. 'త్యాగేన భోగీభవతి.. త్యాగమే భోగానికి సాధనం' అనేది నిజమైన దాతల విశ్వాసం. దానం ఒక స్వభావం. పెద్దలనుంచి సంక్రమించే వారసత్వ సద్గుణం. 'అది సత్పురుషుల లక్షణం' అన్నాడు పెనుమళ్ల సోమకవి. అలాంటివారికి 'చిత్తము చాల నిర్మలము చేతలు ధర్మనివాస వాసనాయత్తములు' అని వర్ణించాడాయన సీమంతినీ కల్యాణంలో. దానం గురించి భారతం అనుశాసనిక పర్వం కూడా విశేషంగా ప్రస్తావించింది. వివిధ దానగుణాలను ప్రస్తుతించింది. 'వచ్చినవాడు మహావిష్ణువు. తొందరపడకు 'వారిజాక్షులందు వైవాహికములందు ప్రాణవిత్త మానభంగమందు బొంకవచ్చు.. వలదీ దానము గీనమున్' అని శుక్రాచార్యుడు నెత్తీనోరూ బాదుకున్నాడు. వినలేదు బలిచక్రవర్తి. 'రాజ్యము గీజ్యమున్ సతతమే? కాయంబు నాపాయమే..' ఈ దేహం శాశ్వతమా.. పోతూ పోతూ ముల్లె మూటకట్టుకుని పోతామా!' అన్నాడు నిశ్చయబుద్ధితో. ఫలితంగా తొలుత సుతల లోకానికి రాజయ్యాడు. దరిమిలా సావర్ణిమన్వంతరంలో ఇంద్రపదవికి యోగ్యుడయ్యాడు. అంతేకాదు లోకాలను కాచే శ్రీమహావిష్ణువు బలిచక్రవర్తి ఇంటికి నిత్యం కాపలా కాశాడు. దానబుద్ధికి దక్కిన అమూల్య వరమది. 'చచ్చువారలెవరు చావనివారేరి చచ్చి బ్రతికియుండు జనములెవరు?' తేల్చుకోమన్నాడు వేమన. చనిపోయినా బతికున్న కీర్తికాయుడు బలిచక్రవర్తి. అందుకే ధనానికి ప్రయోజనాలు లేదా లక్ష్యాలు రెండేనంది శాస్త్రం. మొదటిది భోగం, రెండోది దానం. 'తినజాలక, ఏ ధర్మము కనజాలక పరమ లోభికి ఇష్టము కూర్చే ధనమెల్ల నేలపాలని కనుమప్పా!' అని కవి చౌడప్ప చెప్పిందీ అదే!

**తోటివారికి కష్టం వచ్చినప్పుడు చెమ్మగిల్లే కళ్లు, సాయపడే చేతులు- ఈ సృష్టికి అలంకారాలు. 'ప్రార్థించే పెదవులకన్నా- సాయపడే చేతులు మిన్న' అన్నారందుకే! ఇంతకూ దానమో ధర్మమో సాయమో చేయాలంటే- ధనం ఉన్నవాడే కావాలని లేదు- మనసున్నవాడైతే చాలు. ఆ మాటకొస్తే మనసుతో జీవిస్తున్నవాడే మనిషి- 'మననే వహి జీవతి' అంది యోగవాసిష్ఠం. నిండు చంద్రుడు ఉన్న రాత్రినే 'జ్యోతిష్మతీ' అనాలన్నాడు- రఘువంశంలో కాళిదాసు. నక్షత్రాల వెలుగులతో కాదు- చంద్రుడి చల్లని కాంతితోనే లోకానికి ఉపయోగం కాబట్టి! 'సజ్జనులు లోకంలో వసంత రుతువుల్లా సంచరిస్తారు' అన్నారు శంకరులు. బిహార్‌లోని నలందా జిల్లాకు చెందిన శ్రవణ్‌కుమార్ అలాంటి మనసున్న సజ్జనుడు. పాలు లేక శిశువు, ఎండిన పాలిండ్లతో తల్లి- తల్లడిల్లే దృశ్యం చూసి చలించిపోయారాయన. ఇది 1990లో జరిగింది. ఆనాటి నుంచి తన దుకాణం ముందు 'పసికందులకు పాలు ఉచితం' అని బోర్డు పెట్టించి మరీ ఎంతోమంది చిన్నారుల ఆకలి తీర్చారాయన. శ్రవణ్ కీర్తిశేషులైన తరవాతా ఆ ఉచిత పాల పంపిణీని అంతే ఇష్టంగా కొనసాగిస్తున్న ఆయన సోదరుడు రంజిత్‌కుమార్ కూడా మనలాంటి సామాన్యుడే- కాకపోతే మనసున్నవాడు!**

# కిర్క్ హత్యలో కార్ల్ మార్క్స్ ప్రమేయం

**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మానసపుత్రుడైన చార్లీ కిర్క్ దారుణ హత్యకు గురయ్యాడు. ఉథా వ్యాలీ యూనివర్సిటీలో సెప్టెంబరు 11న నిర్వహించిన 'ద అమెరికన్ కమ్‌బ్యాక్ టూర్' కార్యక్రమంలో ప్రసంగిస్తుండగా కిర్క్‌ను కాలేజీ విద్యార్థి ఒకడు తుపాకీతో కాల్చి చంపేశాడు. కిర్క్ 32 ఏళ్ల యువకుడు. అయితే ఛాందసుడు. కొంతమంది యువకులు పుట్టుకతో వృద్ధులు అనే బాపతు! అమెరికా కళాశాలల్లో అల్లరిమూకలు కాల్పులు జరిపిన వార్తలు తరచూ వింటుంటాం. ఇది అలాంటి హత్య కాదు. అమెరికన్లేగాక ఈ వార్త తెలిసిన వారంతా దీన్ని ఒకానొక హత్యా సంఘటనగా తేలిగ్గా తీసిపడేయడం లేదు. దాన్నొక భిన్న సైద్ధాంతిక శిబిరాల ఘర్షణగా చూస్తున్నారు. వివిధ దేశాలపై, వివిధ సమూహాలపై ట్రంప్ అనుసరిస్తున్న కక్షసాధింపు విధానాల మీద జరుగబోయే ప్రతిచర్యలకు ఇదొక మచ్చుతునక అంటున్నారు. ఇది ఇంతటితో ఆగదని కూడ కొందరు అంటున్నారు. చార్లీ కిర్క్ మీద కాల్పులు జరిపిన విద్యార్థిని పోలీసులు గుర్తించారు, అరెస్టు చేశారు. అతని పేరు టేలర్ రాబిన్‌సన్. 22 ఏళ్ల యువకుడు. హంతకుడ్ని చూసి ఉథా గవర్నర్ స్పెన్సర్ కాక్స్ షాక్‌కు గురయ్యాడు. రాబిన్‌సన్ కుటుంబంతో అతనికి సన్నిహిత సంబంధాలున్నాయి. మంచి కుటుంబం; మంచి అబ్బాయి; కానీ ఇంతలో ఇలా ఎలా రాడికల్‌గా మారిపోయాడు అంటూ ఆశ్చర్యపోయాడు. అమెరికాలో కూడా కమ్యూనిస్టు తీవ్రవాదుల్ని రాడికల్స్ అంటారు. చార్లీ కిర్క్ క్రైస్తవ మతవాది; అతివాద జాతీయవాది. సులువుగా చెప్పకోవాలంటే అమెరికాలో పురాతన అమెరికన్లు, సనాతన క్రైస్తవులు మాత్రమే ఉండాలని ప్రగాఢంగా నమ్మేవాడు.**



2020 నవంబరు నెలలో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రాట్ జో బైడెన్ చేతిలో ట్రంప్ ఓడిపోయాడు. అయినా ప్రెసిడెంట్ ఎలెక్ట్‌కు అధికారాన్ని అప్పచెప్పి గద్దె దిగడానికి ట్రంప్ ఒప్పుకోలేదు. 2021 జనవరి 6న వాషింగ్టన్ డీసీలో తన అనుచరులైన అల్లరిమూకలతో ఒక కపట దాడిని నిర్వహించాడు. ఆ అల్లర్లలో కిర్క్ కీలక పాత్ర పోషించి ట్రంప్‌కు మరింత దగ్గర అయ్యాడు. ట్రంప్ రెండోసారి శ్వేతభవన నివాసి కావడంతో కిర్క్ మరింత రెచ్చిపోయాడు. చార్లీకి ఉదారవాదం అస్సలు పడదు. ఒక్కసారి అందులో పడితే కొట్టుకుపోతాం అనేది అతని ప్రగాఢ నమ్మకం. ఉదారవాదం అంటే ఇతర మతాలను, ఇతర దేవుళ్ళను గౌరవించాలి. మహిళల్ని ఆదరించాలి. అతనికి గర్భస్రావం, విడాకులు కూడా నచ్చవు. ఎల్‌జీబీటీక్యూ హక్కులు అస్సలు నచ్చవు.

ఉదారవాదాలకు మూలం కార్ల్ మార్క్స్ అని అతని అక్కసు. తన ప్రత్యర్థుల్ని 'సాంస్కృతిక మార్క్సిస్టులు' అని తిట్టేవాడు. ఇదో విచిత్ర పదబంధం. మార్క్సిజం ఆర్థిక మూలాలను మాత్రమే పట్టించుకుంటుంది గానీ సాంస్కృతిక అంశాలను పట్టించుకోదని మన దేశంలో నయా అంబేద్కరిస్టులు కొందరు విమర్శిస్తుంటారు. కిర్క్ మార్క్సిజాన్ని ఒక పెద్ద ఉపద్రవంగా పరిగణించేవాడు. ఒకసారి మార్క్సిజం వలలో పడితే ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అంశాలన్నింటిలోనూ రాజీపడాల్సి వస్తుందని అతను భావించేవాడు. ప్రపంచవ్యాప్తంగా అమెరికా బలపడాలంటే ఫాసిజం, నాజీజం వంటి సిద్ధాంతాలను పునరుద్ధరించాల్సిందే అని నమ్మేవాడు. 'సాంస్కృతిక బోల్షివిక్కు' అనే మాటను హిట్లర్ కాలపు జర్మనీలో ఒక తిట్టుగా వాడేవారు. ఇప్పుడు అమెరికాలో ట్రంప్ అనుయాయులు తమ ప్రత్యర్థుల మీద ఇదే మాటను ప్రయోగిస్తున్నారు.

ట్రంప్ బలహీనపడుతున్న దశలో చార్లీ కిర్క్ చెలరేగిపోతుండడం చాలా మందికి చికాకు తెప్పించింది. ఆ మేరకు అమెరికా యువతరంలో అతని మీద ఏవగింపు కూడా పెరుగుతూ వచ్చింది. రాబిన్‌సన్ చాలాకాలంగా కిర్క్ కదలికల్ని గమనిస్తున్నట్టు విచారణలో తేలింది. కిర్క్ సనాతన భావాల్ని అతను అసహ్యించుకునేవాడట. అతన్ని 'ఫాసిస్టు' అనేవాడట. ట్రంప్ కన్నా ముందు వీడి ఆట కట్టించాలి అనే భావంతో ఉండేవాడట. కిర్క్ హత్యకు వాడిన తుపాకీతో పాటు కొన్ని బుల్లెట్లను కూడ రాబిన్‌సన్ నుంచి ఫెడరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒక బుల్లెట్ కేసింగ్ మీద 'హేయ్ ఫాసిస్ట్! అందుకో' అని రాసి ఉంది. ఇంకో కేసింగ్ మీద 'బెల్లా సియావో' అని రాసి ఉంది. ముస్సోలిని ఫాసిస్టు పాలన రోజుల్లో అతనికి వ్యతిరేకంగా బాధితులు పాడుకున్న ఇటాలియన్ పాట పల్లవి అది. అంటే ఛార్లీ కిర్క్‌ను రాబిన్‌సన్ ఎంతగా అధ్యయనం చేశాడో అతని మీద ఎంతగా కసితో రగిలిపోయాడో అర్థం అవుతోంది. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో ఇటలీలో ఫాసిజాన్నీ, జర్మనీలో నాజీజాన్నీ కార్ల్ మార్క్స్ అభిమానులు అంతం చేశారు. ఇప్పుడు అమెరికా ఫాసిస్టుల మీద కూడా సాంస్కృతిక మార్క్సిస్టులే తిరగబడుతున్నారు మరి.

# రసాయనాలతో పెరుగుతున్న క్యాన్సర్

- అంతర్జాతీయ లింఫోయా దినోత్సవం
- సెప్టెంబర్ 15న

**డాక్టర్. విష్ణు ప్రియాంక**
**కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్**
**కిమ్స్ సవీర, అనంతపురం**



అనంతపురం సెప్టెంబర్ 14,అనంత జనశక్తి న్యూస్

క్యాన్సర్ అంటేనే ప్రతి ఒక్కరూ జంకుతారు. క్యాన్సర్ వస్తే మరణం తప్పా... జీవితం లేదు అని భయపడుతారు. అయితే క్యాన్సర్ మీద ప్రజల్లో అనేక అపోహాలు ఉన్నాయి. వాటిని గురించి తెలుసుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరి మీదు ఉంది. క్యాన్సర్ అనేది ఇప్పుడు చికత్స చేయగలిన వ్యాధి, కానీ ముందస్తుగా గుర్తించాలి.

అంతర్జాతీయ లింఫోమా దినోత్సవం సందర్భంగా లింఫోమా గురించి తెలుసుకుందాం. లింఫోమా.. ఒక రకమైన రక్త క్యాన్సర్. నేరుగా శోషరస గ్రంథుల వ్యవస్థ మీద ప్రభావం చూపుతుంది. శరీరంలో శోషరస గ్రంథుల పాత్ర చాలా ప్రధానమైంది. వివిధ ఇన్ఫెక్షన్లకు, వ్యాధులకు వ్యతిరేకంగా పోరాడే బాధ్యత వీటిదే. శోషరస గ్రంథులు, శోషరస నాళం, ప్లీహం, అస్థిమజ్జ మొదలైన భాగాలకు .. శోషరస వ్యవస్థే రక్షణ కవచం. ఒక రకమైన కణాలైన లింఫోసైట్లు అసాధారణంగా పెరిగిపోవడం వల్ల ఆయా భాగాల్లో కణుతులు ఏర్పడి.. లింఫోమాకు దారి తీస్తుంది. దురదృష్టవశాత్తు ఈ క్యాన్సర్ గురించి ప్రజల్లో అవగాహన తక్కువే. కానీ వ్యాధి తీవ్రత చాలా ఎక్కువ.

ప్రపంచ వ్యాప్తంగా ప్రజల ప్రాణాలను కబళిస్తున్న క్యాన్సర్లలో లింఫోమా ఆరో స్థానంలో ఉంది. ఏటా ఏడు లక్షలకు పైగా కొత్త కేసులు నిర్ధారణ అవుతున్నాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఇంత విశృంఖలంగా ప్రబలుతున్నా.. చాలామందికి లింఫోమా క్యాన్సర్ గురించి కానీ, వ్యాధి లక్షణాల గురించి కానీ అవగాహన ఉండటం లేదు. భారత్‌లో వేగంగా వ్యాపించే రక్త క్యాన్సర్‌లలో లింఫోమా ప్రధానమైంది. దేశంలో ఏటా తొంభైవేల వరకూ కొత్త కేసులు వెలుగులోకి వస్తున్నాయి. లింఫోమాకు కచ్చితమైన కారణాలు తెలియకపోయినా.. వృద్ధాప్యం, రసాయన సంబంధమైన పరిశ్రమలలో పనిచేయడం, రసాయన వ్యర్థాలకు చేరువలో జీవించడం, కుటుంబ చరిత్ర.. తదితర అంశాలను తేలిగ్గా తీసుకోలేం. వ్యవసాయానికి వాడే పురుగుల మందులు కూడా దీనికో కారణమని అధ్యయనాలు చెబుతున్నాయి. లింఫోమా క్యాన్సర్‌లో ప్రధానంగా రెండు రకాలు ఉన్నాయి.ఒకటి.. హాడ్గ్‌కిన్ లింఫోమా. రెండు.. నాన్‌హాడ్గ్‌కిన్ లింఫోమా. మొదటిదైన హాడ్గ్‌కిన్ లింఫోమా చాలా అరుదుగా వస్తుంది. లింఫోమా కేసులలో దీని వాటా 10 శాతం మాత్రమే. వ్యాధి రకాన్ని బట్టి, దశను బట్టి లింఫోమా లక్షణాలు వేర్వేరుగా ఉంటాయి. .అయితే కొన్ని లక్షణాలు మాత్రం హాడ్గ్‌కిన్ లింఫోమా ఎక్కువగా పిల్లల్లో చూస్తాం.లింఫోమా లక్షణాలు: మెడ, చంక దగ్గర వాపు, జ్వరం, బరువు తగ్గడం, రాత్రి వేడి చెమటలు, అలసట వంటివి కనిస్తుంటాయి.

చికిత్స: కీమోథెరపీ, రేడియోథెరపీ, టార్గెటెడ్ థెరపీ, స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్, వైద్య పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ, ఇప్పుడు లింఫోమా చికిత్సలో విజయశాతం పెరిగింది.

గతంలో క్యాన్సర్ గుర్తించడానికి చాలా రకాలుగా ఇబ్బందులు ఎదుర్యయేవి. ఇప్పుడు పెరిగిన సాంకేతికతో వ్యాధులను గుర్తించడం సులువుగా మారింది. కిమ్స్ సవీర అనంతపురంలో కూడా అనేక రకాలపై క్యాన్సర్లకు ఇప్పుడు విజయవంతంగా చికిత్స అందుతోంది.

# మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

- నేడు కలెక్టరేట్ లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (PGRS) నిర్వహణ
- సోమవారం ఉదయం 9.30 నుంచి 1.00 గంట వరకు పిజిఆర్ఎస్
- జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్



పుట్టపర్తి, ఆగస్టు 14 :అనంత జనశక్తి న్యూస్

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు .అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు

**కలెక్టరేట్ లో పిజిఆర్ఎస్ నిర్వహణ :**
ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (PGRS) ను ఈ సోమవారం కలెక్టరేట్ లో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్ తెలిపారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చును ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (PGRS)" అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు .అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని డివిజన్, మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చునన్నారు ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు

# నంద్యాల జిల్లా కొత్త ఎస్పీగా సునీల్ షెరాన్ బాధ్యతలు స్వీకారం

నంద్యాల సెప్టెంబర్ 14, అనంత జనశక్తి న్యూస్



నంద్యాల జిల్లాకు జిల్లా పోలీసు అధికారి (ఎస్పీ)గా 2019 బ్యాచ్ ఐపీఎస్ అధికారి సునీల్ షెరాన్ నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆయన ఆదివారం బాధ్యతలు స్వీకరించారు.సునీల్ షెరాన్ మాట్లాడుతూ——నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, చట్టవ్యవస్థ బలోపేతం, ప్రజా భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపశమనం ఉండదని, అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నంద్యాల జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు ఎటువంటి ఊరట ఉండదు.మట్కా, గుట్కా, అక్రమ రవాణా, చీటి ఫండ్ వంటి దందాలపై ప్రత్యేక నిఘా. మహిళలు, బాలల భద్రతకు ప్రత్యేక దృష్టి.పోలీసు వ్యవస్థపై ప్రజల నమ్మకం పెంచేలా సమర్థవంతమైన చర్యలు. ప్రజలు నేరాలను నిర్భయంగా ఫిర్యాదు చేసే వాతావరణం సృష్టించటం.విశాఖపట్నం గ్రేహౌండ్స్ యూనిట్ నుంచి నేరుగా నంద్యాల ఎస్పీగా వచ్చిన సునీల్ షెరాన్‌ను జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, సిబ్బంది ఘనంగా స్వాగతించారు.ఇక, గత ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా బదిలీపై డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ సమర్పించనున్నారు. "నంద్యాల జిల్లా ప్రజలు భయపడనవసరం లేదు... న్యాయం కోసం ఎప్పుడూ పోలీసులు మీతో ఉంటారు" అని ఎస్పీ సునీల్ షెరాన్ ప్రజలకు భరోసా ఇచ్చారు.

# జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన వి.హర్షవర్ధన్ రాజు




- శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి, మహిళలు/పిల్లల భద్రతను పెంపొందించడం ప్రధాన ధ్యేయం: జిల్లా ఎస్పీ

ప్రకాశం సెప్టెంబర్ 14,అనంత జనశక్తి న్యూస్

ప్రకాశం జిల్లా నూతన ఎస్పీగా వి. హర్షవర్ధన్ రాజు, ఐపీఎస్ ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ ని ఏఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, ఎఆర్ అదనపు ఎస్పీ కె. శ్రీనివాసరావు, అన్ని సబ్‌డివిజనల్ డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా ప్రఖ్యాత స్వాతంత్ర్య సమరయోధులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు పేరు ఈ జిల్లాకు ఉండటం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఈ జిల్లాకు ప్రత్యేకమైన గౌరవం, మంచి పేరు ఉంది. ఆ పేరుకు మరింత నిలువ వుండేలా కృషి చేసి, ప్రజలకు సేవ చేయడానికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శాంతి భద్రతల పరిరక్షణను ప్రధాన లక్ష్యంగా చేసుకుని విధులు నిర్వహిస్తానని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, సిబ్బంది నుండి అధికారుల వరకు అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, ప్రజలకు ఉత్తమమైన సేవలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.మహిళల భద్రత, వారి రక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తామని జిల్లా ఎస్పీ గారు తెలిపారు. శక్తి యాప్‌పై మరింత విస్తృతంగా అవగాహన కల్పించి, ప్రతి మహిళ ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆపదసమయాల్లో సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. జిల్లాలో శాంతి భద్రత పరిరక్షణ, నేరాల నియంత్రణ విషయంలో ఎటువంటి రాజీ పడబోమని, అసాంఘిక కార్యకలాపాలను అరికడుతూ, నేరరహిత జిల్లాగా మార్చడంలో తనదైన పాత్ర పోషిస్తాన్నారు.నేరాలు, చట్టవ్యతిరేక లేదా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రోత్సహించినా, శాంతి భద్రతలకు మరియు ప్రజాశాంతికి విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ గారు హెచ్చరించారు.పోలీస్ సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కార్యాచరణలు రూపొందిస్తూ, నూతన ప్రణాళికలను అమలు చేస్తామని తెలిపారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటామని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు.

# శ్రీ సత్యసాయి జిల్లా ప్రత్యేకతను కాపాడతాం...



- జిల్లాలో శాంతిభద్రతలు, మహిళల సంరక్షణ, సైబర్ క్రైమ్ పై ప్రత్యేక దృష్టి... జిల్లా ఎస్పీ..
- శ్రీ సత్యసాయి జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఎస్. సతీష్ కుమార్ ఐపీఎస్

పుట్టపర్తి సెప్టెంబర్ 14,అనంత జనశక్తి న్యూస్

శ్రీ సత్యసాయి జిల్లా ప్రత్యేకతను కాపాడేలా విధులు నిర్వర్తిస్తానని శ్రీ సత్యసాయి జిల్లా నూతన ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఐపీఎస్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న శ్రీ ఎస్ సతీష్ కుమార్ ఐపీఎస్ బదిలీలో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లాకు బదిలీ అయ్యారు.ఆదివారం పుట్టపర్తిలోని జిల్లా పోలీస్ కార్యాలయం లోని ఎస్పీ ఛాంబర్ లో ఉదయం 11 గంటలకు నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ఎస్పీ శ్రీమతి వి. రత్న ఐపీఎస్ నుండి, నూతన ఎస్పీ గా శ్రీ ఎస్ సతీష్ కుమార్ ఐపీఎస్ బాధ్యతలు చేపట్టారు. పుట్టపర్తి లోని జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన జిల్లా ఎస్పీ శ్రీ ఎస్ సతీష్ కుమార్ ఐపీఎస్ కి పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వినాయక దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.అనంతరం పోలీస్ బ్యాండ్ నడుమ ఛాంబర్ కు చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక పూజల్లో పాల్గొని ఎస్పీ శ్రీమతి వి. రత్న ఐపీఎస్ నుంచి జిల్లా ఎస్పీగా ఎస్. సతీష్ కుమార్ ఐపీఎస్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మీడియా సమావేశంలో మాట్లాడుతూ... 2016 బ్యాచ్ కు చెందిన ఐపిఎస్ ఆఫీసర్ నన్నారు. జిల్లాలో శాంతిభద్రతలు, మహిళల సంరక్షణ, సైబర్ క్రైమ్ పై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందన్నారు. సత్యసాయి జిల్లాకు ఉన్న ప్రత్యేకతను కాపాడడానికి తప్పక కృషి చేస్తానన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ ను సందర్శించడం జరుగుతుందని, ప్రతి ఏరియాలో జరుగుతున్న నేరాల వివరాలను తెలుసుకుని వాటి నియంత్రణకు చర్యలు చేపడతామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజలందరికీ అండగా ఉంటూ ముందుకు వెళ్తామని జిల్లా ఎస్పీ మీడియా సమావేశంలో తెలియజేశారు.



# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

- వేదపండితుల ఆశీర్వాదాలు, స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరణ
- స్వామివారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై ఉండాలని ఆకాంక్ష

తిరుమల సెప్టెంబర్ 14,
అనంత జనశక్తి న్యూస్



రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. తిరుపతి పర్యటనలో భాగంగా ఆమె తిరుమల క్షేత్రానికి వెళ్లారు. ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో లోక్ సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా , ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ శ్రీ అయ్యన్న పాత్రుడు , శ్రీమతి పురందరేశ్వరి , రఘురామ కృష్ణంరాజు తదితరులతో కలసి ప్రత్యేకంగా స్వామి వారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం వేదపండితులు ఆశీర్వచణాలు అందజేశారు. అలాగే స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ స్వామి వారిని ఎప్పుడు దర్శించుకున్నా.. మనసుకు ఎంతో సంతోషంగా ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రజలపై స్వామి వారి ఆశీస్సులు ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనించాలని ఎమ్మెల్యే సునీత కోరుకున్నారు...

# మెగా రక్తదాన శిబిరానికి సిద్ధమైన సత్తన్న సేన

- మంత్రి సత్య కుమార్ యాదవ్ జన్మదినం సందర్భంగా ధర్మవరం లో మెగా రక్తదాన శిబిరం
- 0మంత్రి సత్య కుమార్ యాదవ్ జన్మదినం సందర్భంగా– సత్యన్నసేన ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం






ధర్మవరం రూరల్ సెప్టెంబర్ 14,
అనంత జనశక్తి న్యూస్:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రేరణతో ఏర్పడిన సత్యన్నసేన అనేక సేవా కార్యక్రమాలను చేపట్టుతూ ప్రజాసేవలో ముందంజలో కొనసాగుతోంది. ఈ నెల 16వ తేదీన మంత్రి జన్మదినాన్ని పురస్కరించుకుని, ధర్మవరం పట్టణంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించేందుకు సిద్ధమైంది. ఈ సందర్భంలో భాగంగా, సెప్టెంబర్ 15వ తేదీన సోమవారం ఉదయం 10 గంటల నుండి ధర్మవరం ఎన్డీఏ కార్యాలయం ప్రాంగణంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు సత్యన్నసేన ప్రతినిధులు మరియు మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు తెలిపారు. ఈ శిబిరంలో వందలాది మంది ప్రజలు, కార్యకర్తలు, యువతీ యువకులు పాల్గొని రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం అనేది ప్రాణదానం అన్న భావనతో ప్రతి ఒక్కరు ఈ పవిత్ర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని వారు కోరారు. మంత్రి సత్య కుమార్ యాదవ్ స్ఫూర్తితో జరుగుతున్న ఈ కార్యక్రమం ధర్మవరం పట్టణంలో ఒక గొప్ప సేవా యజ్ఞంగా నిలిచిపోతుందని సత్యన్నసేన ప్రతినిధులు పేర్కొన్నారు.

# మంత్రి జన్మదిన సందర్భంగా... విద్యార్థులకు... అనాథలకు, వృద్ధులకు ప్రేమతో ఆర్థిక సహాయం.

- ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో 16వ తేదీన మంత్రి సత్యకుమార్ యాదవ్ అందుబాటులో ఉంటారు – హరీష్ బాబు
- వ్యక్తిగత సన్మానాల కంటే సమాజసేవ మిన్న
- మంత్రి సత్యకుమార్ యాదవ్



ధర్మవరం రూరల్ సెప్టెంబర్ 13,
అనంత జనశక్తి న్యూస్ :

ఈ నెల 16వ తేదీన మన ప్రియతమ నాయకులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ జన్మదినోత్సవం సందర్భంగా మంత్రి ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ని కలుసుకోబోయే కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు ధర్మవరం నియోజకవర్గ ప్రజలు పూలదండలు, పుష్పగుచ్ఛాలు, శాలువాలు, బొకేలు వంటి వాటిని తీసుకురావద్దని, వాటికి బదులుగా నోటుబుక్కులు, పెన్నులు, పెన్సిళ్లు, టవాళ్లు, బెడ్‌షీట్లు వంటి సామగ్రిని తీసుకురావాలని మంత్రి సూచించారని హరీష్ బాబు తెలిపారు. మంత్రి పేర్కొన్నదేమిటంటే –విద్యాభ్యాసం కొనసాగిస్తున్న అనాథ పిల్లలకు నోటుబుక్కులు, పెన్నులు, పెన్సిళ్లు ఉపయోగపడతాయి. వృద్ధాశ్రమాలలో ఉన్న వృద్ధులకు టవాళ్లు, బెడ్‌షీట్లు అందించడం ద్వారా వారికి ఉపయుక్తమవుతుంది. వ్యక్తిగత సన్మానం కంటే సమాజానికి ఉపయోగపడే కార్యక్రమం చేయడం గొప్పదని మంత్రి అభిప్రాయపడ్డారని హరీష్ బాబు అన్నారు. మంత్రి సూచనల మేరకు ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేస్తున్నానని హరీష్ బాబు పేర్కొన్నారు.

# మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

- ఈనెల 15వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ
- జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- డిఆర్ఓ ఏ.మలోల

**అనంతపురం, సెప్టెంబర్ 14 :అనంత జనశక్తి న్యూస్**

మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని డిఆర్ఓ ఏ.మలోల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని డిఆర్ఓ విజ్ఞప్తి చేశారు.ఈనెల 15వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ ఈనెల 15వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని డిఆర్ఓ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# నూతన ఎస్పీకి అభినందనలు



**పుట్టపర్తి సెప్టెంబర్ 14,అనంత జనశక్తి న్యూస్**

శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సతీష్‌కుమార్ కు జిల్లా పోలీసు అధికారులు సిబ్బంది పుష్పగుచ్చములు , పూల మొక్కలు, పండ్లతో ఎస్పీకి సాగర స్వాగతం పలికారు.ఈ సందర్భంగా జిల్లాలోని డిఎస్పీలు విజయ్ కుమార్, నరసింగప్ప, హేమంత్ కుమార్ ,శివన్నారాయణ స్వామి , ఆదినారాయణ , ఏ ఆర్ డి ఎస్ పి శ్రీనివాసులు , ఏవో సుజాత సూపర్డెంట్ సరస్వతి మల్లికార్జున ఎస్పి సిసి చిరంజీవి, అర్ ఐ లు వలి, మహేష్‌తో పాటు జిల్లాలోని సిఐలు ,ఎస్ఐలు , పోలీస్ సిబ్బంది, కార్యాలయంలోని అన్ని విభాగాల అధికారులు, డిపిఓ సిబ్బంది నూతన ఎస్పీ ని మర్యాదపూర్వకంగా కలిసి బొకేలు అందజేసి అభినందనలు తెలియజేశారు.

# ఆధ్యాత్మిక తో మానసిక ప్రశాంతత



- ఎంపీ కేశినేని శివనాథ్
- గుంటుపల్లి సిఏ కన్వెన్షన్ లో దశకోటి మహాయజ్ఞం
- స్వామీ అభిషేక్ బ్రహ్మాచారి మహరాజ్ ఆశీస్సులు అందుకున్న ఎంపీ కేశినేని

**విజయవాడ సెప్టెంబర్ 14, అనంత జనశక్తి న్యూస్**

ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనటం వల్ల ప్రజలకు మానసిక ప్రశాంతత, సద్భావన కలుగుతుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. స్వామీ అభిషేక్ బ్రహ్మాచారి మహారాజ్ (వారణాసీ) ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలోని సీఏ కళ్యాణమండపంలో జరుగుతున్న శ్రీ విద్య దశ కోటి కుంకమార్చన మహాయజ్ఞం కార్యక్రమానికి ఎంపీ కేశినేని శివనాథ్ ఆదివారం విచ్చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మైలవరం నియోజకవర్గం ఇన్చార్జ్ నూతలపాటి బాలకోటేశ్వరరావు, గొల్లపూడి గ్రామ మాజీ వైస్ ప్రెసిడెంట్ చిగురుపాటి నాగరాజు, సోసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ సంస్థ సభ్యులు ముత్తవరపు మురళీ లతో పాటు స్థానిక నాయకులు, మహిళ భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పేరం స్వర్ణలత ని పరామర్శించిన బొంబాయి, ఎంపిపి

**యాడికి, సెప్టెంబర్ 14, అనంత జనశక్తి న్యూస్:**

మండల వైకాపా సీనియర్ నాయకుడు బొంబాయి రమేష్ నాయుడు,ఎంపిపి బొంబాయి ఉమాదేవి లు ఆదివారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పేరం స్వర్ణలత ని పరామర్శించారు.హైదరాబాద్ లో బ్రెయిన్ సర్జరీ చేయించుకుని తాడిపత్రి పట్టణంలోని తన నివాసంలో వైఎస్ఆర్ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పేరం స్వర్ణలత విశ్రాంతి తీసుకుంటున్నారు .ఈ విషయం ను తెలుసుకొన్న వైస్సార్సీపీ సీనియర్ నాయకుడు బొంబాయి రమేష్ నాయుడు, ఎంపీపీ బొంబాయి ఉమాదేవి లు వైఎస్ఆర్ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పేరం స్వర్ణలత ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.






# మహిళలు రైళ్లు, విమానాలు నడుపుతున్నారు



- డ్వాక్రా సంఘాల దగ్గర నుంచి పెద్ద పెద్ద కంపెనీలు నడిపిస్తున్నారు
- మహిళలు రాణించని రంగమే లేదు.. ఎమ్మెల్యే పరిటాల సునీత
- మహిళా సాధికారత సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే సునీత
- తిరుపతిలో పలువురు ప్రముఖులతో భేటి.. ఆత్మీయ పలకరింపులు

**తిరుపతి సెప్టెంబర్ 14,అనంత జనశక్తి న్యూస్**

ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళలు ఇప్పుడు రైళ్లు, విమానాలు కూడా నడుపుతున్నారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. తిరుపతిలో జరిగిన జాతీయ మహిళా సాధికారత సదస్సులో ఆమె పాల్గొన్నారు. తిరుపతి శివారులోని రాహుల్ కన్వెన్షన్ లో రెండు రోజులపాటు మహిళా సాధికారతపై పార్లమెంటరీ మరియు శాసనసభ కమిటీల మొదటి జాతీయ సమావేశం నిర్వహించారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్, సభాపతి అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, పార్లమెంటరీ మహిళా సాధికారత కమిటీ ఛైర్‌పర్సన్ పురందేశ్వరి, శాసనసభ మహిళా కమిటీ ఛైర్‌పర్సన్ గౌరు చరిత ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. పార్లమెంటుతో పాటు రాష్ట్రాల అసెంబ్లీల నుంచి దాదాపు 250 మంది మహిళా ప్రజాప్రతినిధులు హాజరవగా.. ఇందులో ఎమ్మెల్యే పరిటాల సునీత కూడా పాల్గొన్నారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో ఆమె ప్రత్యేకంగా భేటి అయ్యారు. పార్లమెంటరీ మహిళా సాధికారత కమిటీ ఛైర్‌పర్సన్ పురందేశ్వరితో పాటు పలువురు ప్రముఖుల్ని కలిసి.. ప్రత్యేకంగా ముచ్చటించారు. రాజకీయాలతో పాటు పలు అంశాల గురించి చర్చించుకుంటున్నారు. ఈసందర్భంగా సదస్సునుద్దేశించి ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ మహిళా సాధికారతకు ఇలాంటి సమావేశాలు ఎంతో దోహదపడుతాయన్నారు. ప్రస్తుతం మహిళలకు రాజకీయాలతో పాటు ఇతర రంగాల్లో ఎదురవుతున్న సవాళ్ల గురించి చర్చించి.. సమస్యల పరిష్కారానికి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. మహిళలు అనుకుంటే ఏ రంగంలో అయినా రాణిస్తారన్నారు. ప్రస్తుతం ఏపీలో డ్వాక్రా సంఘాల దగ్గర నుంచి పెద్ద పెద్ద కంపెనీలకు సీఈఓలుగా ఉండి నడిపిస్తున్నారన్నారు. అయితే ఇంకా కొన్ని చోట్ల వివక్ష అనేది ఉందని.. దీనిని రూపుమాపేందుకు మరిన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే సునీత అభిప్రాయపడ్డారు...



# భద్రత, పరిశుభ్రతలో రాజీపడే ప్రసక్తే లేదు

- ఆహార భద్రతా ప్రమాణాలు పక్కాగా పాటించాల్సిందే
- సూచిక బోర్డులు సరైన విధంగా ఏర్పాటు చేయాలి
- ప్రతి స్టాల్ తప్పనిసరిగా ధరల పట్టికలను ప్రదర్శించాలి
- ప్రయాణికుల ఆరోగ్య భద్రతకు భరోసా కల్పించాలి
- పంటిడ్ నెహ్రూ బస్టాండ్‌లో కలెక్టర్ లక్ష్మీశ ఆకస్మిక తనిఖీలు

**విజయవాడ సెప్టెంబర్ 14,అనంత జనశక్తి న్యూస్**




ప్రయాణికుల భద్రత, బస్టాండు పరిశుభ్రతలో రాజీపడే ప్రసక్తే లేదని.. ఆహార పదార్థాల విక్రయశాలలు కచ్చితంగా ఆహార భద్రతా ప్రమాణాలు పాటించాల్సిందేనని.. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ హెచ్చరించారు. ఆదివారం కలెక్టర్ లక్ష్మీశ విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్లాట్‌ఫాంలతో పాటు తాగునీటి పాయింట్లు, మరుగుదొడ్ల పరిసరాలను పరిశీలించారు. ఏ సమయంలోనైనా అపరిశుభ్రత అనే మాట వినిపించకూడదని.. ప్రయాణికుల ఆహార భద్రతకు భరోసాకల్పించేలా పరిశుభ్రతా చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో పక్కా ప్రణాళికలతో నిరంతర పర్యవేక్షణతో ప్రయాణికులు సంతృప్తి చెందేలా సౌకర్యాలతో సేవలందించాలన్నారు. ప్రాంగణంలోని దుకాణాలు, స్టాళ్లు తప్పనిసరిగా ధరల పట్టికలను ప్రదర్శించాలని ఆదేశించారు. ప్రయాణికులకు చాలా సులభంగా అర్థమయ్యేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పాత డస్ట్ బిన్ల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని.. ఈగలు, దోమలు లేకుండా యాంటీ లార్వాల్ చర్యలు, పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు, సిబ్బంది నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి అని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు.

# ప్రతి ఇంటికీ హైజీన్ కిట్లు..

- ప్రత్యేక కరపత్రాలతో డయేరియాపై అవగాహన కల్పిస్తున్నాం
- క్షేత్రస్థాయిలోనే ప్రత్యేక అధికారుల నేతృత్వంలో బృందాలు
- ట్రాకింగ్, ట్రీట్‌మెంట్ విషయంలో అప్రమత్తంగా ఉన్నాం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ సెప్టెంబర్ 14, అనంత జనశక్తి న్యూస్**



రాజరాజేశ్వరి పేటలో డయేరియాను కట్టడి చేసే చర్యల్లో భాగంగా పటిష్ట ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే ఇంటింటికీ మినరల్ వాటర్ సరఫరా చేస్తుండగా, ప్రతి ఇంటికీ హైజీన్ కిట్లు అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. 11 వార్డు సచివాలయాలు, పరిసర ప్రాంతాల్లో ప్రజలకు సబ్బులు, హ్యాండ్ వాష్, ఫినాయిల్‌తో పాటు పది చొప్పున ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక కరపత్రాలతో డయేరియాపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. వైద్య శిబిరంలో, ఆసుపత్రిలోనూ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నటు తెలిపారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. అయితే జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అధికారులు, సిబ్బంది చేస్తున్న సూచనలను ప్రజలు తప్పకుండా పాటించాలన్నారు. ఎవరికైనా రోగ లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా అధికారులు, సిబ్బంది సహాయంతో వెంటనే చికిత్స తీసుకోవాలని సూచించారు. కేసుల ట్రాకింగ్, ట్రీట్మెంట్ విషయంలో ప్రత్యేక ప్రణాళికతో వ్యవహరిస్తున్నామని తెలిపారు. విజయవాడ అర్బన్ పరిధిలోనూ ఎక్కడా డయేరియా వ్యాప్తి చెందకుండా ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఏ సహాయం కావాలన్నా, సమాచారం కావాలన్నా కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్ (91549 70454) నంబరుకు కాల్ చేయవచ్చని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

# మీ అందరి సహకారం మరువలేనిది

**పుట్టపర్తి రూరల్: సెప్టెంబర్ 14**

**అనంత జన శక్తి న్యూస్:**




జిల్లా పోలీస్ అధికారులు సిబ్బంది , ప్రజలు ,మీడియా ప్రతినిధులు అందరి సహకారం మరువలేనిదని , అందరికీ కృతజ్ఞతలని మీ అందరి సహకారం మరవరానిదని ఎస్పీ వి.రత్న అన్నారు. శ్రీ సత్య సాయి జిల్లాలో 15, నెలలు పాటు విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న జిల్లా ఎస్పీ వి.రత్న జిల్లా పోలీస్ శాఖ ఆదివారం సన్మాన కార్యక్రమం నిర్వహించడంతోపాటు , ఘనంగా ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. నూతన జిల్లా ఎస్పీ శ్రీ ఎస్ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ, జిల్లాలో శాంతి భద్రతలు ,నేరాల నియంత్రణ సిబ్బంది యొక్క సంక్షేమం కోసం బాగా పని చేశారని, తనవంతు కూడా జిల్లా పోలీస్ శాఖ సంక్షేమ అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు.

అనంతరం బదిలీపై వెళుతున్న ఎస్పీ వి.రత్న మాట్లాడుతూ

గత 15 నెలల కాలంలో చేపట్టిన ప్రతి కార్యక్రమానికి పోలీస్ అధికారులు, సిబ్బంది సహకారం మరువలేమన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ నేరాలు నియంత్రణ పిల్లలపై నేరాల అరికట్టడం ,బందోబస్తు నిర్వహణ మహిళల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. నూతన ఎస్పీ కి కూడా ఇదే సహకారం అందించాలని పోలీసు అధికారులకు సిబ్బందికి సూచించారు. జిల్లాలోని జిల్లాలో ఉన్న పలువురు డిఎస్పీలు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎన్నో సమస్యలు ఎదురైనప్పటికీ జిల్లా ఎస్పీగా మాకు అందించిన సహకారం ఎప్పటికీ మరువలేమని ఈ సందర్భంగా తెలియజేశారు

అనంతరం ఎస్పీ వి రత్న ని నూతన జిల్లా ఎస్పీ శ్రీ ఎస్ సతీష్ కుమార్ శాలువాతో సత్కరించి మెమొంటోలను అందజేశారు.

అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులు సిబ్బంది ఎస్పీ ని ఓపెన్ టాప్ జీప్ పై పూల వర్షం కురిపిస్తూ తాళ్లతో లాగి అభిమానాన్ని చాటుకున్నారు.

ఈ కార్యక్రమంలో డీఎస్పీలు విజయకుమార్, నరసింగప్ప,

శివ నారాయణస్వామి, హేమంత్ కుమార్ ,ఆదినారాయణ , ఏఆర్డిఎస్పి శ్రీనివాసులు , ఏవో సుజాత, సూపర్డెంట్లు సరస్వతి మల్లికార్జున ఎస్పీ సిసి చిరంజీవి అర్ ఐ లు వలి ,మహేష్,

సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సోమవారం | అనంతపురం
15.09.2025
అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం



# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి

- వేదపండితుల ఆశీర్వాదాలు, స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరణ
- తిరుపతిలో అంతర్జాతీయ మహిళా సదస్సులో పాల్గొన్న పల్లె సింధూర రెడ్డి
- ఆ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై ఉండాలని ... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంపూర్ణ ఆరోగ్యంతో ఎల్లప్పుడూ ఉండాలని,ఏపి ప్రజల భవిష్యత్ కోసం చంద్రబాబు మరో 20 ఏళ్లు ముఖ్యమంత్రిగా సేవలు అందించాలని కోరుకున్నా.. తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి



**తిరుమల సెప్టెంబర్ 14, అనంత జనశక్తి న్యూస్**

తిరుపతి పర్యటనలో భాగంగా పుట్టపర్తి ఎంఎల్ఏ పల్లె సింధూర రెడ్డి తిరుమల క్షేత్రానికి వెళ్లారు.ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో లోక్ సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా, ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ శ్రీ అయ్యన్న పాత్రుడు, శ్రీమతి పురందరేశ్వరి , రఘురామ కృష్ణం రాజు తదితరులతో కలసి ప్రత్యేకంగా స్వామి వారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం వేదపండితులు ఆశీర్వచనాలు అందజేశారు. అలాగే స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలపై వెంకన్న స్వామి వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆ ఎమ్మెల్యే పల్లె సింధూర ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి లో అగ్రగామిగా నిలవాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆ భగవంతున్ని కోరుకున్నారు.అనంతరం తిరుపతి శివారులోని రాహుల్ కన్వెన్షన్ లో రెండు రోజులపాటు జరగనున్న మొదటి నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ పార్లమెంటరీ &లెజిస్టేటివ్ కమిటీస్ ఆన్ ఎన్పవర్మెంట్ ఆఫ్ ఉమెన్ (తొలి సాధికారత సదస్సు ) కాన్ఫరెన్స్ లో పాల్గొన్న పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,ఇతర ఎమ్మెల్యేలు..తిరుపతిలో జాతీయ మహిళా సాధికారత సదస్సులో పాల్గొన్న పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి తోపాటు సత్యసాయి ,అనంతపురం ఉమ్మడి జిల్లాల మహిళా మంత్రి సవితా, ఎమ్మెల్యేలు పరిటాల సునీతమ్మ బండారు శ్రావణి, కేరళ, ఢిల్లీ, రాష్ట్రాలకు సంబంధించిన శాసనసభ సభ్యురాలు, తిరుపతి శివారులోని రాహుల్ కన్వెన్షన్ లో రెండు రోజులపాటు జరగనున్న మొదటి నేషనల్ కాన్ఫరెన్స్ అఫ్ పార్లమెంటరీ & లెజిస్లేటివ్ కమిటీస్ ఆన్ ఎన్పవర్మెంట్ ఆఫ్ విమెన్ (తొలి జాతీయ మహిళా సాధికారత సదస్సు) ఆదివారం ప్రారంభమైంది. ఇందులో లోక్ సభ స్పీకర్ ఓంబిర్లా గారు, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ సింగ్, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, శాసనసభ వ్యవహారాల మరియు వాణిజ్య పన్నుల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ , కేరళ ఢిల్లీ రాష్ట్రాలకు సంబంధించిన శాసనసభ సభ్యురాలు ముఖ్య నాయకులు, పార్లమెంటరీ కమిటీ (మహిళా సాధికారత) చైర్ పర్సన్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి తోపాటు మంత్రి సవితా ,జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు పరిటాల సునీత,బండారు శ్రావణితదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేశం నలుమూలల నుంచి మహిళా ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు జాతీయస్థాయి ముఖ్య సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తాం



- గ్రంథాలయ నూతన కమిటి అధ్యక్షుడు చింతపులుసు పెద్దన్న

**ధర్మవరం, సెప్టెంబరు 14 అనంత జనశక్తి న్యూస్...**

గ్రంథాలయ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని గ్రంథాలయ నూతన కమిటి అద్యక్షుడు చింతపులుసు పెద్దన్న పేర్కొన్నారు. ఆదివారం ధర్మవరం శాఖ గ్రంథాలయ అభివృద్ధి నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎంపికచేశారు. ఈ ఎంపిక ఉమ్మడిజిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమ ఆదేశాల మేరకు ఎంపికచేశామన్నారు. గ్రంథాలయ నూతన కమిటిఇ అధ్యక్షుడిగా చింతపులుసు పెద్దన్న, ఉపాధ్యక్షుడిగా మేడారవి, ప్రధానకార్యదర్శి గాగోపాల్ నాయక్ (ఎంఈఓ), సహాయకార్యదర్శిగా సుమన్( బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం), కమిటి సభ్యులుగా బండపల్లిరంగనాథ్, సుకుమార్, నాగరాజు, తిరుపాల్, ప్రదీప్,
శ్రీనివాసరెడ్డి సురేంద్ర, ముకుంద, భరత్లను ఎం పిక చేశారు. అనంత రంగాడిచర్ల హరి సర్వోత్తమ 143 వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా కమిటిఅధ్యక్ష, ఉపాధ్యక్షులనుసన్మానించారు. ఈకార్యక్రమంలోగ్రంథాలయ అంజలిసౌబాగ్యవతి,సిబ్బంది రాము, రమణనాయక్, పాఠకులు అదికారినిపాల్గొన్నారు.

# లేపాక్షి ఆలయాన్ని సందర్శించిన కర్ణాటక హైకోర్టు జడ్జి

**లేపాక్షి ,సెప్టెంబర్ 14,అనంత జనశక్తి న్యూస్ :**

ప్రముఖ పర్యాటక కేంద్రమైన శ్రీ దుర్గా వీరభద్ర స్వామి దేవాలయాన్ని ఆదివారం కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ దినేష్ కుమార్ సింగ్ ఆలయాన్ని సందర్శించారు .వీరికి ఆలయ మర్యాదలతో అర్చకులు శ్రీనివాసులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు .అనంతరం ఆలయంలోని శాసనాలు ,ఏడు శ్రీరస్తుల నాగేంద్రుడు, అసంపూర్తి కళ్యాణమండపం, లతా మండపం, సీతాదేవి పాదం, పెయింటింగ్స్ ,గాలిలో వేలాడే స్తంభం తదితర ఆలయ చరిత్రను గైడ్ తెలియజేశారు. అనంతరం దుర్గా వీరభద్ర స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈయన వెంట తహసిల్దార్ సౌజన్య లక్ష్మి, దేవాదాయశాఖ నిర్వహణాధికా నరసింహమూర్తి పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



# కొడవాండ్లపల్లిలో జెసిపిఆర్ విందు



**యల్లనూరు, సెప్టెంబర్ 14, అనంత జనశక్తి న్యూస్;**

యల్లనూరు మండలంలోని కొడవాండ్లపల్లి గ్రామంలో వెలసిన అమ్మవారికి ఆదివారం తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి మొక్కును తీర్చుకొని విందును ఏర్పాటు చేశారు. ఈ విందు కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుండి తెలుగుదేశం పార్టీ నేతలు, జెసి ప్రభాకర్ రెడ్డి అనుచర వర్గం హాజరయ్యారు. మొదట అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ముక్కును తీర్చుకున్నారు. అలాగే చింతకాయ మంద గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు కేశవరెడ్డి ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితి పై జేసీ ప్రభాకర్ రెడ్డి ఆరాతీశారు. చింతకాయమంద గ్రామం నుండి తిరుగు ప్రయాణంలో తిమ్మంపల్లి గ్రామంలో జేసీ ప్రభాకర్ రెడ్డి పూజలను నిర్వహించారు. రోడ్డు పక్కనే ఉన్న ఆంజనేయస్వామి విగ్రహానికి పూలమాలవేసి కొబ్బరి కాయ కొట్టారు. అలాగే ఇటీవల కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లి గుడి తలుపులు మూసివేసి ఉండడంతో ఆరుబయటే పూజలు నిర్వహించి అక్కడి నుండి కొడవాండ్లపల్లి గ్రామానికి వెళ్లి విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎటువంటి సంఘటనలు జరగకుండా సిఐ సత్తిబాబు, ఎస్ఐ రామాంజనేయరెడ్డి తమ సిబ్బందితో ప్రత్యేక టీములుగా బందోబస్తును నిర్వహించారు.



# పదవులను బాధ్యతగా భావించాలి



- మంత్రి నారాయణ
- నామినేటెడ్ పదవులు పొందిన వారికి మంత్రి సూచన
- మంత్రి నారాయణకు ఘనంగా సత్కరించిన టీడీపీ నాయకులు
- మీ సహకారంతోనే పదవి, థాంక్యూ మంత్రి : ఏపీ స్టేట్ వేర్ హోసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కపిర శ్రీనివాసులు, బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఉచ్చి భువనేశ్వర్ ప్రసాద్
- పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరికి సముచిత స్థానం ఉంటుందన్న మంత్రి నారాయణ

**నెల్లూరు సెప్టెంబర్ 14,అనంత జనశక్తి న్యూస్**

ఇటీవల నెల్లూరులో నామినేటెడ్ పదవులు పొందిన వారికి రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ శుభాకాంక్షలు తెలిపారు. నెల్లూరు మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో నామినేటెడ్ పదవులు దక్కించుకున్న కొందరు మంత్రిని కలిసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. పదవులను బాధ్యతగా భావించి ప్రజల కోసం నాయకులు పనిచేయాలని వారికి మంత్రి సూచించారు. పోరాటం, కష్టం, త్యాగం, పనితీరు, విధేయత, క్రమశిక్షణ ఆధారంగా పదవులు ఇచ్చామని వెల్లడించారు.. సమర్థత చాటిన బూత్ స్థాయి కార్యకర్తలకు రాష్ట్ర స్థాయి పదవులు ఇచ్చామన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు నాయకుడికి సముచిత స్థానం ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో పదవులు దక్కించుకున్న కప్పిర శ్రీనివాసులు, ఉచ్చి భువనేశ్వర ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు మంత్రి నారాయణకు పూల బొకేలతో, శాలవలతో ఘనంగా సత్కరించి.. కృతజ్ఞతలు తెలిపారు.. మీరు మాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడతామని వారు మంత్రికి హామీ ఇచ్చారు.. సిటీ డివిజన్ పార్టీ కార్యకర్తలతో మంత్రి నారాయణ సమీక్ష సమావేశం నిర్వహించి.. కార్యకర్తలకు దిశ నిర్దేశం చేసారు.. ప్రజలకు ఎల్లప్పుడూ కార్యకర్తలు అందుబాటులో ఉండాలని మంత్రి నారాయణ సమీక్షలో పేర్కొన్నారు. అనంతరం టిడిపి సీనియర్ నాయకుడు వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డిని నూతనంగా నామినేటెడ్ పదవులు పొందిన పలువురు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ సివిల్ సివిల్ సప్లై డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, నూడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ సీనియర్ నేత విజయ భాస్కర్ రెడ్డి, నగర అధ్యక్షుడు మామిడాల మధు ,మాజీ జడ్పీటీసీ విజేత రెడ్డి, టీడీపీ ముఖ్య నేతలు తదితరులు పాల్గొన్నారు.



# మహిళా సాధికారత కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం



**ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ**

**తిరుపతి సెప్టెంబర్ 14, అనంత జనశక్తి న్యూస్**

భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ ,ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సహాయ సహకారాలతో తిరుపతిలో 2 రోజుల పాటు జరుగుచున్న మహిళా సాధికారత పై పార్లమెంటరీ మరియు శాసనసభ కమిటీల సమావేశం జరిగింది. మొదటి రోజు జరిగిన సమావేశంలో లోకసభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా , రాజ్యసభ డిప్యూటీ చైర్ పర్సన్ హరివాన్ష్ నారాయణ్ సింగ్ , ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ ,ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ శ్రీ అయ్యన్న పాత్రుడు , మహిళా సాధికారత కమిటీ పార్లమెంట్ చైర్మన్ శ్రీమతి పురందరేశ్వరి ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు , మంత్రులు పయ్యావుల కేశవ్ ,అనగాని సత్యప్రసాద్ ,పార్లమెంటరీ మరియు శాసనసభ కమిటీల సభ్యులతో కలసి శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పాల్గొన్నారు.

# హరిహరన్ ను ఆశీర్వదించిన జడ్పీటీసీ వి. ఉమేష్



**అగళి సెప్టెంబరు 14,అనంత జనశక్తి న్యూస్:**

అగళి మండల కేంద్రం నందు ఉన్న వాసవి మహల్ లో కోడిపల్లి పంచాయతీ దాసేగౌడనహోల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు బసవరాజు ఆహ్వానం మేరకు మండల జడ్పీటీసీ వి.ఉమేష్ నామకరణం కార్యక్రమములో పాల్గొని బసవరాజు కుమారుడు హరిహరన్ ను ఆశీర్వదించారు. కార్యక్రమములో తెదేపా నాయకులు కోడిపల్లి రమేష్, సునీల్ రంగ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మల్లికార్జున, ఎల్ ఐ సి కుమార్, డాబా రంగనాథ్, మరియు తెదేపా నాయకులు పాల్గొన్నారు. వీరికి శాలువ కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కృషి...




**ఏపీయూడబ్ల్యూజే ధర్మవరం డివిజన్ నాయకులు**

**ముదిగుబ్బ సెప్టెంబర్ 14 అనంత జనశక్తి న్యూస్..**

ముదిగుబ్బ మండల కేంద్రంలోని ఆర్డిటి ఫీల్డ్ కార్యాలయంలో ఆదివారం ఏపీయూడబ్ల్యూజే ధర్మవరం డివిజన్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి స్టేట్ కౌన్సిల్ మెంబర్ జీవి నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు జయానందన్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా కోశాధికారి రాంప్రసాద్, జిల్లా ఎలక్ట్రానిక్ ఉపాధ్యక్షులు పీఎం ప్రసాద్, జిల్లా ఎలక్ట్రానిక్ కార్యవర్గ సభ్యులు పామాల నాగేంద్ర,ధర్మవరం డివిజన్ అధ్యక్షులు జానపాటిమోహన్, ప్రధాన కార్యదర్శి జాంపుల అజయ్ చౌదరి, ఉపాధ్యక్షులు తాడిమర్రి వీరనారప్ప,గోల్డ్ ప్రసాద్, సహాయ కార్యదర్శులు కుతుబుద్దీన్,ఆదినారాయణ, చింతరమణ, కార్యవర్గ సభ్యులు బత్తలపల్లి శ్రీనివాసులు, దొడ్డప్ప,,ముదిగుబ్బ మండల అధ్యక్షులు వెంకటనాయుడు, ప్రధాన కార్యదర్శి రఘు, గౌరవాధ్యక్షులు సూర్యనారాయణ పాల్గొన్నారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సంక్షేమానికి అందరు సమిష్టిగా కృషి చేయాలని డివిజన్ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పూర్తిస్థాయిలో జర్నలిస్టుల పిల్లలందరికీ ఉచిత విద్య, మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్బుల ఏర్పాటు చేయాలని తీర్మానించారు. జర్నలిస్టు సోదరులకు ఎక్కడ ఏ చిన్న సమస్య వచ్చినా డివిజన్ సభ్యుల దృష్టికి తీసుకురావాలని మండలాల పాత్రికేయులకు విజ్ఞప్తి చేశారు.

# ఏపీయూడబ్ల్యూజే ముదిగుబ్బ మండల నూతన కమిటీ ఏర్పాటు




**ముదిగుబ్బ సెప్టెంబర్ 14 అనంత జనశక్తి న్యూస్..**

ఏపీయూడబ్ల్యూజే ముదిగుబ్బ మండల శాఖ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఎన్నిక జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, స్టేట్ కౌన్సిల్ మెంబర్ జీవి నారాయణ, ధర్మవరం డివిజన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జానపాటి మోహన్, జాంపుల అజయ్ చౌదరి, జిల్లా ఉపాధ్యక్షులు జయానందన్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా కోశాధికారి రాంప్రసాద్, జిల్లా ఎలక్ట్రానిక్ ఉపాధ్యక్షులు పీఎం ప్రసాద్, జిల్లా ఎలక్ట్రానిక్ కార్యవర్గ సభ్యులు పామాల నాగేంద్ర,ధర్మవరం డివిజన్ అధ్యక్షులు ఉపాధ్యక్షులు తాడిమర్రి వీరనారప్ప,గోల్డ్ ప్రసాద్, సహాయకార్యదర్శులు కుతుబుద్దీన్,ఆదినారాయణ, చింతరమణ, కార్యవర్గ సభ్యులు బత్తలపల్లి శ్రీనివాసులు, దొడ్డప్ప ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏపీయూడబ్ల్యూజే ముదిగుబ్బ మండల అధ్యక్షులుగా M.వెంకట నాయుడు(భూమి నాయుడు) గౌరవ అధ్యక్షులుగా సూర్యనారాయణ ఉపాధ్యక్షులుగా పూల రాజేష్ ప్రధాన కార్యదర్శిగా రఘు ట్రెజరర్ గా నరసింహారెడ్డి సహాయ కార్యదర్శులుగా సిద్దయ్య నరేష్ లను ఎన్నుకున్నారు. అంతకుమునుపు డివిజన్ ఉపాధ్యక్షులుగా ముదిగుబ్బ నుండి మల్లికార్జున ను, డివిజన్ కార్యవర్గ సభ్యునిగా మొహమ్మద్ అలీని ఎంపిక చేశారు.

# జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసిన భాస్కర్ నాయుడు



**పుట్టపర్తిరూరల్: సెప్టెంబర్ 14 అనంత జన శక్తి న్యూస్**

దేశంలోని రెండవ జిల్లాకు మీకు స్వాగతం అంటూ క్రిస్మస్ మొక్కను అందజేశారు. ఈ జిల్లాలో వాల్టా చట్టం ప్రకారం అనుమతులు లేకుండా ఏ చెట్టును నరకరాదని అలా అక్రమంగా చెట్లు నరికేతను అరికట్టమని కోరారు. ఈ విషయంపై సుదీర్ఘంగా చర్చిద్దామని వారు తెలియజేశారు. వ్యవసాయ కుటుంబం నుండి వచ్చిన వారు ప్రకృతి పై పూర్తి అవగాహన కలిగినట్లుగా భావించానని భాస్కర్ నాయుడు తెలియజేశారు .ఈ కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కల్చర్ అండ్ నేచర్ డెవలప్మెంట్ సంస్థ సభ్యులు జగదీశ్వర్ రెడ్డి సుధాకర్ పాల్గొన్నారు.

# నా జీవితం జానపద కళ రంగానికి అంకితం



**- సోమిశెట్టి సరళ.**

**ధర్మవరం రూరల్ సెప్టెంబర్ 14, అనంత జనశక్తి న్యూస్:**

శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన ప్రముఖ గాయని, గిన్నిస్ బుక్ హోల్డర్ సోమిశెట్టి సరళ కు విజయవాడలో జరిగిన అఖిలభారత పద్మశాలి సంఘం వార్షిక , జాతీయ మహాసభలో జానపదం, స్వాతంత్ర సమరవీరుల వెలికితీతలో జాతీయస్థాయిలో పరిశోధన ఆత్మకు రచయితగా, సరళ సమాజానికి చేస్తున్న కృషిని గుర్తిస్తూ వారిని సంఘ అధ్యక్షులు నాగేశ్వరరావు, మహిళా నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ..... తన జీవితాన్ని జానపద కళా రంగానికి అంకితం చేస్తూ జానపద అభివృద్ధికి భవిష్యత్తులో మరింత కృషి చేస్తానని తెలిపారు. ఇక్కడకు విచ్చేసిన వివిధ రాష్ట్రాలకు చెందిన పద్మశాలి సంఘ ప్రతినిధులు సరళ పాడిన జానపద గీతాలు సమూహితులై హర్షమును వ్యక్తం చేశారు.

# ఘనంగా గ్రీన్ భారత్ అధ్యక్షులు కామరాజు జన్మదిన వేడుకలు




**అగళి సెప్టెంబరు 14,అనంత జనశక్తి న్యూస్:**

మడకశిర గ్రీన్ భారత ఫౌండేషన్ అధ్యక్షుడు సివిల్ ఇంజనీయర్ కోడిపల్లి కామరాజు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్నేహితుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఆయనకు శాలువ కప్పి పూలమాలతో సన్మానించారు. మిత్రులు, స్నేహితులు సోషియల్ మీడియా వాట్సన్ అప్, ఫేస్బుక్ ద్వారా కూడా జన్మదిన శుభాకాంక్షల తెలిపారు. అలాగే పుట్టిన రోజు సందర్భంగా బెంగళూరులో కూడా ప్రశాంత్ చక్రవర్తి అనాథ ఆశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సిపి సీనియర్ నాయకులు హలకూరు కాంతరాజు, సర్పంచ్ నటరాజు మిత్రులు, స్నేహితులు అధిక సంఖ్యలో పాల్గొని ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని నిండు నూరేళ్ళు సుఖ సంతోషాలతో ఆయురోగ్యాలతో జీవించాలని ఈ సందర్భంగా జన్మదిన శుభాకాంక్షల తెలిపారు.

# రాష్ట్ర ఏపీఐఐసి డైరెక్టరు రొళ్లకొండ రామకృష్ణకు అగళి మండల తెదేపా నాయకులు శుభాకాంక్షలు

**అగళి సెప్టెంబరు 14,అనంత జనశక్తి న్యూస్:**



అంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏపీఐఐసి డైరెక్టరుగా మడకశిర శాసనసభ్యులు యం.యస్ రాజు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు శ్రీ గుండుమల తిప్పేస్వామి శుభ ఆశీస్సులతో ఎన్నికయిన సందర్భంగా రొళ్లకొండ రామకృష్ణకి అగళి మండల తెదేపా నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. మడకశిర నియోజకవర్గం రొళ్ల మండల తెలుగుదేశం పార్టీ ప్రచార కార్యదర్శిగా నియోజకవర్గం కోర్డినేటర్ గా. శ్రీ సత్యసాయి జిల్లా తెదేపా మీడియా కోర్డినేటర్ గా పార్టీలో అహర్నిశలు కష్టపడి నియోజకవర్గంలో పార్టీ ఆదేశించినటువంటి ప్రతి బాధ్యతను సక్రమంగా నిర్వర్తించినందుకు గాను రాష్ట్ర ఏపీఐఐసి డైరెక్టర్గా నియమించబడినందుకు అగళి మండల తెలుగుదేశం పార్టీ తరపున శుభాకాంక్షలు ధన్యవాదాలు తెలియజేశారు.





# చేనేతల అభివృద్ధికి ఇద్దరు మంత్రుల సంయుక్త కృషి

- మంత్రుల ప్రోత్సాహం – ధర్మవరం చేనేతలకు కాంచీపురం స్టడీ టూర్ గొప్ప అనుభవం
- దిగ్విజయంగా ముగిసిన ధర్మవరం చేనేతల కాంచీపురం స్టడీ టూర్ యాత్ర
- మంత్రి సత్యకుమార్ యాదవ్, మంత్రి సవితమ్మ మార్గదర్శకత్వంలో విజయవంతమైన ధర్మవరం చేనేతల కాంచీపురం స్టడీ టూర్.
- బస్సు సహా అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసిన మంత్రి సత్యకుమార్ యాదవ్

**ధర్మవరం రూరల్ సెప్టెంబర్ 14, అనంత జనశక్తి న్యూస్:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలపై, చేనేత & జౌళి శాఖ మంత్రి సవితమ్మ సూచనల మేరకు ధర్మవరం చేనేతలకు ఒక చారిత్రాత్మకమైన అవగాహన యాత్ర విజయవంతంగా నిర్వహించబడింది. దేశంలోనే అతి పెద్దదిగా ప్రతిష్టాత్మకంగా అమలు కానున్న ధర్మవరం మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ అభివృద్ధి దిశగా ఈ కాంచీపురం హ్యాండ్లూమ్ క్లస్టర్ స్టడీ టూర్ ఎంతో ప్రయోజనకరంగా నిలిచింది. ఈ అధ్యయన యాత్రలో ధర్మవరం నుండి వెళ్ళిన చేనేతకారులు, కాంచీపురం హ్యాండ్లూమ్ క్లస్టర్లో జరుగుతున్న ప్రోడక్ట్ డెవలప్మెంట్ సిల్క్ అప్గ్రేడేషన్ పద్ధతులు, ఆధునిక పరికరాల వినియోగం, కొత్త డిజైన్ల రూపకల్పన, మరియు మార్కెటింగ్ వ్యూహాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆధునిక మార్పులు, సాంకేతిక అభివృద్ధి, మార్కెట్ ధోరణులను తెలుసుకోవడం ద్వారా తమ నైపుణ్యాన్ని మరింత అభివృద్ధి చేసుకోవడానికి చేనేతలకు ఈ టూర్ తోడ్పడనుంది. అలాగే, ఈ సందర్భంగా చేనేతలు కాంచీపురంలోని ప్రసిద్ధి పొందిన ఆలయాలను సందర్శించి, తమ ఐక్యత, క్రమశిక్షణను ప్రతిఫలింపజేసి ధర్మవరం చేనేత కార్మికులు దేశానికి ఆదర్శంగా నిలిచారు.

ఈ విజయవంతమైన యాత్ర అనంతరం, మంత్రి సత్యకుమార్ యాదవ్ త్వరలోనే చేనేతలతో స్వయంగా సమావేశమై, వారి అభిప్రాయాలు, సూచనలు సేకరించి, ధర్మవరం మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ధర్మవరం చేనేతలకు చరిత్రాత్మక ప్రాధాన్యం ఉన్న ఈ అధ్యయన యాత్ర, భవిష్యత్తులో వారి జీవిత ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా ఒక కీలక అడుగుగా నిలిచింది. ఈ కార్యక్రమం లో చేనేత & జౌళి శాఖ కమీషనర్ రేఖరాని, గుంటూరు జిల్లా ఏ.డీ వనజ, శ్రీ సత్య సాయి జిల్లా ఏ.డీ రామకృష్ణ, ఏ.డీ.ఓ లు సుబ్బనాయుడు, శీనా నాయక్, రాజేశ్వరి, బీజేపీ పార్టీ చేనేత నాయకులు గిర్రాజు నాగేష్, నేషనల్ అవార్డు గ్రహీత డిజైనర్ నాగరాజుతో పాటూ 30 మంది ధర్మవరం చేనేత కార్మికులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం రాక... అభివృద్ధికి చేయూత

- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్
- రూ. 10 లక్షలతో 37వ డివిజన్ 2వ వీధి సిసి రోడ్డు నిర్మాణం పనులకు శ్రీకారం

**రాజమహేంద్రవరం సెప్టెంబర్ 14, అనంత జనశక్తి న్యూస్**



గత వైకాపా పాలనలో అన్ని విధాలుగా సర్వనాశనమైన రాష్ట్రం కూటమి ప్రభుత్వం రాకతో అభివృద్ధి పరంగా పరుగులు తీస్తోందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) పేర్కొన్నారు. స్థానిక 37వ డివిజన్ 2వ వీధిలో సిసి రోడ్డు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ గత పాలకుల హయాంలో నగరంలో ఎక్కడా కూడా సరైన విధానంలో అభివృద్ధి పనులు జరగలేదన్నారు. చేసిన పనులు కూడా ఏదో మొక్కుబడిగా ప్రధాన రహదారుల్లో మాత్రమే చేసి డివైడర్లు ఏర్పాటు చేసి రోడ్లను ఇరుకుమయం చేయడం జరిగిందని విమర్శించారు. తాను శాసన సభ్యుడిగా ఎన్నికై కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం జరుగుతోందన్నారు. రాజమహేంద్రవరం సిటీ పరిధిలోని 42 డివిజన్లలో శిథిలమైన ప్రధాన రహదారులతో పాటు వాటికి ఆనుకుని ఉన్న రోడ్లను సీసీ రోడ్లుగా మార్చడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళన చేయడం జరుగుతోందన్నారు. ఈ విధంగా నగరంలో రూ. 250 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టగా కొన్నింటికీ ప్రారంభోత్సవాలు చేయగా, మరికొన్ని పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం వర్షా లు ఉన్న నేపథ్యంలో కొన్ని పనులకు అతరాయం జరుగుతోందన్నారు. వర్షా లు పూర్తిగా తగ్గిన తరువాత నగరంలోని ప్రతి రహదారిలో ఉన్న ప్రతి చిన్న గుంతను పూడ్చి గుంతలు లేని నగరంగా తీర్చిదిద్దుతామని, ఈ మేరకు ఇటీవల నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగంతో సమీక్ష సమావేశం నిర్వహించగా ఆ మేరకు ఇంజనీరింగ్ విభాగం ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. త్వరలోనే గుంతలు లేని నగరాన్ని మనమంతా చూస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళ హత్యకేసు నింధితులు అరెస్టు



**ధర్మవరం,సెప్టెంబరు 14 అనంత జనశక్తి న్యూస్.....**

భార్యను చంపేసి వంకలో పూడ్చేసిన కేసులో భర్తతోపాటు మరో ఇద్దరు నింధితులను అరెస్టు చేసినట్టు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. టూటౌన్ సీఐరెడ్డప్ప తెలిపిన వివరాల మేరకు... సీకేపల్లి మండలం మేడాపురం గ్రామానికి చెందిన సాకే వెంకటరాముడు ధర్మవరం పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో తన భార్య సరస్వతితో కలిసి నివాసం ఉండేవాడు. అయితే సాకే వెంకటరాముడు తన భార్య సరస్వతి అల్లుడితో అక్రమ సంబంధం పెట్టుకుందని, తన ప్రవర్తన మార్చుకొమ్మని ఎంత చెప్పిన వినలేదు. దీంతో సాకే వెంకటరాముడు తన అక్క చిట్టెమ్మ, ఆమె భర్త రామంజి, మరో అక్క వెంకటలక్ష్మి, వదిన రామాంజనమ్మల సహాయంతో సరస్వతిని చంపేసి నరసింహులు, విజయ్ ల సహాయంతో పట్టణ సమీపంలోని గొల్లపల్లి వంకలో పూడ్చివేశారు. అయితే సరస్వతి మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామన్నారు. దర్యాప్తులో భాగంగా సాకే సరస్వతిని భర్త సాకే వెంకటరాముడు చంపినట్టు నిర్ధారణ కావడంతో సాకేవెం కటరాముడు, నరసింహులు, విజయ్ లను ఆదివారం మేడాపురం క్రాస్ వద్ద అరెస్టు చేసి వారి వద్ద నుంచి ఒక ఆటో, ఒక మోటారు సైకిల్, సెల్ ఫోన్ ను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అనంతరం నింధితులను రిమాండ్ కు తరలించినట్టు సీఐ తెలిపారు.

# రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులు రానున్నాయ్

- గ్లోబల్ సమ్మిట్లో ప్రపంచ దేశాలను ఆకట్టుకున్నాం
- అవసమైనంత మేరకే యూరియాను వినియోగించాలి
- పైడితల్లి అమ్మవారి పండగను ఘనంగా నిర్వహిస్తాం
- రాష్ట్ర ఎంఎస్ఎంఈ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- విజయనగరం,

**సెప్టెంబరు 14, అనంత జనశక్తి ప్రతినిధి**



గ్లోబల్ సమ్మిట్లో ప్రపంచ దేశాలను ఆకట్టుకున్నామని, త్వరలో రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులు వస్తాయని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక బ్రాండ్ అని, ఆయన్ను చూసే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమవుతున్నారని కొనియాడారు. విజయనగరంలోని తమ క్యాంపు కార్యాలయంలో మంత్రి శ్రీనివాస్ ఆదివారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఇటీవల జరిగిన దావోస్ సదస్సులో ప్రపంచ దేశాలను, పెట్టుబడుదారులను ఆకర్షించడంలో సఫలీకృతం అయ్యామని మంత్రి అన్నారు. జర్మనీలోని ఫ్రాంక్ఫర్డ్లో జరిగిన సదస్సులో కూడా సత్ఫలితాలు వచ్చాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, యువ నాయకులు నారా లోకేష్ సారథ్యంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో వ్యాపారవేత్తలు పెట్టుబడులు పెట్టేవిధంగా భరోసాను నింపిందని అన్నారు. నవంబరు 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే గ్లోబల్ సమ్మిట్ లో మరింతగా పెట్టుబడులను ఆకర్షించేందుకు కృషి జరుగుతోందని తెలిపారు. ఇప్పటికే సుమారు 11 లక్షల కోట్ల పెట్టుబడులు సిద్ధంగా ఉన్నాయని, ఇవన్నీ కార్యరూపం దాల్చి ఫలితాలను ఇవ్వడానికి కొంత సమయం పడుతుందని చెప్పారు. యువతకు ఉపాధి కల్పించేందుకు పెద్ద ఎత్తున ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. దీనిలో భాగంగానే గ్రామీణ ప్రాంత యువతను దృష్టిలో పెట్టుకొని ప్రతీ నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మొత్తం 175 ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేయడం ప్రభుత్వ లక్ష్యమని, వీటిలో ఇప్పటికే 50 పార్కులకు శంకుస్థాపన చేయడం జరిగిందని, త్వరలో మరికొన్నింటికి శంకుస్థాపన చేస్తామని తెలిపారు. 11పార్కుల్లో ప్లాట్ల కేటాయింపు కూడా జరుగుతోందని అన్నారు. రక్షణ రంగం, స్పేస్ టెక్నాలజీ, డ్రోన్స్ తదితర రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని వివరించారు.

మెరుగైన వైద్య సదుపాయాలను వీలైనంత త్వరగా ప్రజలకు అందించే లక్ష్యంతోనే వైద్య కళాశాలలను పిపిపి పద్ధతిలో నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి స్పష్టం చేశారు. భోగాపురం విమానాశ్రయం, పోర్టులు, జాతీయ రహదారులు, భారీ ప్రాజెక్టులను పిపిపి పద్ధతిలో నిర్మిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గత ప్రభుత్వ హాయాంలో వైద్య రంగం నిర్వీర్యం అయ్యిందని, మౌలిక సదుపాయాల కల్పన పడకేసిందని మంత్రి చెప్పారు. తమ పార్టీ హాయంలోనే గతంలో కూడా రాష్ట్రానికి అత్యధికంగా మెడికల్ సీట్లు వచ్చాయని చెప్పారు. ఆరోగ్య భీమా పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టనుందని, దీనివల్ల ప్రతీఒక్కరికీ ఆరోగ్య భరోసా కలుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతి విషయంలో తాము ముందునుంచీ ఒకే విధానంలో ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్ష పార్టీకి ఈ విషయంలో స్పష్టత లేదని, రోజుకో మాట చెబుతోందని అన్నారు. ఆటో, టాక్సీ డ్రైవర్లకు ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించడం శుభకరమని పేర్కొన్నారు. ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ను అమలు చేశామని, రాష్ట్ర ప్రజలంతా ఎంతో సంతోషంగా ఉన్నారని చెప్పారు. అనంతపురంలో జరిగిన భారీ సభే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. త్వరలో రాష్ట్రానికి 50వేల మెట్రిక్ టన్నుల యూరియా రానుందని మంత్రి చెప్పారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా అధికంగా యూరియాను వినియోగించడం మంచిది కాదని అన్నారు. కేన్సర్, కిడ్నీ సమస్యలు తదితర వ్యాధుల విజృంభనకు కొంతవరకు అధిక యూరియా కారణమై ఉండవచ్చునని అన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన మేరకు మాత్రమే యూరియాను వినియోగించాలని రైతులకు మంత్రి విజ్ఞప్తి చేశారు. ఉత్తరాంధ్ర కల్పవల్లి విజయనగరం పైడితల్లి అమ్మవారి పండుగను మునుపటి ఏడాదివలే ఈ ఏడాది కూడా భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి శ్రీనివాస్ తెలిపారు.

# చిత్రావతి వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన మాజీ మంత్రి

**- టీడీపీ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మహమ్మద్ రఫీ కుమారుడి వివాహానికి హాజరైన మాజీ మంత్రి పల్లె**

**పుట్టపర్తి సెప్టెంబర్ 14,అనంత జనశక్తి న్యూస్**



కూటం పార్టీల నాయకులు తో కలిసి మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి జరుగుతున్న పనులను

పుట్టపర్తి మున్సిపాలిటీలోని చిత్రావతి నది పరివాహక ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆదివారం పుట్టపర్తి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ మాజీ మంత్రి డాక్టర్ రఘునాథరెడ్డి పరిశీలించారు. చిత్రావతి నది పరివాహక ప్రాంతంలో జాయ్ లుక్కాస్ జ్యువెలరీ కంపెనీ ఆధ్వర్యంలో సిఎస్ఆర్ నిధులతో స్నానపు ఘాట్స్, పుడా చిల్డ్రన్ పార్క్ అభివృద్ధి పనులను స్థానిక కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు పరిశీలించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పనులపై అక్కడే ఉన్న సంబంధిత ఇంజనీర్లతో ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. చిత్రావతి నది పరివాహక ప్రాంతంలో ఎలాంటి చెత్తాచెదారం లేకుండా ఎంతో పరిశుభ్రంగా ఉంచాలని స్థానికులకు సూచించారు. అంతకుముందు పుట్టపర్తి టూరిజం గెస్ట్ హౌస్ సాయి ఆరామం లో టిడిపి మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మహమ్మద్ రఫీ మాజీ కౌన్సిలర్ షేక్ దిల్షాద్ గారి కుమారుడు షేక్ నౌషాద్ వివాహానికి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వరుడు షేక్ నౌషాద్ ను మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఆశీర్వదించారు. మాజీ మంత్రి తో పాటు టిడిపి సీనియర్ నాయకులు టిడిపి కన్వీనర్ బోయ రామాంజనేయులు ,సాలక్క శ్రీనివాసులు , గంగాధర్ నాయుడు , సామకోటి ఆది నారాయణ ,టీడీపీ యువ నాయకులు రామారావు, కౌన్సిలర్ లక్ష్మీపతి, సింగల్ విండో అధ్యక్షులు శ్రీరామ్ రెడ్డి , ముమ్మినేని వెంకట్ రాముడు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నిజాం ,మాజీ సింగల్ విండో అధ్యక్షులు ఓబులేసు , శుభచంద్ర , గంగాధర్ ,ఉమాపతి, సుధాకర్ , జయప్రకాష్, పుల్లప్ప సురేష్ చౌదరి, మురళి కృష్ణ ప్రసాద్, కూటమి పార్టీల నాయకులు అబ్దుల్లా ,లాయర్ హరికృష్ణ, సూర్యనారాయణ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు

# త్వరలో బీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డీఐలు: నిర్మలా సీతారామన్



**దిల్లీ:** త్వరలో బీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డీఐలను ప్రతిపాదించే బిల్లు (ను ప్రవేశపెట్టనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. బీమా రంగంలోకి మరిన్ని సంస్థలను తీసుకురావడంతో పాటు.. అధిక సంఖ్యలో ఉద్యోగాల సృష్టికి ఇది ఉపయోగపడుతుందన్నారు. ఈ ఎఫ్‌డీఐ ప్రతిపాదిత బిల్లును రాబోయే శీతాకాల సమావేశాల్లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉందన్నారు. ఇందులో భాగంగా బీమా చట్టం 1938లోని వివిధ నిబంధనలను సవరించాలని ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది. వాటిలో బీమా రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడు(ఎఫ్‌డీఐ)లను ప్రస్తుత 74 శాతం నుంచి 100 శాతానికి చేర్చడంతో పాటు పెయిడప్ క్యాపిటల్‌ను తగ్గించడం, కాంపొజిట్ లైసెన్స్ నిబంధన వంటివి ఈ బిల్లులో ఉన్నాయన్నారు. బీమా నియంత్రణ అభివృద్ధి చట్టం 1999లోనూ సవరణలు ప్రతిపాదించినట్లు తెలిపారు.

పాలసీదారుల ప్రయోజనాలను ప్రోత్సహించడం, వారి ఆర్థిక భద్రతను పెంచడం, బీమా మార్కెట్‌లోకి మరిన్ని భాగస్వామ్య సంస్థల ప్రవేశాన్ని సులభతరం చేయడం, ఆర్థిక వృద్ధి, ఉపాధి కల్పనకు ప్రతిపాదిత సవరణలు ఉపయోగపడతాయని నిర్మలా సీతారామన్ అన్నారు. మోదీ ప్రభుత్వం తాజాగా తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణలు (GST Reforms) భారత్‌లోని ప్రతి పౌరుడు సాధించిన విజయమని పేర్కొన్నారు. దీపావళి పండగకు ముందే జీఎస్టీ సంస్కరణలను ప్రారంభించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచన మేరకు ఈ సంస్కరణలను ప్రజలముందుకు తీసుకువచ్చి అనేక కుటుంబాలపై భారం తగ్గించామన్నారు. ప్రజల సాధికారత ద్వారానే భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందన్నారు.

# అమెరికా సిస్టమ్స్‌పై ఆధారపడటాన్ని భారత్ తగ్గించుకోవాలి: జీటీఆర్‌ఐ



భారత్ కచ్చితంగా దేశీయ క్లౌడ్ టెక్నాలజీ, ఆపరేటింగ్ సిస్టమ్స్‌ను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ హెచ్చరించింది. సొంతంగా తయారు చేస్తున్న సైబర్ సెక్యూరిటీ, డేటా ఆధారిత ఏఐ (AI) వంటి అంశాల్లో కూడా స్వయంసమృద్ధి సాధిస్తే.. అదే అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గిస్తుందని పేర్కొంది.

భారత్ (India) భద్రత, ఆర్థిక వ్యవస్థ.. అమెరికా సాఫ్ట్‌వేర్, క్లౌడ్, సోషల్ మీడియాపై తీవ్ర స్థాయిలో ఆధారపడటం ప్రస్తుతం భౌగోళిక రాజకీయ అస్థిరతల మధ్య సమస్యాత్మకమని జీటీఆర్‌ఐ (GTRI) నివేదిక వెల్లడించింది. అతిగా ఆధారపడటం వల్ల.. హఠాత్తుగా సేవలు లేదా డేటా నిలిపివేత ముప్పు ఎప్పుడూ పొంచి ఉంటుందని గుర్తు చేసింది.

"అమెరికా (USA) విధించిన 50 శాతం టారిఫ్‌ల వంటి షాక్‌లను భారత్ ఎదుర్కొంటోంది. కానీ, దీనిని లోతుగా పరిశీలిస్తే.. డిజిటల్ అవసరాల కోసం అమెరికా టెక్నాలజీ సంస్థలపై ఆధారపడటం వల్ల వచ్చే ముప్పే తీవ్రమైందిగా కనిపిస్తోంది. ఒక వేళ అమెరికా వాటిని నిలిపివేయాలని ఆదేశిస్తే మాత్రం డిజిటల్ పేమెంట్లు, ట్యాక్స్ ఫైలింగ్స్ తీవ్రంగా ప్రభావితం అవుతాయి" అని పేర్కొంది. భారత ఫోన్లు, కంప్యూటర్లు, రక్షణ పరికరాలు, ప్రభుత్వ అప్లికేషన్లు అత్యధికంగా అగ్రరాజ్య సిస్టమ్స్ ఆధారంగానే పని చేస్తున్నాయని వెల్లడించింది. భారత ప్రభుత్వం కచ్చితంగా 2030 నాటికి పూర్తిచేసేలా.. డిజిటల్ స్వరాజ్ మిషన్‌ను ప్రారంభించాల్సిన అవసరం ఉందిని తెలిపింది. నాటి కల్లా సొంత ఆపరేటింగ్ సిస్టమ్, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ, సోషల్ మీడియా వ్యవస్థలను సృష్టించుకోవాలని పేర్కొంది. చైనా, ఐరోపాలు ఇప్పటికే ఈ దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టాయని గుర్తు చేసింది. టెక్ సార్వభౌమత్వ సాధనలో భారత్ వెనకబడిపోతోందని తెలిపింది.భారత్ వద్ద ఉన్న అతి పెద్ద బలం ప్రజల డేటా అని.. దానిని వాణిజ్య చర్చల్లో పణంగా పెట్టకూడదని నివేదిక పేర్కొంది. భారత్‌లోని భారీగా ఉన్న వినియోగదారుల డేటా అమెరికాలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏఐ, దానిమీద వచ్చే ఆదాయాలకు ఇంధనంగా మారుతుందని చెప్పింది. ఇది చమురు, రేర్‌ఎర్త్ మెటిరియల్ వలే భారత్‌కు వ్యూహాత్మక ఆస్తిగా అభివర్ణించింది..

# నాణ్యతలో ఇన్ని ఉల్లంఘనలా...: బోయింగ్‌కు ఎఫ్ఏఏ మళ్లీ ఫైన్




ప్రముఖ వైమానిక రంగ దిగ్గజం బోయింగ్ కు అమెరికా నియంత్రణ సంస్థ ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ మరో సారి ఫైన్ విధించింది. భద్రతకు సంబంధించిన చాలా ఉల్లంఘనలను గుర్తించడంతో దాదాపు 3.1 మిలియన్ డాలర్లు (రూ.27.36 కోట్లు) చెల్లించాలని ఆదేశించింది. ఈ ఉల్లంఘనలు మొత్తం సెప్టెంబర్ 2023 నుంచి ఫిబ్రవరి 2024లోపు చోటు చేసుకున్నవి. అలాస్కా ఎయిర్‌లైన్స్ డోర్ ఊడిపోవడం సహా చాలా సంఘటనలున్నాయి.

వాషింగ్టన్‌లోని రెంటాన్ ఫ్యాక్టరీలో నిర్వహించిన దర్యాప్తులో క్వాలిటీ సిస్టమ్స్‌లో వందల ఉల్లంఘనలు గుర్తించినట్లు ఎఫ్ఏఏ ప్రకటనలో పేర్కొంది. ఇక కెన్సాస్‌లోని బోయింగ్ (Boeing) సబ్‌కాంట్రాక్ట్ సంస్థ స్పిరిట్ ఏరోసిస్టమ్స్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొందని చెప్పింది. రెండు విమానాలు ఎగిరేందుకు అయోగ్యమైనవిగా గుర్తించినట్లు పేర్కొంది. ఇక నాణ్యతలేని విమానానికి ధ్రువీకరణ వచ్చేట్లు సంతకం చేయాలని ఒత్తిడి చేసినట్లు గుర్తించారు. ఈ పెనాల్టీపై స్పందించేందుకు బోయింగ్‌కు 30 రోజుల గడువు ఉంది.

ఈ ఏడాది జూన్‌లో 'అమెరికా నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్' 17 నెలల పాటు నిర్వహించిన దర్యాప్తు నివేదికను విడుదల చేసింది. దీనిలో బోయింగ్ (Boeing) తయారీ, భద్రతా పర్యవేక్షణలో చాలా లోపాలు ఉన్నా.. ఎఫ్ఏఏ తనిఖీలు, ఆడిట్స్ ఏమాత్రం ప్రభావం చూపలేదని పేర్కొంది. ఫలితంగానే అలాస్కా ఎయిర్‌లైన్స్ ఘటన చోటు చేసుకొందని వెల్లడించింది. జనవరి 2024 ఘటన విచారకరమని బోయింగ్ ఓ ప్రకటనలో పేర్కొంది. తమ భద్రతా ప్రమాణాలను బలోపేతం చేసుకొంటామని పేర్కొంది. నాణ్యత, బాధ్యతలకు సంబంధించి చర్యలు చేపడతామని చెప్పింది.

# విమానాశ్రయాల్లో ఆపరేషన్ 'భాస్కర్'



కోచి విమానాశ్రయం తరహాలో సౌర విద్యుత్ ప్లాంట్లు

విమానాశ్రయాల్లో విద్యుత్ వినియోగాన్ని తగ్గించేందుకు దేశంలోని ప్రధాన నగరాల్లోని విమానాశ్రయాలు, అంతర్జాతీయ విమానాశ్రయాలు ఆపరేషన్ 'భాస్కర్' పేరుతో సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకుంటున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న విమానాశ్రయాల్లో 100% సౌర విద్యుత్‌ను వినియోగిస్తున్న తొలి అంతర్జాతీయ విమానాశ్రయంగా పేరొందిన కోచి విమానాశ్రయం తరహాలో మిగిలిన ఎయిర్‌పోర్ట్‌లలో సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచేందుకు ప్రత్యేకంగా ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నారు. దిల్లీ, హైదరాబాద్, బెంగళూరు, ముంబయి విమానాశ్రయాల్లో హరిత ఇంధనాన్ని వినియోగించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. వచ్చే అయిదేళ్లలో దేశంలోని 44 విమానాశ్రయాల్లో 15% సోలార్ విద్యుత్ ఉండేలా ప్రణాళిక రచించారు.

**విమానాశ్రయం, టర్మినల్ అంతా...**

కోచి అంతర్జాతీయ విమానాశ్రయం సంప్రదాయ విద్యుత్‌ను వినియోగించడం లేదు. పదేళ్ల క్రితం సౌర విద్యుత్ ప్లాంట్ల ద్వారా కొంత ఇంధనాన్ని అధికారులు ఉత్పత్తి చేశారు. ఏటా సామర్థ్యాన్ని పెంచుతూ ఈ ఏడాది ప్రథమార్థానికి పూర్తిగా సోలార్ పవర్‌తోనే విమానాశ్రయంలోని ప్రతి విభాగాన్ని నడిపిస్తున్నారు. ఇదే తరహాలో శంషాబాద్‌లోనూ లిఫ్టులు, ఎస్కలేటర్లు, సామగ్రిని తీసుకెళ్లే కన్వేయర్ బెల్టులు, విమానాశ్రయంలో రెస్టారెంట్లు, కార్యాలయాలు, ఆగమనాలునిష్క్రమణ ప్రాంతాల్లో అన్ని ఏసీలు, యంత్రాలు, పరికరాలు సౌర శక్తితోనే పనిచేస్తున్నాయి. భవిష్యత్తులో ప్రారంభమయ్యే రెండో టెర్మినల్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు.

**ఏ విమానాశ్రయంలో.. ఎలా అంటే**

శంషాబాద్ విమానాశ్రయ ప్రాంగణంలోని కార్యాలయాల్లోనూ సౌర విద్యుత్‌ను వినియోగించనున్నారు. హరిత ఇంధనాన్ని వినియోగిస్తున్న విమానాశ్రయాల్లో శంషాబాద్‌కు లెవల్ 5 స్థానం దక్కింది. భవిష్యత్‌లో ఇతర కార్యాలయాల్లో సౌర విద్యుత్‌నే వినియోగించనున్నారు

బెంగళూరు కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో 45.9 మెగావాట్ల సౌర, పవన విద్యుత్ ప్లాంట్లను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం విమానాశ్రయంలో 500 కిలోవాట్ల సౌరవిద్యుత్‌ను వినియోగిస్తున్నారు. ఏటా 7.5 లక్షల యూనిట్లు ఉత్పత్తవుతోంది.

చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రస్తుతం 1.5 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌ను అధికారులు అందుబాటులోకి తీసుకువచ్చారు. భవిష్యత్తులో 5 మెగావాట్లకు పెంచనున్నారు.

ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయంలో 4.66 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. కొద్ది నెలల్లో ఈ ప్లాంట్ పూర్తిస్థాయిలో పనిచేయనుంది. ప్రస్తుతం విమానాశ్రయంలోని కొన్ని కార్యాలయాలు, వాణిజ్య సంస్థల అవుట్‌లెట్లకు సౌర విద్యుత్‌ను అందిస్తున్నారు.

దిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో 5.3 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్‌ను నిర్మించారు. ఈ ప్లాంట్ ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్‌ను విమానాశ్రయ ప్రాంగణంలోని కొన్ని కార్యాలయాలకు పూర్తిగా వినియోగిస్తున్నారు. వచ్చే అయిదేళ్లలో విమానాశ్రయం ప్రాంగణాన్ని సౌర ఎయిర్‌పోర్ట్‌గా మార్చేందుకు ప్రణాళికలు రూపొందించారు.

# న్యూయార్క్‌లో ముకేశ్ భారీ కొనుగోలు..!



రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్, భారత కుబేరుడు ముకేశ్ అంబానీ విదేశాల్లో అత్యంత విలువైన ఆస్తులను కొనుగోలు చేయడం కొనసాగిస్తున్నారు. తాజాగా అమెరికాలోని న్యూయార్క్‌లో అత్యంత విలాసవంతమైన బిల్డింగ్ కొనుగోలు చేసినట్లు సమాచారం. న్యూయార్క్‌లోని ట్రైబెకా ప్రాంతంలో భవంతిని 17.4 మిలియన్ డాలర్లు (సుమారు రూ.145 కోట్లు) వెచ్చించి సొంతం చేసుకున్నట్లు రియల్‌డీల్ తాజా నివేదిక వెల్లడించింది.

023 ఆగస్టులో మాన్‌హాటన్‌లో హడ్సన్ నదికి ఎదురుగా ఉన్న తన 9 మిలియన్ డాలర్ల విల్లాను విక్రయించిన రెండేళ్లకే అంబానీ ఈ కొత్త భవింతిని కొనుగోలు చేశారు. ఈ భవనాన్ని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎస్) అమెరికా విభాగం కొనుగోలు చేసింది. దీన్ని టెక్ బిలియనీర్ రాబర్ట్ పెరా 2018లో దాదాపు 20 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేసి, లగ్జరీ రెసిడెన్స్‌గా మార్చాలని ప్రణాళికలు చేశారు. కానీ అమలు కాలేదు. ఆ తర్వాత 2021లో ఆయన దాన్ని 25 మిలియన్ డాలర్లకు విక్రయానికి పెట్టారు.

బ్లూంబర్గ్ బిలియనీర్ల ఇండెక్స్ ప్రకారం.. ముకేశ్ అంబానీ సంపద ప్రస్తుతం 97.9 బిలియన్ డాలర్లు (సుమారు రూ.8.2 లక్షల కోట్లు). దీంతో ఆయన దేశంలోనే అత్యంత సంపన్నమైన వ్యక్తిగా అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. అలాగే ప్రపంచవ్యాప్తంగా 18వ స్థానంలో నిలిచారు. తరువాత స్థానంలో ఆదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ ఆదానీ ఉండగా.. ఆయన నికర ఆస్తులు 82.1 బిలియన్ డాలర్లని ఆ ఇండెక్స్ తెలిపింది.

# ఐటీ రిటర్నులకు రేపే ఆఖరు తేదీ




గత ఆర్థిక సంవత్సరానికి(202425) గాను ఎలాంటి జరిమానాలు లేకుండా ఆదాయపు పన్ను రిటర్నులు (ఐటీఆర్) దాఖలు చేసేందుకు గడువు రేపటితో ముగియనుంది. ఇప్పటికే దాదాపు 6 కోట్లకు పైగా పన్ను చెల్లింపుదారులు ఈ ప్రక్రియను పూర్తి చేసినట్లు ఐటీ విభాగం పేర్కొంది. పన్ను చెల్లింపుదారులకు, పన్ను నిపుణులకు సందేహాలు తీర్చేందుకు 24×7 సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించింది.

ఇవెరిఫై అయిన రిటర్నులు 5.51 కోట్లు ఉన్నాయని, ఇందులో 3.78 కోట్ల వరకూ పరిశీలన పూర్తయ్యిందని పన్ను విభాగం పేర్కొంది. రూ.3 లక్షలకు మించి ఆదాయం ఉన్న వారందరూ త్వరగా రిటర్నులు దాఖలు చేయాలని సూచించింది. కొత్త, పాత పన్ను విధానంలో ఏది ప్రయోజనమో చూసుకోవాలని తెలిపింది. మోసపూరిత మినహాయింపులు చూపించి, రిఫండును కోరడం తప్పు అని, తర్వాత కాలంలో ఇది నోటీసులకు, జరిమానాలకు దారి తీస్తుందని హెచ్చరిస్తోంది.

# జపాన్ కంపెనీల జీసీసీలూ ఇక్కడికే



**నిపుణుల లభ్యత, తక్కువ వ్యయాలు ప్రధాన ఆకర్షణ**

**హైదరాబాద్, బెంగళూరు వైపు మొగ్గు**

జపాన్‌లో కంపెనీలకు నిర్వహణ ఖర్చులు పెరిగిపోతున్నాయి. నిపుణుల లభ్యత కష్టంగా మారింది. డిజిటల్ టెక్నాలజీలను వేగంగా అందుకోలేకపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రత్యామ్నాయంగా జపాన్ కంపెనీలు మనదేశంలో జీసీసీ (గ్లోబల్ కేపబిలిటీ సెంటర్)లను ఏర్పాటు చేసేందుకు మొగ్గుచూపుతున్నాయి. జీసీసీల విభాగంలో మనదేశం ఇప్పటి వరకూ సాధించిన ప్రగతి కూడా జపాన్ కంపెనీలను ఆకర్షిస్తోంది. మనదేశాన్ని తమ భాగస్వామ్య దేశంగా జపాన్ పరిగణించడమూ కలిసొస్తోంది. 'జూలెస్టోవాట్స్ (జే2డబ్ల్యూ) అడాప్షన్ సర్వే 2025' ఈ విషయాలను తేటతెల్లం చేసింది. ఈ సర్వేలో ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్, బీఎఫ్ఎస్ఐ, మ్యానుఫ్యాక్చరింగ్ రంగాలకు చెందిన 50 జపాన్ కంపెనీల సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

**ఇవీ ఆకర్షిస్తున్న అంశాలు**

మనదేశంలో నిపుణుల లభ్యత అధికంగా ఉండటం, ఖర్చులు తక్కువగా ఉండటం, డిజిటల్ టెక్నాలజీలను త్వరగా అందిపుచ్చుకోవడం ప్రపంచ కంపెనీలను ఆకర్షిస్తోంది. తమ జీసీసీలను ఏర్పాటు చేయడానికి జపాన్ కంపెనీలు ప్రధానంగా బెంగళూరు, హైదరాబాద్ నగరాల వైపు మొగ్గుచూపుతున్నాయి. సర్వేలో పాల్గొన్న అధికారుల్లో 60% మంది ఈ రెండు నగరాలకే ఓటు వేశారు. తదుపరి స్థానాల్లో చెన్నై, పుణె, ముంబయి, దిల్లీ ఎన్‌సీఆర్ ఉన్నాయి. మనదేశంలో ఏటా 15 లక్షల మంది స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్) గ్రాడ్యుయేట్లు ఉద్యోగాల విపణిలోకి వస్తున్నారు. జపాన్‌తో పోలిస్తే మనదేశంలో వ్యాపార నిర్వహణ ఖర్చులు 40% తక్కువగా ఉన్నాయి. జపాన్‌లో నిపుణుల కొరత వల్లే, మనదేశంలో పెట్టుబడులు పెట్టేందుకు జపాన్ కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయని జూలెస్టోవాట్స్ సీఈఓ ప్రీతి సావంత్ అన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో పోటీని తట్టుకోవాలంటే, భారతదేశంలో లభించే ప్రయోజనాలను అందిపుచ్చుకుని, ముందుకు సాగక తప్పదనేది జపాన్ కంపెనీల అభిప్రాయంగా ఉన్నట్లు వివరించారు. మనదేశం నిర్దేశించుకున్న హరిత విద్యుత్తు లక్ష్యాలు కూడా జపాన్ కంపెనీలను ఆకర్షిస్తున్నాయి. 2026 నాటికి కర్బన వ్యర్థాలను 25% తగ్గించుకోవాలనేది జపాన్ కంపెనీల లక్ష్యం. తమ విద్యుత్తు అవసరాల్లో 40% పునరుత్పాదక ఇంధన వనరుల నుంచి సమకూర్చుకోవాలనుకుంటున్నాయి.

**రెండో అంచె నగరాలపైనా దృష్టి**

కొన్ని కంపెనీలు తమ జీసీసీలను ఏర్పాటు చేయటానికి పుణె, కోచి, విశాఖపట్నం వంటి రెండో అంచె నగరాల వైపు మొగ్గు చూపుతున్నాయి. ప్రధాన నగరాలతో పోలిస్తే వీటిలో ఖర్చులు తక్కువగా ఉండటం దీనికి ప్రధాన కారణం. మానవ వనరుల లభ్యత, నైపుణ్యాల విస్తరణకు అవకాశాలు ఉండటమూ ముఖ్యమైన అంశంగా భావిస్తున్నాయి. ఇప్పటి వరకు అమెరికా, ఐరోపా దేశాల కంపెనీలు అధికంగా జీసీసీలను మనదేశంలో ఏర్పాటు చేస్తుండగా.. ఇక జపాన్ కంపెనీలూ చేరబోతున్నాయి. ఇది ఎంతో ఆసక్తికర పరిణామం.

**సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా**

జీసీసీలను జపాన్ కంపెనీలు కేవలం సపోర్ట్ సెంటర్లుగా కాకుండా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా భావిస్తున్నాయి. కొత్తదనాన్ని అందిపుచ్చుకోవడం, ప్రాసెస్ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుకోవడం, తక్కువ సమయంలో పనులు పూర్తిచేయడం.. ప్రధాన లక్ష్యాలుగా జీసీసీలను నిర్వహించాలనే ఆలోచన చేస్తున్నాయి. బీఎఫ్ఎస్ఐ, ఐటీ విభాగాలకు చెందిన జపాన్ కంపెనీలు తమ జీసీసీల్లో ఫిన్‌టెక్ పరిశోధనలకు పెద్దపీట వేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంటున్నాయి.


ఆటోమోటివ్, ఉత్పత్తి రంగాల కంపెనీలు ఈవీ బ్యాటరీ పరిశోధనలు, స్మార్ట్ ఫ్యాక్టరీ టెక్నాలజీలపై దృష్టి సారిస్తున్నాయి. ఏఐ ఆధారిత నిర్ణయాలు తీసుకునే వ్యవస్థ, ఆటోమేషన్, సైబర్ సెక్యూరిటీ, ఈఎస్‌జీ నిబంధనలను అమలు చేయడం... అన్ని కంపెనీల అజెండాలో ఉన్న అంశాలు.

# ఎండకు ముఖం నల్లగా మారితే ఈ ఫేస్ ప్యాక్ వేసుకోండి, చర్మంపై ఉన్న ట్యాన్ మొత్తం పోతుంది



వేసవిలో వేడి వాతావరణం వల్ల చర్మంపై వేడి, దుమ్ము, చెమట పేరుకుపోతుంది. దీనివల్ల చర్మంపై టాన్ పట్టేస్తుంది. ముఖం మొత్తం రంగు పాలిపోయినట్లు కనిపిస్తుంది. చిన్నవయసులోనే టాన్ పట్టేసి ముఖంలో ముదురుతనం కనిపిస్తుంది. ఎండాకాలంలో ముఖం రంగు మారడం వల్ల అందవిహీనంగా కనిపిస్తారు. ముఖం కాంతిని సరిచేయాలంటే కొన్ని రకాల హోమ్ మేడ్ ఫేస్ ప్యాక్ లా తయారుచేసుకుని అప్లై చేయాలి. ఇది మృతకణాలను తొలగించడంతో పాటు మెరుపును తిరిగి ఇస్తుంది.





## హోమ్ మేడ్ ఫేస్ ప్యాక్ ఇలా చేయండి

పచ్చి బంగాళాదుంప రసం - మూడు స్పూన్లు
బార్లీ పిండి - ఒక స్పూను
ఆరెంజ్ పీల్ పౌడర్ - ఒక స్పూను
లైకోరైస్ పౌడర్ - అర స్పూను
కాఫీ పౌడర్ - అరస్పూను

ఇక్కడ చెప్పిన వస్తువులతో ఫేస్ ప్యాక్ ను తయారుచేసుకోవాలి. ఒక గాజు గిన్నెలో పచ్చి బంగాళాదుంప రసంలో బార్లీ పిండి, నారింజ తొక్కల పొడి, లైకోరైస్ పౌడర్, కాఫీ పొడి కలపాలి. ఈ విధంగా పచ్చి బంగాళదుంప రసంలో కలిపిన తర్వాత కూడా ఈ పౌడర్లన్నీ బాగా కలవవు. కాసేపు ఉంచితే ఇవి బాగా నానుతాయి. ఇప్పుడు రోజ్ వాటర్ వేసి బాగా తయారుచేసిన ప్యాక్ ను సిద్ధం చేసుకోవాలి. ముందుగా ఫేస్ వాష్ సహాయంతో ముఖాన్ని బాగా కడుక్కోవాలి. తద్వారా ముఖంపై



పేరుకుపోయిన అదనపు నూనె, మురికి తొలగిపోతాయి. ఈ ఫేస్ ప్యాక్ అప్లై చేయాలి. ఇది తేలికగా ఆరడం ప్రారంభించినప్పుడు, తేలికపాటి చేతులతో ముఖం మొత్తాన్ని బాగా మసాజ్ చేయండి. ఫేస్ ప్యాక్ పై మసాజ్ చేస్తే మంచిది. తద్వారా ఇది నేచురల్ స్క్రబ్ లా పనిచేసి డెడ్ స్కిన్ ను తొలగిస్తుంది. స్క్రబ్ లా మసాజ్ చేసిన తర్వాత ఈ ఫేస్ ప్యాక్ ను శుభ్రమైన నీటితో శుభ్రం చేసుకోండి. ముఖంపై మెరుపు వస్తుంది.

# ఆస్తమాతో బాధపడుతున్నవారు ఏసీ వాడవచ్చా? వారిపై ఏసీ వల్ల ఎలాంటి ప్రభావం పడుతుంది?





ఆధునిక జీవిత శైలిలో ఏసి ఇంట్లో భాగంగా మారిపోయింది. పెరుగుతున్న వేడిని తట్టుకునేందుకు ప్రతి ఒక్కరూ ఎయిర్ కండిషనర్లను వాడుతున్నారు. అయితే ఆస్తమా ఉన్నవారికి ఎన్నో సందేహాలు ఉంటాయి. ఎయిర్ కండిషనర్లలో ఎక్కువ కాలం ఉండడం వల్ల ఎలాంటి ప్రభావాలు కలుగుతాయో తెలుసుకోవాలనుకుంటారు. అలాగే ఏసీలలో ఉండడం వల్ల తమకు హానికరమా కాదా? అనే అనుమానం కూడా ఉంటుంది. వాటన్నింటికీ ఇక్కడ సమాధానం తెలుసుకుందాం.

**ఏసీతో ఆస్తమా రోగులకు కలిగే సానుకూల ప్రభావాలు**


ఏసీని సరైన పద్ధతిలో ఉపయోగిస్తే ఎయిర్ కండిషనర్లు ఆస్తమా బాధితులకు అనేక ప్రయోజనాలను కూడా అందిస్తాయి. ఏసీలు ఇంట్లోని వాతావరణాన్ని నియంత్రించడానికి సహాయపడతాయి. ముఖ్యంగా ఏసీని 24 డిగ్రీల నుంచి 26 డిగ్రీల మధ్య ఉంచితే ఆస్తమా లక్షణాలు ప్రేరేపించే అవకాశం కూడా చాలా తక్కువ.

**ఎయిర్ ఫిల్టర్**

నాణ్యమైన ఫిల్టర్లతో కూడిన ఎయిర్ కండిషనర్లు వాడితే ఎంతో మంచిది. ఇవి ఇంట్లోని పుప్పొడి, దుమ్ము, కీటకాలు వాయు కాలుష్యం వంటి వాటి వల్ల ఆస్తమా ప్రభావం మొదలవకుండా కాపాడతాయి. అంటే ఆస్తమా ట్రిగ్గర్లను తగ్గించడానికి సహాయపడతాయి.

**అలెర్జీ కారకాలు**

ఏసి వేసేటప్పుడు అందరూ ఇంటిలోని తలుపులు కిటికీలను వేస్తారు. దీనివల్ల కాలుష్యం, దుమ్ము, ధూళి గదిలోకి చేరకుండా ఉంటుంది. గదిలోని గాలి స్వచ్ఛంగా ఉంటుంది. దీని వల్ల అలెర్జీ కారకాలు ఉండవు. అందుకే ఆస్తమా రోగులకు ఆ గదిలో దగ్గు, జలుబు వంటివి వచ్చే అవకాశం చాలా






తక్కువగా ఉంటుంది.

**ఆస్తమా రోగులకు పై ఏసీ ప్రతికూల ప్రభావాలు**

ఆస్తమా రోగులు ఏసీ గదిలో ఉండడం వల్ల ఎలాంటి సానుకూల ప్రభావాలు పడతాయో తెలుసుకున్నాం. ఇప్పుడు వాటి వల్ల కలిగే ప్రతికూల ప్రభావాల గురించి తెలుసుకుందాం.

**తక్కువ ఉష్ణోగ్రత వద్ద ఉన్న ఏసీ**

ఏసీని కొంతమంది చాలా తక్కువ ఉష్ణోగ్రత వద్ద సెట్ చేస్తారు. అంటే 18 డిగ్రీలు లేదా 19 డిగ్రీల మధ్య సెట్ చేస్తారు. ఈ ఉష్ణోగ్రత వద్ద ఏసీ ఉన్నప్పుడు ఆస్తమా రోగులకు చాలా సైడ్ ఎఫెక్టులు కలుగుతాయి. వారి శ్వాస మార్గాల్లో చికాకు కలుగుతుంది. ఇదే ట్రిగ్గర్ గా మారి వారికి వెంటనే ప్రభావం కనిపిస్తుంది. ఆస్తమా ఉన్న వ్యక్తులు చల్లని గాలికి తట్టుకోలేరు. ఆస్తమా తీవ్రంగా మారే అవకాశం ఉంటుంది.

**మురికి ఫిల్టర్లు**

ఏసీ ఫిల్టర్లలో దుమ్ము, బూజు వంటివి పేరుకుపోతూ ఉంటాయి. వీటిని ఎప్పటికప్పుడు క్లీన్ చేసుకుంటూ ఉండాలి. కానీ చాలామంది అలా క్లీన్ చేయకుండా వదిలేస్తారు. దీనివల్ల శ్వాస కోసం ఇన్ఫెక్షన్లు వస్తాయి. ఇది ఆస్తమా రోగులకు ప్రాణాంతకంగా మారే అవకాశం ఉంటుంది. కాబట్టి ఫిల్టర్లను ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలి.

**ఎయిర్ కండిషనింగ్ సరైన ఉష్ణోగ్రత వద్ద**

సెట్ చేసి ఉంటే ఎలాంటి సమస్య ఉండదు. కానీ దాని ఉష్ణోగ్రత సరిగ్గా చెయ్యకపోతే ఆస్తమా రోగుల్లో శ్వాస మార్గాలు పొడిగా మారుతాయి. దీనివల్ల శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారుతుంది. ఆయాసం లాంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. ఏసీ నడుస్తున్నప్పుడు కిటికీలు తెరిచి ఉంచడం ఏమాత్రం మంచిది కాదు. ఇలా చేయడం వల్ల కలుషితమైన గాలి బయట నుంచి గదిలోకి చేరి... అక్కడున్న గాలి స్వచ్ఛతను తగ్గిస్తుంది. ఇది కచ్చితంగా ఆస్తమా రోగులపై ప్రభావాన్ని చూపిస్తుంది.

**పెంపుడు జంతువులు**

ఏసీ వాడేవారు పెంపుడు జంతువులను ఆ గదిలోకి రానివ్వకూడదు. అలాగే ఇంటి బాల్కనీలో లేదా ఏసీ పెట్టిన గదికి దగ్గరలో పావురాలు వంటివి ఉన్న జాగ్రత్తగా ఉండాలి. వాటి చుట్టూ ఈకలు, రెట్టలు వంటివి గాలిలో కలిసి గదిలోకి చేరకుండా కాపాడాలి. లేకుంటే ఆస్తమా ఉన్నవారికి అలర్జీలు తక్కువ సమయంలోనే వచ్చేస్తాయి. ఇవి ఆరోగ్య సమస్యలకు కారణం అవుతాయి. తీవ్రమైన ఊపిరితిత్తుల వ్యాధులు వచ్చే అవకాశాన్ని కూడా ఇవి పెంచుతాయి.



# పాక్ చిత్తు.. చిత్తు

## ఆసియా కప్‌లో ఓడించిన ఇండియా

- 7 వికెట్ల తేడాతో దాయాదిపై విక్టరీ
- పాకిస్థాన్ 127/9, కుల్‌దీప్ యాదవ్ (3/18)
- టీమ్‌ఇండియా 128/3 (15.5 ఓవర్లు)
- సూర్యకుమార్ యాదవ్ (47*)
- 31 పరుగులు చేసిన ఓపెనర్ అభిషేక్ శర్మ





దుబాయ్, సెప్టెంబర్ 14, అనంత జనశక్తి న్యూస్
భారత్ అదరహో.. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై మళ్లీ మనదే ఆధిపత్యం. ఆసియా కప్ 2025 లో భాగంగా దాయాది జట్టుతో జరిగిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్‌ను 127/9కే కట్టడి చేసింది. కుల్‌దీప్ యాదవ్ (3/18), అక్షర్ పటేల్ (18/2), బుమ్రా (28/2) బంతితో అదరగొట్టారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన టీమ్‌ఇండియా 128 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని 15.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. సూర్యకుమార్ యాదవ్ (47*; 37 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) అదరగొట్టాడు. తిలక్ వర్మ (31; 31 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. ఓపెనర్ అభిషేక్ శర్మ (31; 13 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) క్రీజులో ఉన్నంతసేపు బౌండరీలతో అలరించాడు. శుభ్‌మన్ గిల్ (10) తక్కువస్కోరుకే వెనుదిరిగాడు. శివమ్ దూబె (10*) నాటౌట్‌గా నిలిచాడు. గ్రూప్ ఏలో వరుసగా రెండో విజయం అందుకున్న భారత్.. తదుపరి మ్యాచ్‌లో ఒమన్‌తో (సెప్టెంబరు 19న) తలపడనుంది.

పాక్ బ్యాటర్లలో సాహిబ్‌జాదా ఫర్హాన్ (40; 44 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. షాహీన్ అఫ్రిది (33*; 16 బంతుల్లో 4 సిక్స్‌లు) చివర్లో మెరుపులు మెరిపించాడు. ఫకార్ జమాన్ (17), ఫహీమ్ అష్రఫ్ (11), ముఖీమ్ (10) పరుగులు చేశారు. భారత బౌలర్ల ధాటికి సైమ్ అయుబ్, మహ్మద్ నవాజ్ డకౌట్ కాగా.. హసన్ నవాజ్ (5), మహ్మద్ హారిస్ (3), సల్మాన్ అఘా (3) సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు.





**ఈ విజయం పహల్గాం ఉగ్రవాద దాడి బాధితులకు అంకితం: సూర్యకుమార్**

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఆసియా కప్ లో పాకిస్థాన్‌తో మ్యాచ్‌ను భారత్ బహిష్కరించాలనే డిమాండ్లు వచ్చాయి. అయితే, ఎట్టకేలకు మ్యాచ్ జరగ్గా.. భారత్ ఏడు వికెట్ల తేడాతో పాక్‌ను ఓడించింది. దాయాది జట్టు నిర్దేశించిన 128 పరుగుల లక్ష్యాన్ని భారత్ 15.5 ఓవర్లలోనే ఛేదించింది. మ్యాచ్ ప్రారంభానికి ముందు టాస్ సందర్భంగా, మ్యాచ్ అనంతరం పాక్ కెప్టెన్ సల్మాన్ అఘాతో భారత సారథి సూర్యకుమార్ యాదవ్ కరచాలనం చేయలేదు. మ్యాచ్ ముగిసిన తర్వాత సూర్యకుమార్ మాట్లాడుతూ ఈ విజయాన్ని పహల్గాం ఉగ్రదాడి బాధితులు, సాయుధ బలగాలకు అంకితమిస్తున్నట్లు చెప్పాడు.

'పహల్గాం ఉగ్రవాద దాడి బాధితుల కుటుంబాలకు అండగా నిలిచేందుకు ఇదే సరైన సందర్భమని భావిస్తున్నాను. బాధిత కుటుంబాలకు మా సంఘీభావాన్ని తెలియజేస్తున్నాం. ఎంతో ధైర్యసాహసాలు ప్రదర్శించిన మన సాయుధ దళాలన్నింటికీ ఈ విజయాన్ని అంకితం చేయాలనుకుంటున్నాము. మనందరికీ వారు స్ఫూర్తినిస్తూనే ఉంటారు. అవకాశం దొరికినప్పుడల్లా వారి ముఖాల్లో చిరునవ్వు ఉండే విధంగా మా వంతు ప్రయత్నం చేస్తునే ఉంటాం'' అని సూర్యకుమార్ వివరించాడు. ఈ మ్యాచ్‌లో కెప్టెన్‌గా సూర్య అదరగొట్టాడు. 37 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్ సాయంతో 47 పరుగులతో అజేయంగా నిలిచి భారత్ విజయంలో కీలకపాత్ర పోషించాడు.

టీమిండియా అదరగొట్టింది. మరోసారి పాకిస్థాన్ పై తనకు తిరుగులేదని చాటింది. ఆసియా కప్ 2025లో ఇవాళ (సెప్టెంబర్ 14) జరిగిన గ్రూప్‌ఎ మ్యాచ్ లో పాక్ ను ఇండియా 7 వికెట్ల తేడాతో ఓడించింది. దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ లో భారత్ 128 పరుగుల లక్ష్యాన్ని 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 15.5 ఓవర్లలో అందుకుంది. సూర్యకుమార్ (37 బంతుల్లో 47 నాటౌట్; 5 ఫోర్లు, ఓ సిక్సర్), అభిషేక్ శర్మ (13 బంతుల్లో 31; 4 ఫోర్లు, 2 సిక్సర్లు), తిలక్ వర్మ (31 బంతుల్లో 31; 2 ఫోర్లు, ఓ సిక్సర్) బ్యాటింగ్ లో సత్తాచాటారు. అంతకుముందు టాస్ గెలిచి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 127 పరుగులే చేయగలిగింది. ఆ టీమ్ లో సాహిబ్జాదా ఫర్హాన్ (40) టాప్ స్కోరర్. కుల్‌దీప్ యాదవ్ (3/18), అక్షర్ పటేల్ (2/18), బుమ్రా (2/28) దాయాది జట్టును కుప్పకూల్చారు.

**అభిషేక్ అదుర్స్**

అపోనెంట్ ఎవరన్న దానితో సంబంధం లేకుండా బంతిని బాదడమే పనిగా సాగే యంగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ పాకిస్థాన్ పై చెలరేగాడు. వరుసగా 4, 6తో ఇండియా ఛేజింగ్ ను ఘనంగా మొదలెట్టాడు అభిషేక్. రెండు ఫోర్లు కొట్టి శుభ్‌మన్ (10) ఔటైనా.. అభిషేక్ దంచుడు కొనసాగించాడు. కానీ సయీం అయూబ్ బౌలింగ్ లో ఔటయ్యాడు.

**తిలక్, సూర్య కలిసి**

అభిషేక్ వికెట్ తో ఇండియా ఛేజింగ్ స్లో అయింది. అక్కడి నుంచి మన హైదరాబాద్ కుర్రాడు తిలక్ వర్మ, కెప్టెన్ సూర్యకుమార్ కలిసి నెమ్మదిగా ఇన్నింగ్స్ నడిపించారు. పరుగులూ కష్టంగానే వచ్చాయి. అయినా సాధించాల్సిన రన్ రేట్ అందుబాటులోనే ఉండటంతో ఇబ్బంది లేకుండా పోయింది.

క్రమంగా సూర్య, తిలక్ కలిసి వేగం పెంచారు. పాక్ బౌలింగ్ ను చితక్కొట్టారు. ప్రెషర్ ను చక్కగా హ్యాండిల్ చేస్తూ టీమ్ ను విజయం వైపు నడిపించారు. త్వరగా మ్యాచ్ ముగించాలనే తొందరలో తిలక్ వికెట్ కోల్పోయాడు. అయినా శివమ్ దూబె (10 నాటౌట్)తో కలిసి కెప్టెన్ సూర్య మిగతా పని పూర్తి చేశాడు. సిక్సర్ తో సూర్య మ్యాచ్ ముగించడం విశేషం.

**ఫస్ట్ బాల్ కే వికెట్**

దుబాయ్ అంతర్జాతీయ స్టేడియంలో ఇండియాతో మ్యాచ్ లో టాస్ గెలిచిన పాకిస్థాన్ ఫస్ట్ బ్యాటింగ్ కు దిగింది. కానీ టాస్ గెలిచిన ఆనందం పాక్ కు లేకుండా ఇన్నింగ్స్ ఫస్ట్ బాల్ కే అయూబ్ (0)ను హార్దిక్ ఔట్ చేశాడు. ఆ తర్వాతి ఓవర్లోనే మహమ్మద్ హారిస్ ను పెవిలియన్ చేర్చిన బుమ్రా.. పాక్ కు డబుల్ షాకిచ్చాడు.

**కుల్‌దీప్, అక్షర్ దెబ్బ**

సాహిబ్జాదా ఫర్హాన్ (40), ఫకర్ జమాన్ (17) కలిసి కాసేపు వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. కానీ స్పిన్నర్లు కుల్‌దీప్, అక్షర్ పాక్ నడ్డి విరిచారు. టపటపా వికెట్లు పడగొట్టారు. దీంతో 45/3 నుంచి పాక్ 97/8కి పడిపోయింది. ఆఖర్లో షహీన్ షా అఫ్రిది (33 నాటౌట్) మెరుపులతో పాక్ స్కోరు 120 దాటింది. కుల్‌దీప్ యాదవ్ 3, అక్షర్ పటేల్ 2, బుమ్రా 2 వికెట్లు పడగొట్టారు.

## జపాన్‌తో మ్యాచ్ డ్రా

మహిళల హకీ ఆసియా కప్‌లో భారత జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన సూపర్ 4 మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ జపాన్‌తో మ్యాచ్‌ను 1-1తో డ్రా చేసుకుంది. మరో మ్యాచ్‌లో కొరియాపై 1-0తో చైనా విజయం సాధించి ఫైనల్ బెర్తు ఖరారు చేసుకుంది. అయినా సరే నాలుగు పాయింట్లతో పట్టికలో రెండో స్థానంలో నిలిచిన సూరజ్ లతా దేవీ నేతృత్వంలోని టీమిండియా టైటిల్ పోరుకు అర్హత సాధించింది. ఆదివారం ఇరుజట్లు ట్రోఫీ కోసం తలపడనున్నాయి. ఫైనల్లో గెలుపొందిన జట్టు వచ్చే ఏడాది బెల్జియం, నెదర్లాండ్స్ వేదికగా జరుగబోయే ఎఫ్ఐహెచ్ వరల్డ్ కప్ పోటీలకు అర్హత సాధిస్తుంది. ఆసియా కప్ ఆరంభం నుంచి అదరగొడుతున్న భారత జట్టు చివరి సూపర్ 4 మ్యాచ్‌లోనూ చెలరేగింది. బలమైన జపాన్‌ను నిలువరిస్తూ మ్యాచ్ డ్రా చేసుకొని ఫైనల్లో అడుగుపెట్టింది. ఆట మొదలైన 7వ నిమిషంలోనే నేహా గోయల్ (Neha Goel) కొట్టిన గోల్‌ను ప్రత్యర్థి ప్లేయర్ డుంగ్ డుంగ్ నెట్‌లోపలికి వెళ్లి అడ్డుకుంది. దాంతో.. రిఫరీ టీమిండియాకు గోల్ ప్రకటించాడు.



## ఇషా పసిడి గురి

ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ షూటింగ్ కప్‌లో భారత్ ఎట్టకేలకు పతక ఖాతా తెరిచింది. పలువురు షూటర్లు ఘోరంగా నిరాశపరిచిన వేళ తాను ఉన్నానంటూ తెలంగాణ యువ షూటర్ ఇషాసింగ్..భారత్‌కు తొలి పసిడి పతకాన్ని అందించింది. శనివారం జరిగిన మహిళల 10మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్లో ఇషాసింగ్ 242.6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఈ క్రమంలో చైనా స్టార్ షూటర్ యావో జియాన్‌జున్(242.5) పాయింట్ తేడాతో వెనుకకు నెడుతూ ఇషా రజతానికి పరిమితం చేసింది. కొరియా షూటర్ యెజిన్(220.7) కాంస్యం ఖాతాలో వేసుకుంది. ఇషాకు ఇది తొలి ప్రపంచకప్ స్వర్ణం కాగా, ఈ పతకంతో భారత్ ప్రస్తుతం ఐదో స్థానంలో కొనసాగుతున్నది. 'ప్రపంచకప్‌లాంటి మొదటి ఈవెంట్‌లోనే పతకం గెలువడం చాలా సంతోషంగా ఉంది. అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నందుకు గర్వంగా ఉంది' అని ఇషా పేర్కొంది. ఈ విభాగంలో ఇషాతో పాటు భారత్ నుంచి రితమ్ సాంగ్వాన్ ఫైనల్‌కు అర్హత సాధించింది.



## సత్తా చాటిన షట్లర్లు

గత కొద్దికాలంగా సెమీఫైనల్‌స్‌కే పరిమితమవుతున్న భారత బ్యాడ్మింటన్ డబుల్స్ ద్వయం సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి హాంకాంగ్ ఓపెన్‌లో ఆ గండాన్ని అధిగమించారు. హాంకాంగ్ ఓపెన్ సూపర్ 500 టోర్నీలో ఈ జోడీ ఫైనల్‌స్‌కు చేరింది. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీస్‌లో భారత జంట.. 21-17, 21-15తో వరుస సెట్లలో బింగ్-వీ లిన్-చెన్ చెంగ్ కౌన్ (చైనీస్ తైపీ)ను ఓడించి ఫైనల్‌స్‌కు ప్రవేశించింది. ఆరు సెమీస్ ఓటముల తర్వాత సాత్విక్ జోడీకి ఈ సీజన్‌లో ఇదే తొలి ఫైనల్స్. పురుషుల సింగిల్‌స్‌లో లక్ష్యసేన్ కూడా ఫైనల్ చేరాడు. సెమీస్‌లో 23 ఏండ్ల ఈ ఉత్తరాఖండ్ కుర్రాడు.. 23-21, 22-20తో ప్రపంచ 9వ ర్యాంకర్ టి.సి. చౌకు షాకిచ్చాడు.




## బీసీసీఐ ప్రతినిధులుగా గంగూలీ, హర్భజన్



భారత మాజీ ఆటగాళ్లు సౌరభ్ గంగూలీ , హర్భజన్ సింగ్ లు బీసీసీఐ పూర్తికాల సభ్యుల ప్రతినిధులుగా ఎంపికయ్యారు. వార్షిక సమావేశం, కార్యవర్గం ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఈ దిగ్గజ ఆటగాళ్లకీ గౌరవం లభించింది. సెక్రటరీ దేవజిత్ సైకియా, ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ సింగ్ ధుమాల్ కూడా ప్రతినిధులుగా వ్యవహరిస్తారని శనివారం బీసీసీఐ ఎన్నికల అధికారి ఏకే జోటీ తెలిపాడు. బెంగాల్ క్రికెట్ సంఘానికి దాదా .. పంజాబ్ క్రికెట్ సంఘానికి భజ్జీ ప్రతినిధులుగా భారత బోర్డు వార్షిక సమావేశానికి హాజరు కానున్నారు. సెప్టెంబర్ 28న బీసీసీఐ వార్షిక సమావేశం జరుగనుంది. అదే రోజు అధ్యకుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి కోసం ఎన్నికలు జరుగున్నాయి. ఈ సమావేశంలో బీసీసీఐ పూర్తికాల సభ్యుల ప్రతినిధులుగా గంగూలీ, హర్భజన్ వ్యవహరిస్తారు. సైకియా అస్సాం క్రికెట్ సంఘానికి, అరుణ్ ధుమాల్ హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ సంఘానికి ప్రాతినిధ్యం వహించనున్నారు. బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా ఉత్తరప్రదేశ్ స్టేట్ నుంచి, కార్యదర్శి ప్రభ్‌జిత్ సింగ్ భాటియా ఛత్తీస్‌గఢ్ క్రికెట్ సంఘం, బోర్డు జాయింట్ సెక్రటరీ రోహన్ గాన్స్ దేశాశ్ గోవా క్రికెట్ ప్రతినిధులుగా ఎంపికయ్యారని ఎన్నికల అధికారి ఏకే జోటి వెల్లడించాడు.

## 3 వారాల్లో జెర్సీ స్పాన్సర్

భారత క్రికెట్ జట్టుకు మరో రెండు, మూడు వారాల్లో కొత్త టైటిల్ స్పాన్సర్ రాబోతున్నట్టు బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలతో టీమ్‌ఇండియా టైటిల్ స్పాన్సర్ నుంచి డ్రీమ్ 11 అర్ధాంతరంగా తప్పుకోవడంతో ప్రస్తుతం యూఏఈలో జరుగుతున్న ఆసియా కప్‌లో భారత జట్టు జెర్సీ స్పాన్సర్ లేకుండానే బరిలోకి దిగుతున్నది. కాగా కొత్త స్పాన్సర్ కోసం బీసీసీఐ టెండర్ల ప్రక్రియను ప్రారంభించగా బిడ్‌లు దాఖలు చేయడానికి ఈనెల 16 ఆఖరు తేదీగా నిర్ణయించారు. ఆ ప్రక్రియ ముగిసిన 2, 3 వారాల్లో కొత్త స్పాన్సర్‌ను ప్రకటిస్తామని శుక్లా చెప్పారు.



## ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు తొలి స్వర్ణం

ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు తొలి స్వర్ణం లభించింది. మహిళల 57 కిలోల విభాగంగా జైస్మిన్ లంబోరియా బంగారు పతకం సాధించింది. లివర్‌పూల్‌లో జరిగిన ఫైనల్‌స్‌లో ఒలింపిక్స్‌లో సిల్వర్ మెడల్ గెలుపొందిన పొలండ్‌కు స్టార్ జూలియా సెరెమెటాపై 4-1 తేడాతో విజయం సాధించింది. మరోవైపు ఇదే టోర్నీలో నుపుర్ షెరాన్(80+కిలోలు), యువ బాక్సర్ మీనాక్షి హుడా (48 కిలోలు) విభాగాల్లో ఫైనల్లోకి ప్రవేశించిన సంగతి తెలిసిందే.



అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
సోమవారం | అనంతపురం
15.09.2025



# రామోజీ ఫిల్మ్ సిటీలో 'ఎస్ఎస్ఎంబీ29'




కథానాయకుడు మహేశ్‌బాబు.. దర్శకుడు రాజమౌళి కలయికలో రూపొందుతున్న 'ఎస్ఎస్ఎంబీ 29' (వర్కింగ్ టైటిల్) సినిమా శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోంది. ఇటీవలే కెన్యాలో ఓ కీలక షెడ్యూల్‌ను ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగొచ్చిన ఈ బృందం.. ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో కొత్త షెడ్యూల్‌ను మొదలు పెట్టింది. అక్టోబరు 10వరకు కొనసాగనున్న ఈ షెడ్యూల్‌లో ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు తెరకెక్కించనున్నారు. గ్లోబ్ ట్రాటర్.. అనే ఉపశీర్షికతో ముస్తాబవుతున్న ఈ చిత్రంలో మహేశ్ ప్రపంచాన్ని చుట్టేసే సాహసికుడిగా కనిపించనున్నట్లు తెలుస్తోంది. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా తొలి లుక్ నవంబరులో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి ఎం.ఎం.కీరవాణి సంగీతమందిస్తున్నారు. విజయేంద్ర ప్రసాద్ కథ అందివ్వగా దుర్గా ఆర్ట్స్ పతాకంపై కె.ఎల్.నారాయణ నిర్మిస్తున్నారు.

# అందరికీ నచ్చే చిత్రం... 'మిరాయ్'




'మిరాయ్' విజయం మరెన్నో గొప్ప సినిమాలు చేయడానికి కావల్సినంత ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు ప్రముఖ నిర్మాత టి.జి. విశ్వప్రసాద్. తాము కథని ఎంతగానో నమ్మామని, అది నిజమైనందుకు ఆనందంగా ఉందన్నారు. ఆయన పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై కృతిప్రసాద్‌తో కలిసి నిర్మించిన చిత్రం 'మిరాయ్'. తేజ సజ్జా, రితికానాయక్ జంటగా నటించారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకుడు. శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం శనివారం హైదరాబాద్‌లో థ్యాంక్స్ మీట్‌ని నిర్వహించింది.

కథానాయకుడు తేజ సజ్జా మాట్లాడుతూ "సినిమాని గుండెల్లో పెట్టుకుని ఆదరిస్తున్నారు ప్రేక్షకులు. ఈ స్పందన ఎంతో ఆనందాన్నిచ్చింది. దర్శకనిర్మాతల కారణంగానే ఈ విజయం సాధ్యమైంది. మంచు మనోజ్ ఇందులో భాగం కావడంతో సినిమా మరోస్థాయికి వెళ్లింది. కథానాయిక రితికా, సంగీత దర్శకుడు హరి గౌరా ఈ సినిమాకోసమే రెండేళ్లు ప్రయాణం చేశారు. 'హను - మాన్' సినిమాకి రానా అందించిన సహకారం మర్చిపోలేను. ఈ సినిమా చూశాక కూడా ఏదైనా చేస్తానని ముందుకొచ్చారు. ఆయనకి ఏ లాభం లేకపోయినా మంచి సినిమా కోసం ముందుకొచ్చారు. గొప్ప నటులైన జగపతిబాబు, శ్రియ, జయరాం మా తపన చూసి మాతో ప్రయాణం చేశారు. కుర్రాళ్లని ప్రోత్సహించడంలో ఎప్పుడూ ముందుండే బంగారంలాంటి హృదయం ఉన్న వ్యక్తి ప్రభాస్. ఆయన ఈ కథని చెప్పడంతోనే సినిమాకి ఇంత బలం చేకూరింది. ఇందులో భాగమైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. మిరాయ్ అందరికీ నచ్చే సినిమా, అందరూ థియేటర్లలో చూసి ఆస్వాదించే సినిమా" అన్నారు.

# 'ఓజీ'లో సర్‌ప్రైజ్‌లా..




'డీజే టిల్లు' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల్ని మెప్పించిన నటి నేహా శెట్టి. ఇప్పుడామె పవన్ కల్యాణ్ 'ఓజీ' సినిమాలో ఓ సర్‌ప్రైజ్‌లా కనువిందు చేయనున్నట్లు స్పష్టత ఇచ్చింది. సుజీత్ తెరకెక్కిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ప్రియాంక మోహన్ కథానాయిక. ఇమ్రాన్ హష్మీ ప్రతినాయకుడిగా నటించారు. నేహా ఇందులో పవన్‌తో ప్రత్యేక గీతంలో ఆడిపాడటమే కాక ఆయనతో కొన్ని కీలక సన్నివేశాల్లో పాలు పంచుకున్నట్లు తెలిసింది. ఆమె చేసిన ఆ పాటతో పాటు ఈ చిత్ర ట్రైలర్ ఈ వారంలోనే విడుదల కానున్నాయి. ఇక ఈ చిత్రం కోసం పవన్ తన పాత్రకు డబ్బింగ్ చెప్పడం ప్రారంభించినట్లు చిత్ర వర్గాలు సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించాయి. ఈ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఈ నెల 25న థియేటర్లలోకి రానుంది. నేహా ప్రస్తుతం తెలుగులో ఓ కొత్త చిత్రానికి సంతకం చేసింది. దాన్ని నవంబరులో ప్రకటించనున్నట్లు ఆమె తెలిపింది.



# క్లాసికల్ డ్యాన్సర్‌గా శ్రద్ధ?

జానపద ప్రపంచంలో తనదైన ముద్ర వేసిన మహారాష్ట్ర నృత్యకారిణి, గాయని విఠాబాయి భావు మంగ్ నారాయణ్ జీవితం తెరపైకి రాబోతున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టులో బాలీవుడ్ కథానాయిక శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తుండగా, లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కిస్తున్నారు. ఇంకా అధికారికంగా ప్రకటించని ఈ చిత్రంలోని తన పాత్ర కోసం శ్రద్ధ క్లాసికల్ డ్యాన్సర్‌గా శిక్షణ తీసుకుంటున్నట్లు సమాచారం. "ఈ చిత్రంతో మహారాష్ట్ర సంస్కృతిని జాతీయ స్థాయికి తీసుకెళ్లడానికి ప్రయత్నాలు చేస్తుంది చిత్రబృందం. ఇందులో క్లాసికల్ డ్యాన్సర్‌గా కనిపించనుంది శ్రద్ధ. ప్రస్తుతం దీని కోసం వర్క్‌షాప్‌లకు హాజరవుతుందామె. నవంబరులో ఈ సినిమాను పట్టాలెక్కించనున్నార"ని శ్రద్ధ సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరి 'స్త్రీ 2'తో దెయ్యంగా ప్రేక్షకుల్ని పరుగులు పెట్టించిన ఆమె.. క్లాసికల్ డ్యాన్సర్‌గా ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలి.



# ప్రీమియర్స్ పై భారీ ప్లాన్

మూడు సంవత్సరాల క్రితం విడుదలైన 'కాంతార' సినిమా ఎంత పెద్ద హిట్ అయిందో అందరికీ తెలిసిందే. కేవలం ₹15 కోట్ల బడ్జెట్‌తో తీసిన ఈ చిత్రం, వరల్డ్‌వైడ్‌గా ₹400 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టి సంచలనం సృష్టించింది. ఇప్పుడు ఆ సినిమాకి ప్రీక్వెల్‌గా తెరకెక్కుతోన్న 'కాంతార చాప్టర్ -1' మరోసారి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ సినిమాకు రిషబ్ శెట్టి దర్శకత్వం వహిస్తున్నారు. ఆయన హీరోగా కూడా నటిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్-ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. మేకర్స్ అక్టోబర్ 2న సినిమా విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. దీంతో ప్రమోషన్‌స్‌ను కూడా స్టార్ట్ చేయాలని నిర్ణయించారు. ఇప్పుడు మేకర్స్ ఈ సినిమాకి సంబంధించి భారీ ప్లాన్ చేస్తున్నారు. అక్టోబర్ 1వ తేదీన, సాయంత్రం 7 గంటలకు వరల్డ్ వైడ్‌గా ప్రీమియర్ షోలు వేయాలనే ఆలోచనలో ఉన్నారు. ఇది జరిగితే, కన్నడ ఇండస్ట్రీలో ప్రీమియర్స్ నిర్వహించిన తొలి భారీ సినిమా ఇదే అవుతుంది. తెలుగు, తమిళ సినిమాల్లో ఇప్పటికే ప్రీమియర్స్ మంచి ఫలితాలివ్వగా, ఆ ట్రెండ్‌ను ఈ మూవీ ఫాలో అవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే 'కాంతార చాప్టర్ 1'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ట్రైలర్ విడుదలైతే ఈ క్రేజ్ ఇంకాస్త పెరుగుతుంది. ఇక ప్రీమియర్ షోల ద్వారా మంచి టాక్ వస్తే, సినిమా విడుదల రోజు నుంచే బ్లాక్ బస్టర్ హిట్ దిశగా వెళ్లే అవకాశం ఉంది. దీంతో స్పెషల్ షోలు కూడా కలెక్షన్లకు బాగా హెల్ప్ అవుతాయి



# ట్రోల్స్ గురించి ఆలోచించలేదు!

జాన్వీకపూర్, ఇషాన్ కట్టర్ ప్రధాన పాత్రల్లో నటించిన 'హోమ్‌బౌండ్' సినిమా విడుదలకు ముందే అంతర్జాతీయ చలనచిత్రోత్సవాల్లో ప్రశంసలు దక్కించుకుంటున్నది. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ చిత్రానికి స్టాండింగ్ ఓవేషన్ దక్కింది. ఇటీవలే ఈ చిత్రాన్ని టోరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో కూడా ప్రదర్శించగా..అక్కడ కూడా ప్రశంసలు వెల్లువెత్తాయి. తాజా ఇంటర్వ్యూలో ఈ సినిమా గురించి జాన్వీకపూర్ ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. ఈ సినిమా ఒప్పుకునేముందు ఎలాంటి అంచనాలు పెట్టుకోలేదని, ఓ సాధారణ సినిమాగానే భావించానని జాన్వీకపూర్ పేర్కొంది. షూటింగ్ టైమ్‌లోనే సినిమా గొప్పతనం అర్థమైందని, టీమ్ అందరిలో ఏదో అద్భుతాన్ని సృష్టించబోతున్నామనే భావన కలిగిందని చెప్పింది. 'కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ సినిమాకు పది నిమిషాల పాటు స్టాండింగ్ ఓవేషన్ లభించడంతో ఈ కథ ఎంతగా ఒక్కొక్కరి హృదయాల్ని కదిలించిందో అర్థం చేసుకున్నా. గొప్ప కథలో భాగమైనందుకు గర్వంగా అనిపించింది' అని జాన్వీకపూర్ తెలిపింది.




# కమల్ యాక్షన్ ఎంటర్‌టైనర్



ఈ ఏడాది 'థగ్‌లైఫ్'తో పలకరించారు కమల్‌హాసన్. ఆయన తదుపరి సినిమా కోసం సినీ ప్రియులంతా ఆతృతగా ఎదురు చూస్తున్న నేపథ్యంలో రజనీకాంత్‌తో కలిసి మల్టీస్టారర్ చేయనున్నట్టు అధికారిక ప్రకటన వెలువడింది. సగటు ప్రేక్షకుడ్ని సైతం ఆనందింపజేసిన వార్త ఇది. అయితే.. ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కడానికి టైమ్ పడుతుంది. కారణం రజనీ ప్రస్తుతం ఖాళీగా లేరు. ఆయన 'జైలర్ 2' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఆ సినిమా పూర్తయితే గానీ ఇంకో సినిమా చేసే పరిస్థితి లేదు. కాబట్టి రజనీ ఫ్రీ అయ్యే లోపు కమల్ కూడా ఓ సినిమా చేసేందుకు రెడీ అయిపోయారు. కవల స్టంట్ కొరియోగ్రాఫర్లు అన్బరివ్, పుష్కరిన్‌లలో ఒకరైన అన్బరివ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తారు. కల్యాణి ప్రియదర్శిన్ కీలక పాత్ర పోషించనున్నట్టు సమాచారం. ఇందులో కమల్ కొత్త లుక్‌లో కనిపిస్తారని, హాలీవుడ్ స్థాయిలో యాక్షన్ ఎంటర్టైనర్‌గా ఈ సినిమా తెరకెక్కిస్తామని మేకర్స్ చెబుతున్నారు. జాతీయ అవార్డు గ్రహీత శ్యామ్ పుష్కరన్ రచనా సహకారం అందించనున్న ఈ చిత్రాన్ని ఆర్.మహేంద్రన్‌తో కలిసి రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్మించనున్నది.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314